శనివారం 14-12-2019

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 263



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'



**నిర్మలా శక్తి రామన్!**

'ఫోర్బ్స్' ప్రపంచ టాప్‌–100 శక్తివంతమైన మహిళల్లో చోటు..

- బిజినెస్‌లో



**ఎగుమతులు 'రివర్స్‌'లోనే..**

నవంబర్‌లో మైనస్ 0.34% క్షీణత. దిగుమతులూ అంతే..

- బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

## మృగాళ్లకు ఇక

# మరణ శాసనమే

### 'ఏపీ దిశ' బిల్లుకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం

- మహిళలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఉరిశిక్షే
- 7 పనిదినాల్లో దర్యాప్తు.. 14 పనిదినాల్లో విచారణ.. 21 పనిదినాల్లో తీర్పు
- పిల్లలపై లైంగిక వేధింపులకు గరిష్టంగా జీవిత ఖైదు
- సోషల్ మీడియాలో మహిళల్ని వేధిస్తే 2 నుంచి 4 ఏళ్ల జైలు

**సాక్షి, అమరావతి:** దేశంలో మొట్టమొదటిసారి మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రూపొందించిన చరిత్రాత్మక 'ఆంధ్రప్రదేశ్ దిశ' బిల్లుకు ఏపీ శాసనసభ శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మహిళలు, బాలికలపై అత్యాచారాలు వంటి క్రూరమైన నేరాలకు పాల్పడితే వారికి మరణ శాసనం లిఖించేలా, 21 పనిదినాల్లోనే తీర్పు ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకొస్తోంది. ఇందుకోసం ఇండియన్ పీనల్ కోడ్ క్రిమినల్ లా చట్టం– 1973ను ఏపీకి వర్తింపచేయడంతోపాటు, అందులో

మిగతా 2వ పేజీలో ▶



ఎక్కడైనా తప్పు జరిగితే వారంపాటు అందరం మాట్లాడి మర్చిపోతాం. ఆ పరిస్థితి ఉండొద్దు. మన ఇంట్లో అలాంటి ఘటనలు జరిగితే ఒక తండ్రి, ఒక అన్న, ఒక తమ్ముడు ఎలా ఫీలవుతారన్నది అందరూ ఆలోచించాలి. ఆ ధోరణితో చూసినప్పుడే ఇలాంటి నేరాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ఆ దిశలోనే నేను ఆలోచించా. అందుకే ఈ దిశ చట్టం తీసుకొస్తున్నా

– వైఎస్ జగన్

# రాహుల్... రేప్‌లను ఆహ్వానిస్తున్నారు

- రాహుల్ 'రేప్ ఇన్ ఇండియా' వ్యాఖ్యలపై లోక్‌సభలో దుమారం
- ఆయనకు శిక్ష పడాలన్న కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ
- ఎంపీగా కొనసాగే నైతిక హక్కు లేదన్న రాజ్‌నాథ్

- వివరాలు 5లో



"భారత్‌లో మహిళల్ని అత్యాచారం చేయండి అని ఒక నాయకుడు పిలుపునివ్వడం చరిత్రలో ఇదే తొలిసారి. రాహుల్ దేశ ప్రజలకు ఇచ్చే సందేశం ఇదేనా? దేశంలో మహిళల్ని, పురుషుల్ని కూడా రాహుల్ కించపరుస్తున్నారు. ఆయన్ను శిక్షించాల్సిందే.

– కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ

## అందుకే వస్తోంది

# ఆస్తమా

- బయటి కంటే 'ఇంటి కాలుష్యమే' ఎక్కువ కారణం
- దిండ్లు, దుప్పట్లు, అగరొత్తులు, పర్‌ఫ్యూమ్స్, పెట్స్‌తో ముప్పు
- పట్టణాల్లో 5, పల్లెల్లో 2 శాతం మంది ఆస్తమా బాధితులు
- డబ్బాపాలు, యాంటీ బయాటిక్స్‌తో పిల్లలకూ ప్రమాదమే..
- ఐసీఎంఆర్ తాజా అధ్యయనంలో వెల్లడి

2లో



# జాన్సన్ జయకేతనం

- బ్రిటన్ ఎన్నికల్లో 365 సీట్లతో కన్జర్వేటివ్ పార్టీ ఘన విజయం
- 203 సీట్లకే పరిమితమైన ప్రతిపక్ష లేబర్ పార్టీ
- 48 సీట్లతో మూడో స్థానంలో నిలిచిన స్కాటిష్ నేషనల్ పార్టీ
- బ్రెగ్జిట్ వ్యతిరేక లిబరల్ డెమొక్రాట్లకు 11 సీట్లు
- ఇతర పార్టీలకు 23 సీట్లు
- జనవరి 31కల్లా బ్రెగ్జిట్ ఖాయమన్న ప్రధాని జాన్సన్

- వివరాలు 5లో

## రణరంగంగా

# జామియా వర్సిటీ

- పౌరసత్వ సవరణ చట్టానికి నిరసనగా పార్లమెంట్‌కు విద్యార్థుల ర్యాలీ
- వర్సిటీ గేట్ వద్దే అడ్డుకున్న పోలీసులు; లాఠీచార్జ్
- అస్సాంలో ఆందోళనలు తగ్గుముఖం; డిబ్రూగఢ్‌లో కర్ఫ్యూ సడలింపు
- పశ్చిమ బెంగాల్‌లో రైల్వే స్టేషన్‌కు నిప్పు

- వివరాలు 5లో



రాళ్లు రువ్వుతున్న జామియా వర్సిటీ విద్యార్థులు













## దిశ నిందితుల మృతదేహాల్ని

# భద్రపర్చండి

**ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

**సాక్షి, హైదరాబాద్:** ఎన్‌కౌంటర్‌లో మరణించిన నలుగురు దిశ నిందితుల మృతదేహాల్ని భద్రపర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఈ ఆదేశాల్ని జారీ చేస్తున్నామని, మృతదేహాలు పాడుకాకుండా గాంధీ ఆస్పత్రిలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. సుప్రీంకోర్టులో ఇదే మాదిరి ప్రజాహిత వ్యాజ్యాలు విచారణలో ఉన్నందున తమ ముందున్న ప్రజాహిత వ్యాజ్యాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చెన్నకేశవుల మృతదేహాల్ని భద్రం చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో ఉందని, ఆ ఉత్తర్వుల ప్రతిని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ ధర్మాసనానికి నివేదించారు.

## దిశ నిందితుల ఎన్‌కౌంటర్ @ ఉ. 6:10 గం.

- ఫిర్యాదులో పేర్కొన్న షాద్‌నగర్ ఏసీపీ సురేందర్
- క్రైమ్ నం. 803/2019గా ఎఫ్ఐఆర్ నమోదు
- దర్యాప్తు అధికారులకు అందిన ఫోరెన్సిక్ నివేదిక!

- వివరాలు 2లో




epaper.sakshi.com

# అందుకే వస్తోంది.. ఆస్తమా..

- బయటి కంటే 'ఇంటి కాలుష్యమే' ఎక్కువ కారణం
- దిండ్లు, దుప్పట్లు, అగరొత్తులు, పర్‌ఫ్యూమ్స్, పెట్స్‌తో ముప్పు
- పట్టణాల్లో 5, పల్లెల్లో 2 శాతం మంది ఆస్తమా బాధితులు

సాక్షి, హైదరాబాద్

ఒకప్పుడు బయటి వాతావరణ కాలుష్యం ఆస్తమాకు కారణమని అంతా భావించేవారు. ఇప్పుడీ ముప్పు నేరుగా ఇంట్లోనే తిష్టవేసుక్కూర్చుంది. ఇండోర్ పొల్యూషన్ (దుప్పట్లు, తలదిండ్లు, పర్‌ఫ్యూమ్‌లు, మస్కిటోకాయిల్స్, అగరొత్తులు, పెంపుడు జంతువుల వెంట్రుకలు, బొద్దింకలు, ఎలుకల మలమూత్రాల నుంచి వెలువడే వాయువులు, దుమ్ముధూళి) ఆస్తమాకు ఎక్కువ కారణమవుతున్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సర్వేలో తేలింది. ఇంటా, బయటా కాలుష్య సమస్య వల్ల పట్టణాల్లో 5 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 2 శాతం మంది ఆస్తమాతో బాధపడుతుండగా, బాధితుల్లో 10–12 శాతం మంది చిన్నపిల్లలే ఉన్నట్లు సర్వే తేల్చింది. శుక్రవారం హోటల్ తాజ్‌కృష్ణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, ఛాతీ వైద్య నిపుణుడు డాక్టర్ విజయ్‌కుమార్ ఆస్తమాకు కారణమవుతున్న అంశాలను వివరించారు.



### ఇంటా బయటా తంటానే..

- గ్రేటర్‌లో 15 ఏళ్ల క్రితం ఉన్న 11 లక్షల వాహనాలు, 2019 నాటికి 55 లక్షలకు చేరాయి. వీటిలో పదిహేనేళ్ల సర్వీసు దాటినవి 10 లక్షలు. వీటి నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు శ్వాసకోశ సమస్యలకు కారణమవుతున్నాయి.
- 40 వేల వరకు ఉన్న పరిశ్రమలు వదిలే పొగ, వ్యర్థాల వల్ల క్యూబిక్ మీటర్ గాలిలో 130–150 మైక్రోగ్రాముల వరకు వివిధ కాలుష్య స్థాయిలు నమోదవుతున్నాయి.
- సల్ఫర్‌డయాక్సైడ్, హైడ్రోకార్బన్స్, నైట్రోజన్ ఆక్సైడ్, అమ్మోనియం, కార్బన్‌మోనాక్సైడ్ వంటి రసాయనాలతో కూడిన గాలిని పీల్చడం వల్ల శ్వాస నాళాలు దెబ్బతింటున్నాయి.
- ఇంట్లో వాడే మస్కిటోకాయిల్స్, పర్‌ఫ్యూమ్స్, పరుపు, తలదిండ్లలో పేరుకుపోయిన దుమ్ము ఆస్తమా కలిగిస్తున్నాయి.
- పోతపాలు, జంక్‌ఫుడ్డు, అతిగా యాంటీబయాటిక్స్ వాడటం వంటివి ఐదేళ్లలోపు చిన్నారుల శ్వాసనాళాలను దెబ్బతీస్తున్నాయి. వయసుతో పాటే తెరుచుకోవాల్సిన శ్వాసనాళాలు ఈ వయసు పిల్లల్లో మూసుకుపోతున్నాయని తేలింది.
- ప్రసవం తర్వాత చాలామంది తల్లులు బిడ్డలకు డబ్బా పాలు పడుతున్నారు. సాధారణ జ్వరానికీ ఖరీదైన యాంటిబయాటిక్స్ వాడుతున్నారు. ఇది పిల్లల్లో ఆస్తమాకు కారణమవుతోంది. శ్వాస సరిగా తీసుకోలేకపోవడం పిల్లల ఎదుగుదల, జ్ఞాపకశక్తి, చదువుపై ప్రభావం చూపుతోంది.

### నాడీ వ్యవస్థపై ప్రభావం

– డాక్టర్ పి.సుదర్శన్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్యనిపుణుడు



ఆస్తమాకు బయట ఉండే వాహన, పారిశ్రామిక కాలుష్యం, ధూమపానం వంటి వాటి కంటే ఇండోర్ పొల్యూషన్ (మస్కిటో కాయిల్స్, పర్‌ఫ్యూమ్స్, అగరొత్తులు, పెట్స్, దుప్పట్లు, దిండ్లు) ఎక్కువ ప్రమాదకరం. ఆస్తమా వల్ల శ్వాసనాళాలు మూసుకుపోయి ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు కంటిచూపు, కిడ్నీల పనితీరు మందగిస్తుంది.

### ఇన్‌హేలర్‌తో ఉపశమనం

– డాక్టర్ విజయ్‌కుమార్, పల్మనాలజిస్ట్, అపోలో ఆస్పత్రి



ఇంట్లో ఇన్‌హేలర్ ఉండాలి. టాబ్లెట్స్, ఇంజక్షన్లు, నెబ్యులైజర్‌తో పోలిస్తే ఇన్‌హేలర్‌తోనే ప్రయోజనం ఎక్కువ. వైద్య పరీక్షలతో పని లేకుండా క్లినికల్‌గానూ ఆస్తమాను నిర్ధారించవచ్చు. వ్యాధి తీవ్రతను బట్టి ఆరు నుంచి తొమ్మిది మాసాలు మందులు వాడితే చాలు.

**ఆస్తమా లక్షణాలివీ..** తరచూ దగ్గడం.. ఆయాసం.. కడుపు ఉబ్బరంగా ఉండటం.

**వీటికి దూరంగా ఉండాలి..** ఐస్‌క్రీమ్‌లు, శీతల పానీయాలు, కూలర్, ఏసీ, సిగరెట్, సిమెంట్, ఫ్లెక్సీ ప్రింటర్స్, పారిశ్రామిక, వాహన కాలుష్యం..

## దిశ నిందితుల ఎన్‌కౌంటర్ @ ఉ. 6:10 గం.

### ఫిర్యాదులో పేర్కొన్న షాద్‌నగర్ ఏసీపీ సురేందర్

**సాక్షి, హైదరాబాద్:** దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్న సమయం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ నెల 6న ఉదయం దాదాపు 5:45 గంటల నుంచి 6:15 గంటల మధ్య దిశ నిందితుల ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసులు ఇప్పటికే పేర్కొనగా ఇందుకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌లో కచ్చితమైన సమయం నమోదైంది. ఈ ఎఫ్‌ఐఆర్ ప్రకారం ఎన్‌కౌంటర్ ఘటనపై అదే రోజు ఉద యం 8.30 గంటలకు పోలీసులపై దాడి విషయాన్ని షాద్‌నగర్ ఏసీ పీ వి. సురేందర్ షాద్‌నగర్ పోలీసు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అందులో ఎన్‌కౌంటర్ జరిగిన సమయాన్ని ఉద యం 6:10 గంటలుగా పేర్కొన్నారు. దీంతో ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న ఈ సమయమే ప్రామాణికం కానుంది. ఈ ఫిర్యాదును ఎస్సై దేవరాజు స్వీకరించి క్రైం నంబర్ 803/2019గా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. దాడి, ఆయుధాల చట్టంలోని వివిధ సెక్షన్ల కింద నిందితులు మహ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులుపై కేసులు నమోదు చేశారు. ఎఫ్‌ఐఆర్‌ను ఉదయం 9.30 గంటలకల్లా షాద్‌నగర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌కు పంపించారు. దిశకు సంబంధించిన ఆధారాల కోసం ఈ నెల 6న ఉదయం 5:30 గంటలు దాటిన తరువాత నిందితులను చటాన్‌పల్లిలోని ఘటనా స్థలానికి పోలీసులు తీసుకెళ్లడం, నిందితులు పోలీసుల ఆయుధాలు లాక్కొని కాల్పులు జరపడం, పోలీసుల ఎదురుకాల్పుల్లో వారు హతమవడం తెలిసిందే.

**దిశపై అత్యాచారాన్ని నిర్ధారించిన ఫోరెన్సిక్ నివేదిక..**

దిశ అత్యాచారం కేసులో కీలకమైన ఫోరెన్సిక్ నివేదికలో దిశపై అత్యాచారం నిజమేనని తేలింది. ఈ ఘటన చోటుచేసుకున్న మరుసటి రోజు ఫోరెన్సిక్ టీం సభ్యులు దిశ దుస్తులు, వస్తువులు, నిందితులు ఉపయోగించిన లారీలో గుర్తించిన రక్తపు మరకలు, వెంట్రుకలు, దుస్తులకు అంటిన వీర్యపు మరకల ఆనవాళ్లను సేకరించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న తరువాత వారి నుంచి సేకరించిన శాంపిళ్లు, ఘటనా స్థలంలో లభించిన శాంపిళ్లతో సరిపోలినట్లు తెలియవచ్చింది. దీంతో దిశపై సామూహిక అత్యాచారం జరిపింది ఈ నలుగురేనన్న విషయం శాస్త్రీయంగా నిరూపితమైంది. అలాగే చటాన్‌పల్లి అండర్‌పాస్ వద్ద లభించిన కాలిపోయిన మృతదేహం దిశదేనని కూడా ఫోరెన్సిక్ బృందం తేల్చిందని, మృతదేహం నుంచి సేకరించిన స్టెర్నమ్ బోన్ డీఎన్‌ఏ దిశ తల్లిదండ్రులతో సరిపోలిందని సమాచారం. ఈ మేరకు ఫోరెన్సిక్ బృందం తమ నివేదికను దర్యాప్తు అధికారులకు సమర్పించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# మృగాళ్లకు ఇక మరణ'శాసనమే'

మొదటి పేజీ తరువాయి

అవసరమైన సవరణల చేస్తూ రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ దిశ చట్టం–క్రిమినల్ లా (సవరణ) బిల్లు–2019' బిల్లును ఏపీ శాసనసభ ఆమోదించింది. అలాగే పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే గరిష్టంగా జీవిత ఖైదు విధించేలా.. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా మహిళల్ని వేధించడం, అసభ్య పోస్టింగులు పెడితే రెండేళ్ల నుంచి నాలుగేళ్ల వరకూ జైలు శిక్ష విధించేలా ఈ చట్టంలో కొత్త సెక్షన్లను చేర్చారు. అలాగే మహిళలు, బాలలపై నేరాల్ని త్వరితగతిన విచారించేందుకు ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటునకు వీలు కల్పించే 'ఆంధ్రప్రదేశ్ దిశ చట్టం– మహిళలు, బాలలపై నిర్దేశిత నేరాల విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాల బిల్లు–2019'కు కూడా సభ ఆమోదం తెలిపింది. ఈ రెండు బిల్లులను శుక్రవారం శాసనసభలో హోంమంత్రి మేకతోటి సుచరిత ప్రవేశపెట్టగా.. చర్చలో పాల్గొన్న అధికార, ప్రతిపక్ష సభ్యులంతా మద్దతు పలికారు. అనంతరం సభ్యుల హర్షధ్వానాల మధ్య బిల్లులు సభ ఆమోదం పొందినట్లు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు.

### 'ఆంధ్రప్రదేశ్ దిశ' చట్టం, ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు బిల్లులోని ముఖ్యాంశాలు

- నిర్భయ చట్టం ప్రకారం అత్యాచార కేసుల్లో జైలు లేదా ఉరిశిక్ష విధిస్తుంటే... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ చట్టంతో అత్యాచారాలకు పాల్పడిన వారికి తప్పనిసరిగా మరణశిక్ష అమలు చేస్తారు.
- నిర్భయ చట్టంలోని సెక్షన్ల ప్రకారం 2 నెలల్లో దర్యాప్తు పూర్తిచేసి మరో 2 నెలల్లో శిక్ష పడేలా చూడాలి. మొత్తం 4 నెలల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియ పూర్తికావాలి. 'ఏపీ దిశ' చట్టంలో 4 నెలల సమయాన్ని 21 పనిదినాలకు కుదించారు.
- అత్యాచారం వంటి దురాఘతాలకు పాల్పడినప్పుడు విస్పష్టమైన, తిరుగులేని ఆధారాలు లభిస్తే.. 21 పనిదినాల్లో నిందితుడికి మరణశిక్ష పడాలి. ఏడు పనిదినాల్లో పోలీసు దర్యాప్తు పూర్తికావాలి. 14 పనిదినాల్లో న్యాయప్రక్రియ పూర్తి చేసి శిక్ష విధించాలి.
- పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడితే ఇప్పటి వరకూ పోక్సో చట్టం కింది ఏడాదిలోగా న్యాయప్రక్రియ పూర్తిచేయాలి. అయితే దిశ చట్టం ప్రకారం 7 పని దినాల్లో దర్యాప్తు, 14 పనిదినాల్లో న్యాయ విచారణ పూర్తిచేయాలి.
- పిల్లలపై లైంగిక నేరాలన్నింటికీ శిక్షల్ని పెంచారు. 'పోక్సో' చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు ప్రస్తుతం 3 ఏళ్ల నుంచి 7 ఏళ్ల వరకూ శిక్ష అమల్లో ఉంది. నేర తీవ్రతను బట్టి ఆ శిక్షను గరిష్ఠంగా జీవిత ఖైదుగా మార్చారు. ఇందుకోసం ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ)లో కొత్తగా సెక్షన్ 354(ఎఫ్)ను చేర్చారు.
- సోషల్‌మీడియా ద్వారా మహిళలను వేధించడం, వారిపై అసభ్య పోస్టింగులు పెట్టడం చేస్తే ఐపీసీ ప్రకారం ఇప్పటివరకు నిర్దిష్టమైన శిక్షలు లేవు. అయితే దిశ చట్టం ప్రకారం ఇలాంటి కేసుల్లో మొదటిసారి రెండేళ్ల జైలు, రెండోసారి కూడా చేస్తే 4 ఏళ్ల జైలు శిక్షతో పాటు గరిష్ఠంగా రూ. 5లక్షల వరకు జరిమానా విధించేలా ఐపీసీలో 354 (ఇ) సెక్షన్‌ను తీసుకొచ్చారు.

### దేశ చరిత్రలో తొలిసారి ప్రత్యేక కోర్టులు

దేశంలో ఏ రాష్ట్రంలోనూ మహిళలు, పిల్లలపై నేరాల సత్వర విచారణకు జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు లేవు. దేశ చరిత్రలో తొలిసారి మహిళలు, పిల్లలపై నేరాల విచారణకు.. త్వరితగతిన విచారణ ముగించేందుకు ప్రతి జిల్లాకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం 'ఆంధ్రప్రదేశ్ దిశ చట్టం– మహిళలు, బాలలపై నిర్దేశిత నేరాల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాల బిల్లు–2019'ను శాసనసభ ఆమోదించింది.

- అత్యాచారం, సామూహిక అత్యాచారం, యాసిడ్ దాడులు, సోషల్‌మీడియా ద్వారా వేధించడం వంటి నేరాలు, పోక్సో పరిధిలోకి వచ్చే నేరాల్ని ఈ ప్రత్యేక కోర్టులు విచారిస్తాయి. ఈ నేరాలపై దోషులు పైకోర్టుకు వెళ్లి అప్పీలు చేసుకునే గడువు.. కేంద్ర ప్రభుత్వ చట్టంలో 6 నెలలుగా ఉండగా.. ఏపీలో 45 రోజులకు తగ్గించారు.
- మహిళలు, పిల్లలపై నేరాల సత్వర విచారణ కోసం ప్రత్యేక పోలీసు బృందాల్ని, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లని, ప్రత్యేక కోర్టుల్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర చట్టాల్లో ఇంతవరకూ ఎలాంటి ఏర్పాట్లు లేవు. కొత్త చట్టం ప్రకారం జిల్లా స్థాయిలో డీఎస్పీ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ స్పెషల్ పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసేందుకు వీలు కల్పించారు. అలాగే ప్రతి ప్రత్యేక కోర్టుకు ప్రత్యేకంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లని నియమించుకునే అవకాశాన్ని కల్పించారు.
- మహిళలు, పిల్లలపై నేరాలు నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ రిజిస్ట్రీని కొనసాగిస్తోంది. అయితే జరిగిన నేరాలు, దాంతో సంబంధం ఉన్న వ్యక్తుల పేర్లు వంటి వివరాలను బహిర్గతం చేసే అవకాశం లేదు. అంటే ఎవరు ఏ నేరం చేశారన్న వివరాలు ప్రజలకు తెలిసే అవకాశం లేదు. అలాంటి డిజిటల్ రిజిస్ట్రీని మన రాష్ట్రంలో ఏర్పాటు చేయడమే కాకుండా నేరాలకు సంబంధించిన వివరాలు ప్రజలందరికీ అందుబాటులోకి ఉంచడంద్వారా నేరస్తుల వివరాలు బహిర్గతం చేయబోతున్నారు.

## 1000 ఔట్.. 1334 ఇన్

- ఆర్టీసీలో సొంత బస్సులు.. అద్దె బస్సుల దోబూచులాట
- 35 శాతానికి చేరనున్న హైర్ బస్సులు
- 4 వేల మంది సిబ్బంది 'అదనం'
- వీరి సర్దుబాటు కోసం కమిటీ ఏర్పాటు

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీలో సొంత బస్సులు వేయి వరకు తగ్గిపోనుండగా, అదే సమయంలో 1,334 అద్దె బస్సులు వచ్చి చేరబోతున్నాయి. అద్దె బస్సులు పెరిగే కొద్దీ నష్టాలు ఎక్కువవుతాయన్న నిపుణుల సూచనలు కాదని, సిబ్బంది జీతాల భారం, బస్సులపై పెట్టుబడి తగ్గించుకునే క్రమంలో అద్దె బస్సుల వైపు ఆర్టీసీ చూస్తోంది. ఈ క్రమంలో ఇప్పుడున్న 2,100 అద్దె బస్సులకు అదనంగా మరో నెల రోజుల్లో 1,334 వచ్చి చేరబోతున్నాయి. దీంతో మొత్తం బస్సుల్లో ఇవి 35 శాతానికి చేరనున్నాయి. అద్దె బస్సుల్లో కండక్టర్లు మాత్రమే ఆర్టీసీ వారుంటారు. డ్రైవర్లను బస్సుల యజమానులే ఏర్పాటు చేసుకుంటారు. మరోవైపు హైదరాబాద్‌లో వేయి సొంత బస్సులను తగ్గించుకునే పని ఇప్పటికే ఆర్టీసీ ప్రారంభించింది. శనివారం నుంచి ఆ బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. ఈ బస్సుల కండక్టర్లను పెరుగనున్న అద్దె బస్సులకు వినియోగించినా, డ్రైవర్లు మిగిలిపోతారు. ఇలా త్వరలో మొత్తం 5 వేల మంది సిబ్బంది అదనంగా మారనున్నారు. ప్రస్తుతం వేయి బస్సుల తొలగింపుతో 4 వేల మంది వరకు మిగిలిపోనున్నారు. వీరిని ఎలా సర్దుబాటు చేయాలన్నది ఆర్టీసీ ముందు పెద్ద సవాల్‌గా నిలిచింది. దీంతో ఈడీలు, ఫైనాన్స్ అడ్వయిజర్‌తో కలసి ఓ కమిటీని ఎండీ సునీల్‌శర్మ ఏర్పాటు చేశారు. 17లోగా నివేదిక అందజేయాల్సిందిగా ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే సరుకు రవాణా విభాగంలో అవసరమైన వారిని వినియోగించుకోవడం, తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బంది స్థానంలో వీరిని వాడుకోవడం, చదువు అర్హత ఉన్న వారిని జూనియర్ అసిస్టెంట్లుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా, టికెట్ చెకింగ్ సిబ్బందిగా విధులు వేయడం... పలు అంశాలను ఈ కమిటీ పరిశీలించనుంది. ఇతర ప్రభుత్వ విభాగాల్లో డ్రైవర్లుగా పంపే అంశాన్ని నేరుగా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

**త్వరలో కొత్త అద్దె బస్సులు..**

సమ్మె సమయంలో ఆర్టీసీ కొత్తగా అద్దె బస్సుల కోసం రెండు నోటిఫికేషన్లు విడుదల చేసింది. దీనికి సంబంధించి 1,334 అద్దె బస్సులను ఖరారు చేశారు. నోటిఫికేషన్ ఒప్పందం ప్రకారం.. జనవరి 26 వరకు నిర్వాహకులకు గడువు ఉంది. ఆ లోపు బస్సులను అందుబాటులో ఉంచాలి. ఇందులో 61 బస్సులు మాత్రమే నగరంలో నడుస్తాయి. మిగతావన్నీ జిల్లాల్లో ఉంటాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతాలకు బస్సు వసతి మెరుగవుతుంది. వేయి బస్సులు తగ్గటంతో ఇబ్బంది పడే నగర ప్రయాణికులకు మాత్రం ఇవి ఊరటనిచ్చే అవకాశం లేదు.

# ఆర్టీసీకి స్వర్ణయుగం

- దేశంలోనే ఉన్నత సంస్థగా మారనుంది
- మొన్నటి సమ్మెతోనే దీనికి బీజం పడింది
- ఆర్టీసీకి బ్రాండ్ అంబాసిడర్ కేసీఆరే
- చార్జీల పెంపును ప్రజలు అర్థం చేసుకున్నారు
- సరుకు రవాణాతో ఏటా రూ.400 కోట్ల ఆదాయం
- డిపోకి ఇద్దరు చొప్పున 200 మందితో వెల్ఫేర్ కౌన్సిళ్లు
- 'సాక్షి'తో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



**సాక్షి, హైదరాబాద్:** ''ఓ ఘనత సాధించాలంటే కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. ఓ మంచి జరగాలంటే కొన్ని అడ్డంకులు ఎదురుపడతాయి. కానీ వాటిని అధిగమించి ముందుకు సాగినప్పుడు.. లోటుపాట్లు, లోపాలను తెలుసుకుని సరిదిద్దినప్పుడు అద్భుత ఆరంభానికి ఆస్కారం కలుగుతుంది. ఇప్పుడు ఆర్టీసీ విషయంలో అదే జరిగింది. మొన్నటి సమ్మె ఆర్టీసీని గొప్ప సంస్థగా మార్చబోతోంది. వాస్తవంగా చెప్పాలంటే ఆర్టీసీకి ఇది స్వర్ణయుగం. ఇంతకాలం అప్పులు, నష్టాల కుప్పగా ఉన్న సంస్థ.. వాటి నుంచి బయటపడే సమయం మొదలైంది. ఇందుకు ఆ సమ్మెనే బీజం వేసింది''అని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. సంస్థ గురించి తెలుసుకునేలోపే సమ్మె వచ్చింది. దాదాపు రెండు నెలలపాటు సమ్మె ప్రత్యామ్నాయ చర్యల గురించి తప్ప సంస్థ గురించి ఆలోచించే పరిస్థితే రాలేదు. ఇప్పుడు అన్నీ కొలిక్కి రావడంతో ఆర్టీసీపై దృష్టి సారించారు. ఇన్ని రోజులు పేరుకుపోయిన ఫైళ్లను శుక్రవారమే తెరిచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

**ఆ తీరు మారింది**

సమ్మె ముగిసిన వెంటనే ఖమ్మంలో ఆర్టీసీ డిపోకు వెళ్లి ఖాకీ చొక్కా వేసుకుని ఓ బస్సును అలా బయట వరకు నడిపా. స్టీరింగ్ ముందు కూర్చున్నందుకు ఎంతో ఉద్వేగానికి లోనయ్యా. మరి సంస్థ ఉద్యోగులుగా ఉండి ఉద్యోగం చేయటానికి ఇబ్బంది పడేవారిని ఏమనాలి? అలా కొందరు పనిచేయక, ఇతర ఉద్యోగులను పని చేయించనీయక పక్కదారి పట్టించారు. ఆ తీరు మారాలనేదే ముఖ్యమంత్రి ఆలోచన. ఇప్పుడదే జరిగింది. అంతా సంతోషంగా పని ప్రారంభించారు. ఉద్యోగులు– అధికారులు ఏకమై ఉత్సాహంగా, సవాలుగా స్వీకరించి మరీ పని చేస్తున్నారు. చూస్తుండగానే దేశంలోనే గొప్ప రవాణా సంస్థగా ఈ ఆర్టీసీ ఎదుగుతుంది. అందుకే దాని బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావే.

**అతలాకుతలం నుంచి ప్రగతి వైపు...**

సాధారణంగా బస్సు చార్జీలు పెంచితే ప్రజలు వ్యతిరేకిస్తారు. ఈసారి ఆ పరిస్థితి లేదు. ఆర్టీసీ పతనావస్థలో ఉందని, దానికి కాయకల్ప చికిత్స అవసరమని వారు నిర్ధారణకు వచ్చారు. చార్జీలు పెంచితే మంచే జరుగుతుందన్న నిజాన్ని అర్థం చేసుకుని సహకరించారు. రెండు నెలల అతలాకుతల పరిస్థితి నుంచి వెంటనే ఆర్టీసీ ప్రగతి బాట పట్టింది. ప్రస్తుతం ఆక్యుపెన్సీ రేషియో 69 శాతం దాటుతోంది. కొద్దిరోజుల్లో పూర్వపు పరిస్థితి 72 శాతాన్ని అధిగమించి చరిత్ర సృష్టించనుంది.

**ఉద్యోగుల్లో ఉత్సాహం**

ముఖ్యమంత్రి సూచన మేరకు కొత్తగా వెల్ఫేర్ కౌన్సిల్స్ ఏర్పాటు చేశాం. డిపోకు ఇద్దరు చొప్పున మొత్తం 200 మందితో సిద్ధంచేశాం. వారిలోంచి రీజియన్ స్థాయిలో కొందరిని ఎంపిక చేసి ఓ కమిటీ, ఆ కమిటీల్లోంచి ఓ 20 మందిని ఎంపిక చేసి కార్పొరేషన్ స్థాయిలో కమిటీ ఏర్పాటు చేస్తాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఆర్టీసీ పురోగతికి అనుసరించాల్సిన ఆలోచనలు అన్నీ ఈ కమిటీ నుంచే వస్తాయి. ఈ కమిటీలు కావాలని ఇప్పటికే 45వేల మంది సంతకాలు చేశారు. మరో రెండుమూడు రోజుల్లో మిగతా వారు చేస్తారు. వీరితో బలవంతంగా సంతకాలు తీసుకుంటున్నారన్న ఆరోపణ తప్పు. ఇప్పుడు ఏ డిపోకు వెళ్లినా ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా విధుల్లోకి వస్తున్నారు. వారిలో విప్లవాత్మక మార్పు వచ్చింది. గైర్హాజరీ గల్లంతైంది. సమయపాలన పెరిగింది. సిన్సియర్‌గా అన్ని ట్రిప్పులు తిప్పుతున్నారు. బలవంతంగా సంతకాలు తీసుకుంటే ఈ పరిస్థితి ఉండదు. ఇక డిపో స్థాయిలో ఓ ఫిర్యాదుల బాక్సు ఏర్పాటుచేస్తాం. ఉద్యోగులు తమ ఫిర్యాదులను రాసి అందులో వేస్తే ప్రతిరోజూ 11 గంటలకల్లా వెల్ఫేర్ కౌన్సిల్ సభ్యులు చూసి డిపో మేనేజర్‌తో మాట్లాడి మధ్యాహ్నం 3 గంటల లోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. హైదరాబాద్‌తోపాటు కొన్ని ఇతర చోట్ల ఉద్యోగుల ఛేంజ్ ఓవర్ పాయింట్ల వద్ద వసతులు లేవు. అందుకోసం కొన్ని పాత బస్సులను మొబైల్ టాయిలెట్లు, ఛేంజ్ ఓవర్ రూములుగా మార్చి ఆయా చోట్ల ఏర్పాటు చేస్తాం.

**ఆదాయం పెరిగింది**

సమ్మెకు ముందు సంస్థ రోజువారీ ఆదాయం రూ.11 కోట్లు, ఖర్చు రూ.13 కోట్లు. ఇప్పుడు రోజువారీ ఆదాయం రూ.13 కోట్లకు చేరింది. కొద్ది రోజుల తర్వాత ఖర్చు కంటే ఆదాయమే ఎక్కువగా ఉంటుంది. ఇక కార్మిక సహకార పరపతి సంఘం (సీసీఎస్), పీఎఫ్‌లకు సంబంధించిన బకాయిలను కోర్టు సూచన మేరకు విడతలవారీగా తీర్చేస్తాం.

**దూర ప్రాంతాలకు స్లీపర్ బస్సులు**

గతంలో వెన్నెల పేరుతో స్లీపర్ బస్సులుండేవి. కానీ ఫెయిలయ్యాయి. ఇప్పుడు కొన్ని ఏసీ బస్సుల్లో బెర్తులు ఏర్పాటు చేసి దూర ప్రాంతాలకు స్లీపర్ బస్సులుగా తిప్పుతాం. తొలుత 25 బస్సులతో ప్రారంభిస్తాం. ఇక ప్రతి డిపో నుంచి దూర ప్రాంతాలకు బస్సులు తిరిగేలా చూస్తాం. నష్టాల్లో కూరుకుపోయిన వజ్ర బస్సులను హైదరాబాద్‌లోని కాలనీలు, హైటెక్‌సిటీ వైపు తిప్పుతాం. మెట్రో రైలుతో సిటీ సర్వీసులు అనుసంధానిస్తాం. నగరంలో బస్సుల సంఖ్యను తగ్గించినా, ఉన్నవాటిని హేతుబద్ధీకరించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

**పార్శిల్ సర్వీసు బలోపేతం...**

కొన్ని పాత బస్సులను తొలగించి వాటి బాడీని మార్చి సరుకు రవాణా ప్రారంభిస్తున్నాం. సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పౌర సరఫరాల శాఖ, ప్రభుత్వ గోదాములు.. ఇలా ప్రభుత్వం రంగంలో సరుకు రవాణా చేసే అన్ని చోట్ల ఈ బస్సులను వినియోగిస్తాం. ఇక పార్శిల్ సర్వీసును బలోపేతం చేస్తాం. ఈ రూపంలో ఆర్టీసీకి సాలీనా రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నాం. జనవరిలో స్లీపర్ సర్వీసులు, రవాణా బస్సులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

**సీఎం ప్రత్యేక దృష్టి**

ఆర్టీసీని అద్భుతంగా మార్చేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇంతకాలం కొందరు యూనియన్ నేతల మాటలకు మోసపోయి ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. సమ్మె తర్వాత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వారు చాలా సంతోషంగా ఉన్నారు. వారి ఆలోచన విధానం మారింది. సీఎం కూడా ఉత్సాహంగా స్పందిస్తున్నారు. ఇకపై ఆయన క్రమం తప్పకుండా ఆర్టీసీపై దృష్టి సారిస్తారు. ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో సూచనలు చేస్తున్నారు. వాటిని అమలు చేయటం ద్వారా సంస్థను బలోపేతం చేసి తద్వారా ప్రజలకు మెరుగైన సేవ చేయగలుగుతాం.

## లోకాయుక్త చైర్మన్ నియామక నిబంధనలో సవరణ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర లోకాయుక్త పదవిలో నియమించేవారి అర్హతల పరిధిని మార్చు చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఇప్పటి వరకు హైకోర్టు రిటైర్డు ప్రధాన న్యాయమూర్తి మాత్రమే ఆ పదవికి అర్హులని లోకాయుక్త చట్టంలో ఉంది. అయి తే రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి లేనప్పుడు ఆ పదవిలో హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తిని నియమించేందుకు వీలుగా ప్రభుత్వం సవరణ చేసింది. ఈ మేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం ఆర్డినెన్స్ జారీ చేశారు. ఇదిలా ఉండగా లోకాయుక్త పదవికి హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ చంద్రయ్య పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## సాట్స్‌లో 20 మందికి కారుణ్య ఉద్యోగాలు

### నియామక పత్రాలు అందజేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (ఎస్‌ఏటీఎస్)లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు మోక్షం కలిగింది. 2007 నుంచి ఈ నియామకాలు పెండింగ్‌లో ఉండగా.. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశంతో రాష్ట్ర ఆబ్కారీ, క్రీడా, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం 20 మంది మరణించిన ఉద్యోగుల వారసులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి, సంగీత, నాటక అకాడమీ చైర్మన్ శివ కుమార్, స్పోర్ట్స్ ఎండీ దినకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## టీ వర్క్స్ ఆధ్వర్యంలో ఐపీఎఫ్‌సీ ప్రారంభం

### స్టార్టప్‌లు, ఎస్‌ఎంఈలు, గ్రామీణ ఆవిష్కర్తలకు చేయూత

**సాక్షి, హైదరాబాద్:** తమ ఆవిష్కరణలపై న్యాయ హక్కులు పొందడమే కాకుండా, ఆదాయం రూపంలోనూ ఆవిష్కర్తలకు లబ్ధి చేకూర్చేందుకు ఐపీఎఫ్‌సీ సహకారం అందిస్తుందని టీ వర్క్స్ సీఈఓ సుజయ్ కారంపూరి అన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్ 'టీ వర్క్స్'ఆధ్వర్యంలో శుక్రవారం 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ (ఐపీఎఫ్‌సీ)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆవిష్కర్తలు తమ నూతన ఆవిష్కరణలపై పేటెంట్ హక్కు పొందడానికి అవసరమయ్యే దరఖాస్తులను పూరించడం, తక్కువ ఫీజుతో పేటెంట్ దక్కేలా చూడటం వంటి విషయాల్లో ఐపీఎఫ్‌సీ సహకారం అందిస్తుందన్నారు. స్టార్టప్‌లు, సూక్ష్మ, లఘు పరిశ్రమలు, గ్రామీణ ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణపై పేటెంట్ హక్కులు రిజిస్ట్రేషన్ తదితరాలను తక్కువ రేట్లకే నమోదయ్యేలా చూస్తుందన్నారు. ఆవిష్కర్తలు తమ దరఖాస్తులను తెలంగాణ టీ వర్క్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.

## బాసర ఐటీకి ఆసియా ఎడ్యుకేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఐఐఐటీ ప్రతినిధి శివరాం మల్లెల

**బాసర (ముథోల్):** నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్ ఐటీకి అంతర్జాతీయ స్థాయిలో ఆసియా ఎడ్యుకేషన్ అవార్డు లభించింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును కళాశాల వైస్ చాన్స్‌లర్ అశోక్ తరఫున కళాశాల ప్రతినిధి శివరాం మల్లెల అందుకున్నారు. ట్రిపుల్ ఐటీలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక, సైన్స్ విద్య అందిస్తున్నారు. యూనివర్సిటీ ప్రారంభం నుంచి నేటి వరకు కళాశాల విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు ప్రాంగణ నియామకాల్లో పెద్దపీట వేస్తున్నాయి. అందుకనుగుణంగా విద్యార్థులూ మెరికల్లా రాణిస్తున్నారు. విద్యార్థులకు సాంకేతిక విద్య, అత్యున్నత ప్రయోగ శాలలు, వివిధ సంస్థల ద్వారా ఇంక్యుబేటర్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఫలితంగా విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నత విలువ కలిగిన విద్యను యూనివర్సిటీ నుంచి అందుకుంటున్నట్లు ప్రతినిధి శివరాం పేర్కొన్నారు.

## ధాన్యం డబ్బుల కోసం వెళ్లి మృత్యుఒడికి..

### బ్యాంకులో కుప్పకూలిన రైతు


సాయిబాబా

**బీర్కూర్:** ధాన్యం డబ్బులను డ్రా చేసుకోవడానికి బ్యాంకుకు వెళ్లిన ఓ రైతు.. అక్కడే గుండెపోటుకు గురై మరణించాడు. ఈ ఘటన శుక్రవారం కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బరంగేడ్గి గ్రామానికి చెందిన సాయిబాబా (55) వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల వరి ధాన్యాన్ని విక్రయించాడు. ఆ డబ్బులు బీర్కూర్‌లోని ఆంధ్రా బ్యాంకులో డ్రా చేసుకోవడానికి శుక్రవారం వెళ్లాడు. క్యూలైన్‌లో నిల్చున్న సాయిబాబా.. కొద్దిసేపటికే గుండెపోటుతో మృతి చెందాడు.

## కూతురిపై అత్యాచారం.. తండ్రికి జీవితఖైదు

**సాక్షి, సంగారెడ్డి/వర్గల్:** కూతురిపై అత్యాచారం చేసిన నిందితుడికి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో మొదటి అదనపు జడ్జి పాపిరెడ్డి తీర్పు నిచ్చారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నెంటూర్‌కు చెందిన భీమగాళ్ల బాబు (40) కన్న కూతురైన 15 ఏళ్ల బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. 2018 అక్టోబర్ 12న భర్తపై ముత్తమ్మ ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో బాబుకు కోర్టు జీవిత ఖైదు, జరిమానా విధించింది.

## పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

**సిద్దిపేటకమాన్:** కూతురిపై అత్యాచార యత్నానికి పాల్పడ్డ ఘటనకు సంబంధించిన కేసులో కోర్టు నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించింది. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం గాగిల్లాపూర్‌కు చెందిన శ్రీను(40), ఏప్రిల్ 8న తన రెండో కూతురుతో అసభ్యంగా ప్రవర్తించగా.. అడ్డుకున్న భార్యను గాయపరిచాడు. దీంతో భార్య ఫిర్యాదు మేరకు సిద్దిపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కోర్టులో నేరం రుజువైనందున శ్రీనుకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## కరీంనగర్‌లో 'భరోసా' కేంద్రం: స్వాతిలక్రా

**కమాన్‌చౌరస్తా (కరీంనగర్):** కరీంనగర్‌లో త్వరలో భరోసా కేంద్రం ఏర్పాటు చేయనున్నామని ఐజీ స్వాతి లక్రా వెల్లడించారు. శుక్రవారం ఉదయం కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లో పోక్సో చట్టంపై పోలీసు అధికారులు, సీఐలు, ఎస్‌ఐలకు ఏర్పాటు చేసిన ఒక రోజు అవగాహన సదస్సులో ఆమె మా ట్లాడారు.. పోక్సో కేసుల విషయంలో బాధితులకు భరోసా కేంద్రం బాసటగా నిలుస్తుందని చెప్పారు. భరోసా కేంద్రాల ద్వారా హైదరాబాద్, రాచకొండ, వికారాబాద్ కమిషనరేట్ పరిధిలో కేసులు 10 నుంచి 30 శాతానికి పెరిగిందని తెలిపారు. ఈ కేంద్రంలోనే వైద్య పరీక్షలు, న్యాయ సలహాల కోసం అధికారులను ఏర్పాటు చేస్తామన్నారు.

## ఫొటో దిగితేనే బాటిల్‌లో పెట్రోల్

**కేసముద్రం:** వెటర్నరీ డాక్టర్ దిశ, తహసీల్దార్ విజయారెడ్డి ఘటనల నేపథ్యంలో రాష్ట్రంలో పలు ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఈ ఘటనల్లో నిందితులు పెట్రోల్‌ను వినియోగించిన విషయం తెలిసిందే. దీంతో బంకుల్లో విడిగా పెట్రోలు పోయకూడదని సర్కారు నుంచి ఆదేశాలు ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం విలేజ్‌లోని పెట్రోల్ బంకులో 'బాటిల్స్‌లో పెట్రోల్ పోయబడదు'అని బోర్డు ఏర్పాటు చేశారు. అయితే పంటలకు పురుగు మందు కొట్టడానికి వినియోగించే స్ప్రే పంపు, వాహనాలు మధ్యలో ఆగిపోతే డీజిల్, పెట్రోల్ అవసరం ఉన్నందున.. ఇంధనం అవసరమైన వ్యక్తి ఫోన్ నంబర్, వాహనం నంబర్, ఫొటోను స్మార్ట్‌ఫోన్‌లో తీసుకుని పెట్రోల్, డీజిల్ ఇస్తున్నట్లు బంక్ నిర్వాహకులు చెబుతున్నారు.


బాటిల్‌లో పెట్రోల్, డీజిల్ పోయబడదు అని బోర్డు ఏర్పాటు

# బాల నాయకుడిగా వెళ్లి.. బడానేతగా ఎదిగి..

- నాలుగు దశాబ్దాల ఉద్యమ నేపథ్యం
- ముగిసిన మావోయిస్టు నేత రామన్న ప్రస్థానం
- అనారోగ్యంతో కన్నుమూత మావోయిస్టు పార్టీ ప్రకటన


రామన్న

**సాక్షి, సిద్దిపేట/ మద్దూరు:** మావోయిస్టు పార్టీకి గుండెకాయలాంటి దండకారణ్యంలో పార్టీ విస్తరణలో కీలక భూమిక పోషించిన రామన్న అలియాస్ రావుల శ్రీనివాస్ అనారోగ్యంతో కన్నుమూశారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం బెక్కల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ నాలుగు దశాబ్దాల క్రితం పదిహేనేళ్ల వయసులోనే ప్రజల కోసం అడవి బాటపట్టారు. దూల్మిట్టలో ఏడవ తరగతి చదువుతున్న సమయంలో ఆర్‌ఎస్‌యూ (రాడికల్ స్టూడెంట్స్ యూనియన్) భావాలకు ఆకర్షితుడయ్యారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలో సాధారణ దళ సభ్యునిగా చేరారు. అప్పట్లో ఆయన వయసు 15 సంవత్సరాలే. కిట్‌బ్యాగులు కూడా మోయలేని పరిస్థితిలో వెళ్లి జీవితాన్ని పార్టీకి అంకితం చేశారు. పార్టీ నిర్మాణంలో చురుగ్గా పాల్గొని ఛత్తీస్‌గఢ్, ఒడిసా, మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్.. ఇలా ఐదు రాష్ట్రాల్లో రామన్న కీలక నాయకుడిగా ఎదిగారు. 2010లో జరిగిన మవోయిస్టు పార్టీ సమావేశాల్లో రామన్నను కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమించారు. అప్పటి నుండి ఐదు రాష్ట్రాల్లో విస్తరించిన దండకారణ్యం ప్రాంతంలో రామన్న చెప్పిందే వేదం. దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపించడంలో కీలకంగా వ్యవహరించారు. మైదాన ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి తీవ్ర ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ దండకారణ్యంలో పార్టీని బలోపేతం చేయడంలో రామన్న ప్రధాన పాత్ర పోషించారు. ఆయన తలపై వివిధ రాష్ట్రాలు రూ.1.5 కోట్ల రివార్డు ప్రకటించాయి.


విషణ్ణవదనంతో రామన్న కుటుంబ సభ్యులు

### బీపీ, షుగర్‌తో ఆరోగ్య సమస్యలు

ఒకవైపు మావోయిస్టు పార్టీలో కీలక భూమిక పోషించే నాయకుడిగా ఎదిగిన రామన్నను అదే రీతిలో అనారోగ్య సమస్య కూడా వెంటాడుతూ వచ్చింది. నిత్యం పోలీసు బలగాలు, ఇన్‌ఫార్మర్లు ఆయన కోసం గాలిస్తుండటంతో ఎప్పటికప్పుడు బస మార్చాల్సి రావడం.. తీవ్రమైన బీపీ, షుగర్ సమస్యలతో రామన్న తరచుగా అనారోగ్యానికి గురయ్యేవారు. అయినా నమ్ముకున్న సిద్ధాంతం కోసం తుపాకీ మాత్రం వదిలిపెట్టకుండా తన ప్రస్థానం కొనసాగించారు. విప్లవోద్యమచరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న రామన్న ఈనెల 10న అనారోగ్యంతో దండకారణ్యంలో కన్నుమూసినట్లు ఆ పార్టీ ప్రతినిధి వికల్ప్ ప్రకటించారు. దీంతో రామన్న మృతిపై నాలుగు రోజులుగా నెలకొన్న సందిగ్ధం తొలగింది.

### బెక్కల్‌లో విషాదం

రావుల శ్రీనివాస్ అలియాస్ రామన్న మృతి చెందిన విషయం తెలియడంతో ఆయన స్వగ్రామం బెక్కల్‌లో విషాదం నెలకొంది. రావుల వరవ్వ, రామలింగం దంపతుల సంతానం నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెల్లో రామన్న చిన్నకుమారుడు. అన్న పరుషరాములు అలియాస్ సత్తన్న స్ఫూర్తితో ఆయన ఏడవ తరగతి చదువుతూ 1980లో అజ్ఞాతం బాటపట్టారు. అప్పటి నుండి పదేళ్ల తర్వాత 1991లో గ్రామానికి ఒకసారి వచ్చిపోయిన రామన్న మళ్లీ తిరిగి చూడలేదు. సావిత్రి అనే సహచర సభ్యురాలిని వివాహం చేసుకున్నారు. రామన్న సోదరుడు పరుషరాములు, ఆయన భార్య కనకవ్వ అలియాస్ శాంతక్క మావోయిస్టు పార్టీలో పనిచేస్తూ 1993లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మరో అన్న బాలయ్య కొమురవెల్లిలో ఉంటూ మరణించారు. రెండో అన్న చంద్రయ్య బెక్కల్‌లో గీతకార్మికుడుగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

# ఆర్థిక మాంద్యంలో రాష్ట్రం


బుల్లెట్‌పై మంత్రి హరీశ్‌రావు

### ఆచితూచి అడుగులేయాలి: హరీశ్

**సాక్షి, సిద్దిపేట:** 'రాష్ట్రం ఆర్థిక మాంద్యంలో ఉంది.. కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ఆచితూచి పనులు చేసుకోవాలి. మునుముందు మంచి రోజులు వస్తాయి. అప్పుడు అన్ని పనులు పూర్తి చేసుకోవచ్చు'అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేట నియోజకవర్గంలోని రాఘవాపూర్, చిన్నకోడూరు, పెద్ద లింగారెడ్డిపల్లి, సిద్దిపేటలో డబుల్ బెడ్రూం ఇండ్లు, కుల సంఘాల భవనాలకు ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే సిద్దిపేట పట్టణంలో టౌన్‌హాల్‌ను ప్రారంభించారు. రాఘవాపూర్ నుంచి పెద్ద లింగారెడ్డిపల్లి వరకు బుల్లెట్ వాహనంపై పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏమో ఇస్తుందని, ఎదురు చూడకుండా గ్రామాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం సంతోషకరం అన్నారు. త్వరలో సిద్దిపేట జిల్లాతోపాటు, ఉమ్మడి మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్‌కు గోదావరి జలాలు అందుతాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

## నిప్పు రవ్వయి 'చుట్టే'సింది!

### చుట్ట తాగుతుండగా దుప్పటికి నిప్పంటుకుని వృద్ధుడి సజీవదహనం



**డిచ్‌పల్లి:** చుట్ట తాగుతుండగా ప్రమాదవశాత్తు దుప్పటికి నిప్పంటుకోవడంతో ఓ వృద్ధుడు సజీవదహనం అయ్యాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్ద మల్లయ్య (78)కు చుట్ట తాగే అలవాటు ఉంది. గురువారం రాత్రి భోజనం చేసిన తర్వాత మంచంపై పడుకుని చుట్ట తాగుతుండగా దుప్పటిపై నిప్పు రవ్వలు పడి అంటుకుంది. క్రమేపీ మంటలు ఎక్కువ కావడంతో మల్లయ్య సజీవ దహనమయ్యాడు. చలికి దుప్పటి నిండుగా కప్పుకొని పడుకోవడం వల్ల మంటల ధాటికి మల్లయ్య శరీరం సగభాగం బూడిదగా మారింది. శుక్రవారం ఉదయం తమ పిల్లలను స్కూలుకు పంపించిన తర్వాత మామకు టీ తీసుకొచ్చిన రెండో కోడలు అక్కడి భీతావహ దృశ్యాన్ని చూసి కేకలు వేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


పెద్దగట్టు గగనతలంలో విమానం (సర్కిల్లో)

## పెద్దగట్టులో మళ్లీ యురేనియం అలజడి

**పెద్దఅడిశర్లపల్లి:** నల్లగొండ జిల్లాలో యురేనియం అలజడి మళ్లీ మొదలైంది. రెండు రోజులుగా పీఏపల్లి మండలంలోని పెద్దగట్టు, నంబాపురం పరిసర ప్రాంతాల్లో చిన్నపాటి విమానం సంచరిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొంత కాలంగా స్తబ్దుగా ఉన్న ఈ అంశం తాజాగా విమానం తక్కువ ఎత్తులో విహరిస్తుండటంతో మళ్లీ తెరపైకి వచ్చింది. యురేనియం అన్వేషణ కోసమే విమానం సంచరిస్తుందంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే విమానం నేల నుంచి తక్కువ ఎత్తులో విహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో కూడా ఇదే విధంగా పలుమార్లు విమానం ఎగరడంతో అప్పట్లో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.



# గిట్టుబాటు ధర అందేలా కృషి

- రైతు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెల్లడి
- బాధ్యతల స్వీకారం.. మంత్రులు, ఎమ్మెల్యేల అభినందనలు


పల్లాను పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి, జగదీశ్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా మార్కెటింగ్ వ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని రైతు సమన్వయ సమితి కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావులు ఆయనను చైర్మన్ సీట్లో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను సమర్థవంతంగా పనిచేస్తాననే నమ్మకంతో కేసీఆర్ ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. రైతులను సంఘటితం చేయడమే రైతు సమన్వయ సమితి లక్ష్యమన్నారు. ఏ పంటలు పండించాలి? ఎక్కడ అమ్ముకోవాలి? ఏ ప్రాంతంలో ఏ పంటలు పండుతాయి? అనే అంశాలపై సీఎం సర్వే చేయించారన్నారు. త్వరలో రాష్ట్రంలోని సమన్వయ సభ్యులందరితో సీఎం ప్రత్యేక సమావేశం నిర్వహించి రైతు సమన్వయ సమితి సభ్యుల విధులు, బాధ్యతలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తారని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువ జోడించి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేలా కృషిచేస్తామన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ..పల్లా రాజేశ్వర్‌రెడ్డి రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా విజయం సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు అదృష్టవంతులని హోంశాఖ మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. సమితి చైర్మన్‌గా రాజేశ్వర్‌రెడ్డి రైతుల సమస్యలు పరిష్కరిస్తారన్న నమ్మకముందన్నారు.

**అభినందనల వెల్లువ...**

పల్లా బాధ్యతల స్వీకారానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, రైతు సమన్వయ సభ్యులు తరలివచ్చి అభినందనలు తెలిపారు. ఆయనకు అభినందనలు తెలిపిన వారిలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఈటల రాజేందర్, సబిత ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, వి.శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఉన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి, కమిషనర్ రాహుల్‌బొజ్జా, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్.వెంకట్రామిరెడ్డి, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

# అవి అనువైన భవనాలు కావు

- రాష్ట్ర సర్కారుకు తేల్చి చెప్పిన కేంద్ర బృందం
- కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ భవనాలపై వ్యాఖ్య
- ఎన్‌సీడీసీ పరిశోధనా సంస్థకు రెండెకరాలు ఇవ్వాలని విన్నపం
- తాత్కాలికంగా కోఠిలోని భవనాల్ని వాడుకోమని కోరిన మంత్రి ఈటల
- ఇటు సమావేశానికి వైద్య,ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు గైర్హాజరు..

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనరేట్ ప్రాంగణంలో ఉన్న పాత భవనాలు జాతీయ అంటువ్యాధుల నియంత్రణ సంస్థ (ఎన్‌సీడీసీ) ఏర్పాటు చేసే పరిశోధన కేంద్రానికి ఏమాత్రం అనువైనవి కావని కేంద్రం స్పష్టం చేసింది. తమకు అనువైనచోట ప్రత్యేకంగా రెండెకరాలను కేటాయిస్తే అందులో భవనాలు నిర్మించుకుంటామని కోరింది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ పరిధిలోని ఎన్‌సీడీసీకి చెందిన అధికారులు రెండ్రోజులుగా హైదరాబాద్‌లో తమ పరిశోధన కేంద్రానికి అనువైన స్థలాన్ని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. స్థలం కోసం వెతుకులాట ప్రారంభించారు. కోఠిలోని వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన భవనాలను పరిశీలించారు. అవి పరిశోధన సంస్థకు ఏమాత్రం యోగ్యంకావని నిర్ధారించారు. ఇటు యాచారం, శామీర్‌పేట, మానసిక చికిత్సాలయంలో ఉన్న స్థలాలనూ పరిశీలించారు. అనంతరం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో శుక్రవారం సమావేశమయ్యారు. స్థలం గుర్తించే వరకు కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనరేట్‌లోని భవనాలను ఉపయోగించుకోవాలని వారిని ఆయన కోరారు. తాత్కాలిక ప్రాతిపదికన కేంద్ర బృందం అందుకు సమ్మతించింది.


వారం పది రోజుల్లో పనులు మొదలు...

కేంద్ర బృందంతో భేటీ అనంతరం ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావుతో కలిసి మంత్రి ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడారు. అన్ని రకాల వైరస్‌లను గుర్తించడం, వాటిపై పరిశోధన చేసేందుకు రాష్ట్రంలో ఎన్‌సీడీసీ ఏర్పాటవుతోందన్నారు. దేశవ్యాప్తంగా కొన్ని ఎంపిక చేసిన రాష్ట్రాల్లో కేంద్రం అత్యాధునిక ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇప్పటిదాకా ఏదైనా వైరస్ నిర్ధారణ కోసం పుణే, ఢిల్లీ ల్యాబ్స్‌కు పంపుతున్నామన్నారు. ఈ పరిశోధన సంస్థ ఏర్పాటైతే ఆ అవసరం ఉండదన్నారు. ప్రస్తుతం కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనరేట్ ప్రాంగణంలో ఒక భవనంలో తాత్కాలికంగా ఈ పరిశోధన సంస్థ సేవలు ప్రారంభమవుతాయన్నారు. వారం పది రోజుల్లో పనులు మొదలవుతాయన్నారు. స్థానికంగా ఎటువంటి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి, వాటిని ఏ విధంగా అరికట్టాలన్న దానిపై ఈ సంస్థ పరిశోధన జరుపుతుందన్నారు. ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం కేంద్ర బృందం యాచారం, శామీర్‌పేట, మానసిక చికిత్సాలయంలో స్థల పరిశీలన చేసిందని, కేటాయింపునకు సంబంధించి కొంత సమయం పట్టే అవకాశముండటంతో తాత్కాలికంగా ఎన్‌సీడీసీని కోఠిలో ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ఎన్‌సీడీసీ బృందంలో డాక్టర్ రమేశ్, డాక్టర్ మధుమిత, డాక్టర్ జయ్‌కరణ్, డాక్టర్ వికాస్ తదితరులున్నారు.

## ఉన్నతాధికారుల డుమ్మాపై మంత్రి అసహనం

కేంద్ర బృందంతో భేటీ కోసం మంత్రి ఈటల రాజేందర్ కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన ఉన్నతాధికారులు ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో మరో సమావేశంలో ఉండిపోయారు. మంత్రి భేటీ గురువారమే ఖరారైనా ఈ కీలక సమావేశానికి ఉన్నతాధికారులు ఎవరూ హాజరుకాకపోవడంపై మీడియా ముందే ఈటల ఒకింత అసహనం వ్యక్తంచేశారు. 'మిగతా అధికారులంతా ఏమయ్యారు'అని ఆయన అక్క డి అధికారులను ప్రశ్నించారు. కోఠిలో నిత్యం ఉండే కీలక అధికారులు ఒకరిద్దరు మినహా ఎవరూ మంత్రి సమావేశానికి హా జరుకాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

## అక్బరుద్దీన్‌కు హైకోర్టు నోటీసులు



**సాక్షి,హైదరాబాద్:** బెయిల్ షరతులను ఉల్లంఘించారనే ఆరోపణల కేసులో ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2012లో నిజామాబాద్‌లోని ఓ సభలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో ఆయన హైకోర్టు నుంచి గతంలో బెయిల్ పొందారు. బెయిల్ షరతులకు విరుద్ధంగా అక్బరుద్దీన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆయన బెయిల్ రద్దు చేయాలని హిందూ సంఘటన్ అధ్యక్షుడు, న్యాయవాది కరుణ సాగర్ హైకోర్టును ఆశ్రయించారు. అక్బరుద్దీన్ గతంలో మాదిరిగానే బిహార్ ఎన్నికల్లోనూ, రాష్ట్రంలోనూ అదే తరహాలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని, బెయిల్ రద్దు చేయాలని పిటిషనర్ వాదించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి..అక్బరుద్దీన్‌తోపాటు సీపీడీ పోలీసులకు నోటీసులు జారీ చేసి విచారణను వాయిదా వేశారు. తదుపరి విచారణలోగా తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశించారు. అక్బరుద్దీన్ బెయిల్‌ను రద్దు చేయాలన్న పిటిషనర్ అభ్యర్థనను కింది కోర్టు కొట్టేయడంతో హైకోర్టులో రిట్ దాఖలు చేశారు.

## రాత్రి ఉష్ణోగ్రతలు అధికం

సాక్షి, హైదరాబాద్: తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వీస్తున్న తేమ గాలులతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో రామగుండంలో రాత్రి ఉష్ణోగ్రత సాధారణం కంటే 5.1 డిగ్రీలు అధికంగా 19.8 డిగ్రీలు నమోదైంది. అలాగే నిజామాబాద్‌లో సాధారణం కంటే 4.6 డిగ్రీలు అధికంగా 18.7 డిగ్రీలు, హైదరాబాద్‌లో 3.5 డిగ్రీలు అధికంగా 18.7 డిగ్రీలు, భద్రాచలంలో 3.1 డిగ్రీలు అధికంగా 20.5 డిగ్రీలుగా రికార్డయింది. అత్యంత తక్కువగా మెదక్‌లో సాధారణం కంటే 0.8 డిగ్రీలు తక్కువగా 13 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది.

## కోర్టులంటే లెక్క లేదా?: హైకోర్టు



**సాక్షి, హైదరాబాద్:** 'కోర్టు ఆదేశాలంటే అధికారులకు లెక్క లేకుండా పోతోంది. ఒకరిద్దరు అధికారులను కోర్టు ధిక్కార కేసుల్లో జైళ్లకు పంపితేగానీ మొత్తం అందరూ దారికి వచ్చేట్లు లేరు. పలువురు అధికారుల్లో నిలువెల్లా నిర్లక్ష్యం కనబడుతోంది. కోర్టు ఆదేశాలను గౌరవిస్తారా లేక వాటికి ఎలా విలువ ఇవ్వాలో చెప్పాలా..?'అని ప్రభుత్వ అధికారులను ఉద్దేశించి హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కార కేసులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేయడంలోనూ ఆలస్యం చేయడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టులో ఏకంగా 2 వేల కోర్టుధిక్కార కేసులు పెండింగ్‌లో ఉంటే అందులో ఒకే జడ్జి వద్ద ఏడెనిమిది వందల కేసులు ఉన్నాయంటే అధికారులు కోర్టు ఆదేశాల్ని ఏ మేరకు ధిక్కరిస్తున్నారో స్పష్టమవుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఓ కేసులో కోర్టు ఆదేశాలపై అప్పీల్‌ను 466 రోజులు ఆలస్యంగా చేసినందుకు గాను ఆలస్యాన్ని మన్నించి అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది అభ్యర్థన చేయడంతో ధర్మాసనం నిప్పులు చెరిగింది. విచారణ సమయంలో అడ్వొకేట్ జనరల్‌ను ఉద్దేశించి పైవిధంగా హైకోర్టు అసహనాన్ని వ్యక్తం చేసింది.

## బీజేపీకి గుణపాఠం చెబుతాం: టీఎమ్మార్పీఎస్

**సాక్షి, న్యూఢిల్లీ:** తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి నమ్మకద్రోహం చేస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని తెలంగాణ ఎమ్మార్పీఎస్ హెచ్చరించింది. ఎస్సీ వర్గీకరణ చేట్టాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ఎం.పాపయ్య, వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చి ఆరేళ్లైనా ఇచ్చిన హామీని నిలుపుకోలేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు అన్ని పార్టీలు అనుకూలమని చెబుతున్నా పార్లమెంటులో మాత్రం ప్రస్తావించడం లేదన్నారు. వర్గీకరణ చేయకుండా మోసం చేస్తున్న బీజేపీకి ఓటు రూపంలో గుణపాఠం చెబుతామని అన్నారు.

## 'ఇండో-జర్మన్' నివేదిక ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: ఇండో జర్మన్ సీడ్ సెక్టార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి బృందం పరిశీలించిన పలు అంశాలపై తయారుచేసిన నివేదికను శుక్రవారం ఆవిష్కరించారు. గతంలో వ్యవసాయశాఖ బృందం జర్మనీ-నెదర్లాండ్ దేశాల్లో పర్యటించింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, ఉద్యాన శాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు, ఇండో-జర్మన్ సీడ్ సెక్టార్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ టీం లీడర్ ఎక్‌హర్డ్ స్నూడర్, అంతర్జాతీయ విత్తన నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో విజయం మనదే!

- తెలంగాణ బీజేపీ ఎంపీలతో భేటీలో ప్రధాని మోదీ
- దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ప్రధాని ఆరా
- పసుపు బోర్డును మించి ప్రయోజనం: ఎంపీ అరవింద్



**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తప్పక విజయం సాధిస్తుందని పార్టీ రాష్ట్ర ఎంపీలతో ప్రధాని నరేంద్ర మోదీ అన్నట్టు తెలిసింది. శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీలు ధర్మపురి అరవింద్, బండి సంజయ్, సోయం బాపూరావు, గరికపాటి మోహన్‌రావు ప్రధానితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా పరిస్థితులను ఎంపీలు ప్రధానికి వివరించినట్టు తెలిసింది. రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై ఎంపీలు వివరిస్తుండగా.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే గెలుపు అని ప్రధాని చెప్పినట్టు సమాచారం. 15 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై ప్రధాని ఆరా తీసినట్టు తెలిసింది. పార్లమెంట్ సమావేశాల్లో పౌరసత్వం సవరణ బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు ఇవ్వకపోవడాన్ని ఎంపీలు ప్రధాని వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. దీనిపై ఆయన స్పందిస్తూ కొంతమంది అలాగే ఉంటారని అన్నట్టు తెలిసింది. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ప్రధాని ఆరా తీసినట్టు సమాచారం. సమావేశం సందర్భంగా ప్రధాని మోదీకి ఎంపీ సోయం బాపూరావు సమ్మక్క-సారలమ్మ ప్రసాదాన్ని అందజేశారు.

**ప్రధాని వద్ద క్షేత్రస్థాయి నివేదికలు..**

తెలంగాణలో బీజేపీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని ప్రధాని బలంగా విశ్వసిస్తున్నారని, ఆయన గాలి మాటలు చెప్పే మనిషి కాదని ఎంపీ ధర్మపురి అరవింద్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఆయన దగ్గర క్షేత్రస్థాయి నివేదికలు ఉన్నాయి కాబట్టే తెలంగాణలో బీజేపీ తప్పక విజయం సాధిస్తుందని అన్నట్టు తెలిపారు. తెలంగాణపై ప్రధాని మాత్రమే కాకుండా కేంద్ర మంత్రులు కూడా పూర్తి విశ్వాసంగా ఉన్నారని చెప్పారు. తమ భేటీలో అనేక అంశాలపై చర్చించుకున్నట్టు తెలిపారు.

**త్వరలో ఐఐఎం, ఐఐఎస్‌ఈఆర్..**

తెలంగాణకు త్వరలోనే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్‌ఈఆర్) విద్యా సంస్థలను కేంద్రం ప్రకటిస్తుందన్న విశ్వాసం తమకుందని అరవింద్ అన్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్‌తో సమావేశమై ఐఐఎం, ఐఐఎస్‌ఈఆర్‌పై చర్చించగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. పసుపు రైతులకు నెలరోజుల్లో శుభవార్త అందుతుందని తెలిపారు. పసుపు బోర్డును మించి రైతులకు ప్రయోజనం కలిగేలా రూపొందిస్తున్న ప్రణాళిక తుది దశకు చేరుకుందని, త్వరలోనే దీనిపై ప్రకటన వెలువడుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లోనే పండే పసుపు జాతీయ పంట కానందున పంటకు మద్దతు ధర ఇచ్చే విషయమై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపాల్సి ఉందని, అయితే టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని అన్నారు.

## 'ఉపాధి'లో రాష్ట్రానికి అవార్డులు

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటి సంరక్షణ విభాగంలో తెలంగాణకు అవార్డు లభించింది. మన రాష్ట్రం దేశంలోనే ద్వితీయ స్థానంలో నిలిచినట్టు కేంద్రం ప్రకటించింది. ఇదే కేటగిరిలో రాష్ట్రంలోని సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాలు కూడా అవార్డుకు ఎంపికయ్యాయి. అలాగే గ్రామాల విభాగంలో వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం లింగంపల్లికి అవార్డు వచ్చినట్టు కేంద్రం పేర్కొంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లాల అధికారులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం అభినందించారు.

## తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదు

**టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ ధ్వజం**



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో రెండోసారి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఏడాది అంతా హత్యలు, ఆత్మహత్యలు, అత్యాచారాలు, అప్పులు, ఆందోళనలతోనే గడిచిపోయిందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. దిశ హత్య, హాజీపూర్, వరంగల్, ఆసిఫాబాద్, జడ్చర్ల ఘటనలు దేశవ్యాప్తంగా తెలంగాణ పరువు తీశాయని, ఈ ఏడాది తెలంగాణ అశాంతి నిలయంగా మారిందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. రూ.17 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని కేసీఆర్ చేతిలో పెడితే రూ.3 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజల చేతిలో చిప్ప పెట్టారని విమర్శించారు. విచ్చలవిడి అవినీతితో పాటు టీఆర్ఎస్ అసమర్థ ఆర్థిక విధానాలు రాష్ట్రాన్ని దివాళా తీయించాయని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు.

## అన్ని రంగాల్లో విఫలమైన కేసీఆర్

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్**



**సాక్షి, హైదరాబాద్:** రెండోసారి సీఎం అయిన కేసీఆర్ ఏడాది పాలనలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలం అయ్యారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. ఒక రకంగా చెప్పాలంటే సీఎంగా కేసీఆర్ అన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయ్యారని ఎద్దేవాచేశారు. శుక్రవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ బంగారు తెలంగాణ అని చెప్పి అప్పులు, ఆందోళనలు, అవినీతి తెలంగాణగా మార్చారని ఆరోపించారు. మంత్రులే తమ అధినేతపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. హరీశ్‌రావు మాటలు వింటుంటే మంత్రులు ఉత్సవ విగ్రహాలు అని తేలిపోతోందన్నారు. సీఎం పైకి మాత్రమే దాన కర్ణుడిగా కనిపిస్తారని, అక్రమార్జనతో తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ ఉందా లేదా అని అనిపిస్తోందని, ఈ ఏడాది ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదని అన్నారు. అలాగే రుణమాఫీ పేరుతో ఓట్లు దండుకుని రైతులను మర్చిపోయారని, రైతుబంధు ఇవ్వడం లేదని తెలిపారు.

## ఆకాంక్షలు నెరవేర్చని పాలన: జూలకంటి



**సాక్షి, హైదరాబాద్:** ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశలో సీఎం కేసీఆర్ ఏడాది పాలనలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. గత ఐదేళ్ల టర్మ్‌తో పాటు ప్రస్తుత ఏడాది పాలనలో ప్రజల ఆశలపై టీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రధాన హామీలేవీ ఏడాది కాలంలో అమలుకాలేదన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక కేసీఆర్ నియంతృత్వ పోకడలు, కుటుంబ పాలన, రోజురోజుకు అప్పులు పెరిగిపోయాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ, పోలీసు బలగాలతో ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపారని మండిపడ్డారు.

## పార్టీకి బలిమి.. కుటుంబానికి కలిమి

**టీఆర్ఎస్ ఏడాది పాలనపై మాజీ ఎంపీ విజయశాంతి**



**సాక్షి, హైదరాబాద్:** రెండోసారి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అధికార టీఆర్ఎస్ పార్టీ ఆర్థికంగా చాలా బలపడిందని, సీఎం కేసీఆర్, ఆయన కుటుంబం అంతకన్నా ఎక్కువ కలిమితో ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్‌పర్సన్ విజయశాంతి ఎద్దేవా చేశారు. మిగులు బడ్జెట్‌తో మొదలైన రాష్ట్రం అప్పుల ఊబిలోకి కూరుకుపోయిందని, ఇంతకాలం మాయమాటలు చెప్పిన కేసీఆర్ ఇప్పుడు నిజం ఒప్పుకోక తప్ప లేదన్నారు. అందుకే ఆర్థిక క్రమశిక్షణను ఇప్పుడు వల్లె వేస్తున్నారని శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో విమర్శించారు.

## కార్మిక నేత చంద్రన్నకు కన్నీటి వీడ్కోలు

**ముషీరాబాద్:** కార్మిక నాయకుడు, శాంతి చర్చల ప్రతినిధి, మాజీ జనశక్తి నాయకుడు కె. చంద్రన్న అంత్యక్రియలు శుక్రవారం అంబర్‌నగర్ శ్మశానవాటికలో బంధుమిత్రులు, ప్రజా సంఘాల నేతలు కన్నీటి వీడ్కోలు పలికారు. అంబర్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి శ్మశానవాటిక వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. దీనిలో వివిధ పార్టీల, ప్రజా సంఘాల నేతలు, కుల సంఘాల ప్రతినిధులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు తన నివాసం ముందు చంద్రన్న భౌతికకాయానికి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి, తదితరులు నివాళులు అర్పించి చంద్రన్నను ఉద్దేశించి ప్రసంగించారు. చివరి వరకు పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. అంతకుముందు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం చంద్రన్నపై రాసిన పాటను అరుణోదయ కళాకారుల బృందం ఆలపించడంతో అక్కడ ఉన్నవారంతా కన్నీటి పర్యంతమయ్యారు.

# 50% పోస్టుల్లోనే పదోన్నతులు

**మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసు రూల్స్ విడుదల**

**సాక్షి, హైదరాబాద్:** మోడల్ స్కూల్ టీచర్ల నియామకాల్లో రెండేళ్ల ప్రొబేషన్ విధానం అమలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రిన్సిపాల్ పోస్టుల్లో 30 శాతం పోస్టులను డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా, 70 శాతం పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేలా, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టుల్లో 50 శాతం పోస్టులను ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లకు (టీజీటీ) పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయాలని రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్ టీచర్ల సర్వీసు రూల్స్‌లో పేర్కొంది. ఈ మేరకు విద్యా శాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి శుక్రవారం సర్వీసు రూల్స్ ఉత్తర్వులు (జీవో 25) జారీ చేశారు. 2013లో మోడల్ స్కూల్స్ ప్రారంభమైనప్పటి నుంచి సర్వీసు రూల్స్ రూపొందించి అమల్లోకి తేవాలని టీచర్లు విజ్ఞప్తులు చేస్తున్నారు. ఎట్టకేలకు శుక్రవారం రూల్స్ జారీ అయ్యాయి. దీంతో మోడల్ స్కూళ్లలో బదిలీలకు, పదోన్నతులకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న 104 మంది ప్రిన్సిపాళ్లు, 1,989 మంది పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 764 మంది ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లతోపాటు (టీజీటీ) భవిష్యత్తులో నియమితులయ్యే వారికి ఈ రూల్స్ వర్తిస్తాయి. తెలంగాణ మోడల్ స్కూల్ ఎంప్లాయిస్ సర్వీసు రూల్స్ 2019గా పిలుస్తారు.

**ఇవీ ప్రధాన నిబంధనలు..**

- పాఠశాలలో పని భారాన్ని బట్టి ప్రిన్సిపాల్, ఇతర టీచర్ పోస్టులను సృష్టించడం, మార్పు చేయడం, రద్దు చేయడం వంటి అధికారాలు మోడల్ స్కూల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీకే ఉంటుంది.
- ఉపాధ్యాయుల జీత, భత్యాలను నిర్ణయించే, సవరించే అధికారం కూడా ఎగ్జిక్యూటివ్ కమిటీకే ఉంటుంది. అయితే ఇది ప్రభుత్వ ముందస్తు అనుమతితోనే చేయాలి.
- ప్రిన్సిపాల్ పోస్టుల్లో 30 శాతం పోస్టులను డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా, 70శాతం పీజీటీలకు పదోన్నతి ద్వారా భర్తీ చేస్తారు.
- పాఠశాల విద్యా కమిషనర్ నియామకపు అధికారిగా ఉంటారు.
- పీజీటీ పోస్టుల్లో 50 శాతం పోస్టులను డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారా, మరో 50 శాతం పోస్టులను సంబంధిత సబ్జెక్టుతో అర్హత కలిగిన టీజీటీలకు పదోన్నతి కల్పించడం ద్వారా భర్తీ చేస్తారు.
- ఇంగ్లిష్, తెలుగు, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం, కామర్స్ సబ్జెక్టులు పీజీటీలో ఉంటాయి. వీటికి మోడల్ స్కూల్స్ అదనపు డైరెక్టర్ నియామకపు అధికారిగా ఉంటారు.
- టీజీటీ పోస్టులు 100 శాతం డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేస్తారు. ఇందులో ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులు ఉంటాయి. మోడల్ స్కూల్స్ అదనపు డైరెక్టర్ నియామకపు అధికారిగా ఉంటారు.
- ప్రిన్సిపాల్ పోస్టు కోసం పీజీటీలకు పదోన్నతి కల్పించేందుకు కేడర్ స్ట్రెంత్‌ను బట్టి 10 సబ్జెక్టుల పీజీటీలకు 13 పాయింట్ల రోస్టర్‌ను నిర్ణయించారు.
- బదిలీలు, నియామకాల్లో ప్రిన్సిపాల్ పోస్టును రాష్ట్ర కేడర్‌గా, పీజీటీ, టీజీటీ పోస్టులను జోనల్ కేడర్‌గా పరిగణనలోకి తీసుకుంటారు.


తెలంగాణ ప్రభుత్వం
ఇరిగేషన్ & CAD శాఖ
టెండరు ప్రకటన
NIT No. 35&36/RBLISP/2019-20 (3rd Call) తేది :6-12-2019
పనుల సంఖ్య (2), పనుల పేరు: మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ LIS యొక్క నర్వ (మండలం), నాగిరెడ్డిపల్లి (గ్రా)లో కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కోసం స్టేజ్-I పంపింగ్ స్టేషన్ యొక్క ప్రహరీగోడ మరియు సెక్యూరిటీ రూమ్ నిర్మాణం, ధన్వాడ (మం) తీలేరు (గ్రా), సమీపాన స్టేజ్ - II పంపింగ్ స్టేషన్ ప్రహరీగోడ మరియు సెక్యూరిటీ రూమ్ నిర్మాణం. మొత్తం ECV: రూ. 2.62 కోట్లు, టెండర్ల దాఖలుకు ఆఖరితేదీ : 20-12-2019న మ. 3.00 గం. తదుపరి వివరాలను www.eprocurement.gov.in చూడవచ్చును.
DIPR RO. No.1951-DP/CL/ADVT/1/2019-20, Dt: 13-12-2019 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, RBLISP సర్కిల్, పెబ్బేరు

తెలంగాణ ఫుడ్స్ : IDA : నాచారం : హైదరాబాద్ - 500076
ఫోన్ నం. 27152207, 08 & 09
Notification No. TF/GG/Tender/219/SMP/2019-20 తేది :14-12-2019
300 MTల స్కిమ్డ్ మిల్క్ పౌడర్ సేకరణ కోసం తెలంగాణ ఫుడ్స్ వారు మిల్క్ పౌడర్ మాన్యుఫ్యాక్చరింగ్ కో-ఆపరేటివ్ డైరీలు మరియు వారి అధీకృత ఏజెంట్ల నుండి టెండర్లు కోరుతున్నారు. వివరాల కోసం వెబ్‌సైట్ : https://tender.eprocurement.gov.in మరియు వెబ్‌సైట్ : https://tfoods.telangana.gov.in లో 14-12-2019న మ. 2.00 గం. నుండి దర్శించండి. బిడ్స్ దాఖలుకు ముగింపుతేదీ : 28-12-2019 మ. 1.00 గం.
DIPR RO. No.538-PP/CL/ADVT/1/2019-20, Dt: 13-12-2019 సం/- జనరల్ మేనేజర్

తెలంగాణ ప్రభుత్వం
S.E.T.W.C వరంగల్ ఇంజినీరింగ్ శాఖ కార్యాలయం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
NIT No.SE/TW/WGL/NIT/197, 198/2019-20 తేది: 11.12.2019
పనుల సంఖ్య: (2), పనుల పేర్లు: ఆదిలాబాద్ జిల్లా జైనాథ మండలంలోని పార్డి-కె, పార్డి-బి గ్రామ పంచాయితీ వద్ద సాత్నాల నదిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం, నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని పి.ఆర్.రోడ్ బెలాన్ తండా నం.2 వరకు బి.టి. రోడ్ ఏర్పాటుచేయుట పనులు సంతకందారు పరిధిలో ఉన్నాయి. మొత్తం ECV: రూ.4.40 కోట్లు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది మరియు సమయం (ఆన్‌లైన్): 16.12.2019 సా.5 గం. తరువాత. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం (ఆన్‌లైన్): 27.12.2019 మ.3.00 గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరుచు తేది మరియు సమయం: 27.12.2019 సా.5.00 గం.కు. కమర్షియల్ బిడ్ తెరుచు తేది మరియు సమయం: 30.12.2019 సా.5.30 గం.కు.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, గిరిజన సంక్షేమం, వరంగల్
DIPR Ro.No.1955-DP/CL/Advt/1/2019-20, Dt: 13-12-2019

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్, విద్యుత్ భవన్, వరంగల్
CIN No. U40109TG2000SGC034119
స్పెసిఫికేషన్ నంలు. 01/2018-19తో సంక్షిప్త టెండరు ప్రకటన నం. 02/2019-20 ఆఫ్ SE/OP/భూపాలపల్లి ఆపరేషన్ డివిజన్, ములుగులోని వివిధ పనుల కోసం భూపాలపల్లి జిల్లాలోని TSNPDCL నమోదిత కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. పనుల వివరాలను మా వెబ్‌సైట్ www.tsnpdcl.in నుండి పొందవచ్చును.
టెండరు ముఖ్యమైన తేదీలు:
1) టెండరు షెడ్యూలు అమ్మకానికి ఆఖరి తేది : 27.12.2019న 17.00 గం. వరకు
2) సీల్డ్ టెండర్ల దాఖలు : 28.12.2019న 13.00 గం. వరకు
3) టెండరు షెడ్యూలు తెరుచుట : 28.12.2019న 16.00 గం.
టెండరు షెడ్యూళ్ళను సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, ఆపరేషన్, TSNPDCL భూపాలపల్లి నుండి పైన తెలిపిన తేదీలలో కొనుగోలు చేయవచ్చును. అందుకుగాను అకౌంట్స్ ఆఫీసర్, సర్కిల్ ఆఫీస్, భూపాలపల్లి పేరున భూపాలపల్లి వద్ద చెల్లించబడేలా తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ. 1050.00 (GST తో కలిపి) చెల్లించాలి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్, భూపాలపల్లి
స్పెసిఫికేషన్ నం. 01 to 03/2019-20 తో సంక్షిప్త టెండరు ప్రకటన నం. 01/2019-20 ఆఫ్ DE/OP/వరంగల్ రూరల్ వరంగల్ రూరల్ డివిజన్‌లోని వివిధ పనుల కోసం వరంగల్ రూరల్ జిల్లాలోని TSNPDCL నమోదిత కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. పనుల వివరాలను మా వెబ్‌సైట్ www.tsnpdcl.in నుండి పొందవచ్చును.
టెండరు ముఖ్యమైన తేదీలు:
1) టెండరు షెడ్యూలు అమ్మకం : 16.12.2019 నుండి 22.12.2019న 17.00 గం. వరకు
2) సీల్డ్ టెండర్ల దాఖలు : 23.12.2019న 13.00 గం. వరకు
3) టెండరు షెడ్యూళ్ళు తెరుచుట : 23.12.2019న 16.00 గం.
టెండరు షెడ్యూళ్ళను డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం, ఆపరేషన్, TSNPDCL, వరంగల్ రూరల్ నుండి పైన తెలిపిన తేదీలలో కొనుగోలు చేయవచ్చును. అందుకుగాను డివిజనల్ ఇంజినీర్, ఆపరేషన్, TSNPDCL, వరంగల్ రూరల్ పేరున వరంగల్ వద్ద చెల్లించబడేలా తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో రూ. 1050.00 (GST తో కలిపి) చెల్లించాలి.
సం/- డివిజనల్ ఇంజినీర్, ఆపరేషన్, వరంగల్ రూరల్

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం : ఖమ్మం
NIT No.12/DB/KMC/1624/2019-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన తేది :09-12-2019
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం జిల్లా, తెలంగాణ వారు సంక్షిప్త టెండరు ప్రకటన ప్రకారం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ క్రింద దిగువ తెలిపిన విధంగా టెండర్లు కోరుతున్నారు : 1) a) మొత్తం పనుల సంఖ్య : 18 నం.లు. b) పనుల స్వభావం : i) సివిల్ పనులు & ఇతర పనులు రూ. 197.09 లక్షల కోసం : 14 నం.లు. ii) వార్షిక నిర్వహణ (రేట్ కాంట్రాక్ట్) : 4 నం.లు. 3) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది :10-12-2019న ఉ. 10.30 గం. 4) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది : 18-12-2019న సా. 04.00 గం. 5) బిడ్ తెరుచు తేది : 18-12-2019న సా. 04.30 గం. 3. కార్యాలయంలో సంప్రదించుటకు అధికారి పేరు & చిరునామా : అసిస్టెంట్ ఇంజినీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, మొబైల్ : 7901298207 (అసిస్టెంట్ ఇంజినీర్). తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ http://tender.telangana.gov.in లో చూడవచ్చును.
DIPR RO. No.540-PP/CL/ADVT/1/2019-20, Dt: 13-12-2019 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్

प्रतिभूति मुद्रणालय/ SECURITY PRINTING PRESS
(भारत प्रतिभूति मुद्रण तथा मुद्रा निर्माण निगम लिमिटेड की इकाई)
(A Unit of Security Printing & Minting Corporation of India Ltd.,)
भारत सरकार के पूर्ण स्वामित्वाधीन/Wholly owned by Govt. of India
टकसाल कंपाउण्ड, सैफाबाद, हैदराबाद/Mint Compound, Saifabad, Hyderabad-500063
GSTIN: 36AAJCS6111J1Z9 CIN: U22213DL2006GOI144763
दूरभाष/Tele:(+91)-040-23253621 फैक्स/Fax (+91)-040-23456687 ई-मेल/email: spp.hyd@spmcil.com वेबसाइट/Website: www.spphyderabad.spmcil.com
No. SPPH/A-II/Adv./2019/4843 Date : 14-12-2019
निविदा आमंत्रण सूचना / Notice Inviting Tender (NIT)
मुहरबंद निविदाएं निम्नलिखित वस्तु (ओं)/ सेवाओं की प्राप्ति के लिए पात्र और योग्य निविदाकर्ताओं से आमंत्रित किये जाते है :
Sealed tenders are invited from eligible and qualified tenderers for the following items:

| क्र.सं. Sl.No | माल / सेवाएँ का संक्षिप्त विवरण Brief description of Goods/ Services | निविदा संख्या Tender No. | मात्रा Quantity | निविदाओं की प्राप्ति के लिए तारीख और बंद करने का समय/ Closing date and time (IST) for receipt of tenders |
|---|---|---|---|---|
| 1 | Snow White Maplitho Paper in reel form | 6000014177 | 17 MT | 27-12-2019 at 10:45 AM |
| 2 | Sensitised Creamwove cheque paper for IPO | 6000014200 | 25 MT | |
| 3 | Oracle Database Software - Standard Edition | 6000014070 | 1 No. | 14-01-2020 at 10:45 AM |
| 4 | Corrugated Box of 5 ply with 150 GSM good quality kraft paper | 6000014088 | 42,000 Nos. | |
| 5 | Supply and Installation of Automated Number Plate Reader System (ANPRS) | 6000014116 | 1 AU | |
| 6 | Corel Draw Graphic Suite 2019 | 6000014129 | 2 Nos. | |
| | Adobe Creative Cloud CC | | 2 Nos. | |

आगे विवरण हेतु, कृपया हमारा वेबसाईट: http://spphyderabad.spmcil.com देखें और किसी संशोधन /शुद्धि-पत्र वेबसाइट पर ही प्रकाशित किया जाएगा / For further details, please visit our website at http://spphyderabad.spmcil.com & amendment/ corrigendum if any, will be published on website only.
Sd/- DGM & CPSO (For Chief General Manager)

# రణరంగంగా జామియా వర్సిటీ

- పౌరసత్వ సవరణ చట్టానికి నిరసనగా పార్లమెంట్‌కు విద్యార్థుల ర్యాలీ
- వర్సిటీ గేట్ వద్దే అడ్డుకున్న పోలీసులు; లాఠీచార్జ్
- అస్సాంలో ఆందోళనలు తగ్గుముఖం; డిబ్రుగఢ్‌లో కర్ఫ్యూ సడలింపు
- పశ్చిమబెంగాల్‌లో రైల్వే స్టేషన్‌కు నిప్పు



ఢిల్లీలో పోలీసులపైకి రాళ్లు రువ్వుతున్న జామియా వర్శిటీ విద్యార్థులు



నిరసనకారులపై బాష్పవాయువు గోళం ప్రయోగిస్తున్న పోలీసు

**న్యూఢిల్లీ/గువాహటి/ఈటానగర్:** పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లో శుక్రవారం నిరసన ప్రదర్శనలు జరిగాయి. అయితే, గత రెండు రోజులతో పోలిస్తే.. అస్సాం సహా ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళనలు కొంత తగ్గుముఖం పట్టాయి. కానీ ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌ల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఢిల్లీలోని జామియా మిలియా విశ్వవిద్యాలయం రణరంగంగా మారింది. పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఉన్న బెల్డాంగ రైల్వే స్టేషన్ కాంప్లెక్స్‌ను ఆందోళనకారులు తగలబెట్టారు. అస్సాంలోని డిబ్రూగఢ్‌లో, మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌ల్లో శుక్రవారం కొద్దిసేపు కర్ఫ్యూ సడలించారు. అస్సాంలో నిరసనలకు కేంద్రమైన గువాహటిలో శుక్రవారం హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదు. కానీ పరిస్థితి నివురుగప్పిన నిప్పులా కనిపిస్తోంది.

**లాఠీచార్జ్.. టియర్ గ్యాస్**

పౌరసత్వ సవరణ చట్టాన్ని నిరసిస్తూ పార్లమెంట్‌కు ర్యాలీగా వెళ్లాలనుకున్న జామియా మిలియా వర్సిటీ విద్యార్థులను పోలీసులు వర్సిటీ గేటు వద్దే అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల పైకి విద్యార్థులు రాళ్లు రువ్వడంతో, ప్రతిగా పోలీసులు లాఠీచార్జ్ చేశారు. టియర్ గ్యాస్ కూడా ప్రయోగించారని, రాళ్లు కూడా మొదట పోలీసులే రువ్వారని విద్యార్థులు ఆరోపించారు. విద్యార్థులే బారికేడ్లను ధ్వంసం చేసి తమపైకి దూసుకువచ్చారని పోలీసులు వివరణ ఇచ్చారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యారు. దాదాపు 50 మంది విద్యార్థులను అరెస్ట్ చేశారు. ఆ ప్రాంత ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్(ఆప్) ఘటనాస్థలికి వెళ్లి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు.

**రైల్వే స్టేషన్‌కు నిప్పు**

పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఉన్న బెల్డాంగ రైల్వే స్టేషన్ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఆందోళనకారులు తగలబెట్టారు. వేలాదిగా అక్కడికి వచ్చిన నిరసనకారులు రైల్వే కార్యాలయానికి, ఆర్‌పీఎఫ్ అవుట్‌పోస్ట్‌కు, ట్రాక్స్‌కు నిప్పంటించారు. అక్కడ రైల్వే పోలీసులపై తిరగబడ్డారు. బెల్డాంగ పోలీస్ స్టేషన్‌ను ధ్వంసం చేశారు. రఘునాథ్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లోని వాహనాలకు నిప్పంటించారు. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉండే ముర్షిదాబాద్ జిల్లాలో ముస్లిం జనాభా ఎక్కువ. అలాగే, ముస్లిం జనాభా అధికంగా ఉన్న గ్రామీణ హౌరా, బిర్భుమ్, బుర్ద్వాన్‌ల్లో కూడా నిరసన ప్రదర్శనలు జరిగాయి.

**అరుణాచల్‌లో విద్యార్థుల భారీ ర్యాలీ**

అరుణాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం కూడా నిరసనలు కొనసాగాయి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పరీక్షలను బహిష్కరించి, వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. ఈటానగర్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ నుంచి రాజ్‌భవన్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ జరిపారు. 30 కి.మీల దూరం సాగిన ఈ ర్యాలీలో పాల్గొని, గవర్నర్ బీడీ మిశ్రాకు వినతిపత్రం ఇచ్చారు.

**గువాహటిలో ఏఏఎస్‌యూ ర్యాలీ**

అస్సాంలోని గువాహటిలో తాత్కాలికంగా కర్ఫ్యూను తొలగించారన్న సమాచారంతో నిత్యావసర సరుకుల కోసం ప్రజలు వేలాదిగా దుకాణాల ముందు బారులు తీరారు. నగరంలోని దాదాపు అన్ని చోట్ల భద్రతా బలగాలు మోహరించాయి. పలు చోట్ల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. నగరంలో శుక్రవారం ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోలేదు. కానీ ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ నగరంలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించింది.

**అమిత్ షా పర్యటన రద్దు**

మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌ల్లో ఆది, సోమవారాల్లో హోంమంత్రి అమిత్ షా జరపనున్న పర్యటన రద్దయింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో అమిత్ షా తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

**జపాన్ ప్రధాని పర్యటన రద్దు**

జపాన్ ప్రధాని షింజో ఆబే భారత పర్యటన రద్దయింది. పౌరసత్వ చట్టంపై ఈశాన్య రాష్ట్రాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనల కారణంగా గువాహటిలో ప్రధాని మోదీతో ఈనెల 15 నుంచి జరగాల్సిన భేటీ రద్దయినట్లు తెలిపింది.

**అల్ప సంఖ్యాకుల హక్కులకు రక్షించండి**

**వాషింగ్టన్:** పౌరసత్వ చట్ట సవరణ..తదనంతర పరిణామాలపై అమెరికా స్పందించింది. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి అల్పసంఖ్యాక మతాల వారి హక్కులకు రక్షణ కల్పించాలని భారత్‌ను కోరింది.

### పౌరసత్వ చట్టంపై సుప్రీంలో పిటిషన్లు

పౌరసత్వ చట్ట సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్లు వేశారు. కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రాతోపాటు ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్(ఆసు), పీస్ పార్టీ, కొన్ని ఎన్జీవోలు, న్యాయవాది ఎంఎల్ శర్మ, కొందరు న్యాయ విద్యార్థులు కూడా శుక్రవారం పిటిషన్లు దాఖలు చేశారు. ఈ చట్ట సవరణలపై తక్షణం విచారణ చేపట్టాలని మహువా మొయిత్రా తరఫు న్యాయవాది ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. అయితే, ధర్మాసనం నిరాకరించింది. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు ఈ చట్టం ద్వారా భంగం కలుగుతోందని జైరాం రమేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

### మా రాష్ట్రంలో ఒప్పుకోం: మమతా బెనర్జీ

**దీఘా(పశ్చిమబెంగాల్):** పౌరసత్వ సవరణ చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తమ రాష్ట్రంలో అమలు కానివ్వబోమని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తేల్చిచెప్పారు. ఈ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాష్ట్రాలపై ఒత్తిడి తేవడం సాధ్యం కాదన్నారు. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి సంఘీభావం ప్రకటించారు. పంజాబ్, కేరళ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల సీఎంలు కూడా తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేసేందుకు విముఖత వ్యక్తం చేశారు. ఆర్థిక రంగ వైఫల్యం నుంచి దేశ ప్రజల దృష్టి మళ్లించేందుకు కేంద్రం ఆడుతున్న నాటకం ఇదని మధ్యప్రదేశ్ సీఎం కమల్ నాథ్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్ పేర్కొన్నారు. ఈ చట్టాన్ని పంజాబ్‌లో అడ్డుకుంటామని సీఎం అమరీందర్ సింగ్ తెలిపారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ చట్టాన్ని అమలు చేయబోమని కేరళ సీఎం విజయన్ స్పష్టం చేశారు.

### రాష్ట్రాలకు ఆ అధికారం లేదు

పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయకుండా ఉండే అధికారం రాష్ట్రాలకు లేదని హోం శాఖలోని ఒక ఉన్నతాధికారి తెలిపారు. 'కేంద్ర జాబితాలో ఉన్న అంశంపై కేంద్ర ప్రభుత్వం చట్టం చేస్తే.. ఆ చట్టాన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిందే' అని వివరించారు. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్డ్‌లో పొందుపర్చిన కేంద్ర జాబితాలో రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, రైల్వే, పౌరసత్వం మొదలైన 97 అంశాలున్నాయి.

## క్లుప్తంగా...

### థాయ్ మసాజ్‌కు యునెస్కో గుర్తింపు

**బ్యాంకాక్:** ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సంప్రదాయక 'నువాద్ థాయ్'మసాజ్‌కు ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో చోటు దక్కింది. ఈ మేరకు యునైటెడ్ నేషన్స్ ఎకనమిక్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) గురువారం థాయ్ మసాజ్‌ను వారసత్వ జాబితాలో చేర్చింది. నిజానికి ఈ మసాజ్ మూలాలు భారత్‌లోనే ఉన్నాయి. 2,500 ఏళ్ల క్రితమే ఈ విధానం థాయ్‌కు వచ్చిందని అక్కడి వారంటున్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో సదుపాయాల లేమి

**న్యూఢిల్లీ:** దేశంలోని 3.62 లక్షల అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్డి సౌలభ్యం లేదని, అలాగే 1.59 లక్షల కేంద్రాల్లో మంచినీటి సదుపాయం లేదని కేంద్ర మహిళలు, బాల వికాస శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానం ఇచ్చారు. దేశంలో మొత్తం 13,77,595 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

### నేడు కాంగ్రెస్ 'భారత్ బచావో' ర్యాలీ

**న్యూఢిల్లీ:** బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విభజన, విధ్వంస విధానాలకు నిరసనగా కాంగ్రెస్ శనివారం 'భారత్ బచావో' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే ఈ నిరసన ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పాల్గొంటారు. ర్యాలీలో 50 వేల మంది పాల్గొననున్నారని అంచనా.

### యోగాతో మెదడు సైజులో పెరుగుదల!

**వాషింగ్టన్:** యోగాతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ఇల్లినాయి వర్శిటీ శాస్త్రవేత్తలు కొత్త విషయాలు వెలుగులోకి తెచ్చారు. ఏరోబిక్ వ్యాయామం వల్ల మెదడులో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయో దాదాపు అవే మార్పులు యోగాతోనూ జరుగుతాయని శాస్త్రవేత్త నేహా గోథే తెలిపారు. యోగ సాధకుల మెదళ్లలోని హిప్పోకాంపస్ ఇతరుల కంటే ఎక్కువ పరిమాణంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. మెదడులోని కీలకమైన హిప్పోకాంపస్, అమిగ్డలా, ప్రీఫంటల్ కార్టెక్స్ కూడా ఇతరుల కంటే యోగసాధకుల్లో ఎక్కువ సమర్థతతో పనిచేస్తున్నట్లు వెల్లడైందని చెప్పారు. ఇందుకు కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మానవుల్లో హిప్పోకాంపస్ సైజు తగ్గిపోవడం కారణంగా ఒత్తిడికి గురవుతున్నారని నేహా అంచనా వేస్తున్నారు.



స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో జరుగుతున్న సీఓపీ25 సదస్సు సందర్భంగా ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెరస్‌తో భారతీయ చిన్నారి పర్యావరణ కార్యకర్త లిసిప్రియా కంగుజమ్(6)

# రాహుల్ రేప్‌లను ఆహ్వానిస్తున్నారు

- రాహుల్ 'రేప్ ఇన్ ఇండియా' వ్యాఖ్యలపై లోక్‌సభలో దుమారం
- ఆయనకు శిక్ష పడాలన్న స్మృతి ఇరానీ
- ఎంపీగా కొనసాగే నైతిక హక్కు లేదన్న రాజ్‌నాథ్



రాహుల్ వ్యాఖ్యలపై లోక్‌సభలో మండిపడుతున్న బీజేపీ మహిళా సభ్యులు

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన 'రేప్ ఇన్ ఇండియా' వ్యాఖ్యలపై లోక్‌సభ దద్దరిల్లింది. యావత్ భారతదేశాన్ని, ఆర్థిక ప్రగతిని కించపరిచేలా ఆయన వ్యాఖ్యానించారంటూ సభలో నిరసనలు ఉవ్వెత్తున ఎగిశాయి. రాహుల్ రేప్‌లను ఆహ్వానిస్తున్నారని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆరోపిస్తే, పార్లమెంటులో కొనసాగే నైతిక హక్కు రాహుల్‌కి లేదని మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గురువారం జార్ఖండ్ ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మేకిన్ ఇండియా చేస్తామని హామీ ఇచ్చారు. కానీ నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న అత్యాచారాలు చూస్తుంటే భారత్ 'రేప్ ఇన్ ఇండియా'గా మారుతోందని అన్నారు. శుక్రవారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే 2001 డిసెంబర్ 13న పార్లమెంటుపై జరిగిన దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ మహిళా ఎంపీలు రాహుల్ వ్యాఖ్యల్ని నిరసిస్తూ స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. స్పీకర్ ఓం బిర్లా రెండు సార్లు సభని వాయిదా వేసినా పరిస్థితి చక్కబడలేదు. దీంతో ఆయన సభని నిరవధికంగా వాయిదా వేశారు. శుక్రవారంతో పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిసిపోయాయి. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ సభలో రాహుల్‌ని గట్టిగా నిలదీశారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తే దేశంలో మహిళలపై అత్యాచారం చేయాలని పిలుపునిస్తున్నట్టుగా ఉందన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్మృతి ఇరానీకి మద్దతు నిలిచారు.

**రాహుల్‌కు మద్దతుగా కనిమొళి..**

బీజేపీ సభ్యులు సభలో తీవ్రంగా దాడి చేయడంతో రాహుల్‌కు ఎంపీ కనిమొళి మద్దతు పలికారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ మాట్లాడడానికి స్పీకర్ అనుమతించకపోవడంతో ఆయన పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడారు. బీజేపీ తన వ్యాఖ్యల్ని వక్రీకరించిందని తాను క్షమాపణ చెప్పనని అన్నారు.

### ఈసీకి బీజేపీ ఫిర్యాదు

రాహుల్ అత్యాచార వ్యాఖ్యల్ని నిరసిస్తూ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ నేతృత్వంలో బీజేపీ మహిళా ఎంపీలు కేంద్ర ఎన్నిక సంఘాన్ని సంప్రదించారు. రాహుల్ అత్యాచారాన్ని ఒక రాజకీయ ఆయుధంగా వాడుకుంటున్నారని ఎంపీలు ఫిర్యాదు చేశారు. వీలైనంత మేర ఆయనకు కఠిన శిక్ష విధించాలని ఈసీని కోరారు. చట్టబద్ధమైన ప్రక్రియలన్నీ పూర్తయ్యాక తాము తప్పకుండా న్యాయం చేస్తామని ఎన్నికల సంఘం అధికారులు హామీ ఇచ్చినట్టు ఇరానీ వెల్లడించారు.

# ఆ రాక్షస చర్యపై సమీక్షా?

**సుప్రీంకోర్టులో నిర్భయ తల్లి పిటిషన్**



ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు బయట నిర్భయ తల్లి

**న్యూఢిల్లీ:** తన కూతురిని రాక్షసంగా చెరిచి హత్య చేసిన వారికి విధించిన తీర్పును సమీక్షించరాదంటూ నిర్భయ తల్లి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దోషుల్లో ఒకరైన అక్షయ్‌కుమార్ 2017లో కోర్టు విధించిన ఉరిశిక్షను సమీక్షించాలని కోరుతూ ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ నిర్భయ తల్లి శుక్రవారం ఓ పిటిషన్ వేశారు. రివ్యూ పిటిషన్‌పై విచారించే రోజున, అంటే ఈ నెల 17వ తేదీనే ఈ పిటిషన్‌పైనా వాదనలు వింటామని ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎ.బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. తన కూతురిపై అత్యాచారం జరిగిన డిసెంబరు 16వ తేదీనే దోషులకు శిక్ష అమలు చేయాలని నిర్భయ తల్లి మీడియా ఎదుట డిమాండ్ చేశారు. తన కూతురుకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఇలా ఉండగా.. నిర్భయ దోషులకు డెత్ వారెంట్లు జారీ చేయాల్సిందిగా ఢిల్లీ కోర్టులో దాఖలైన పిటిషన్‌పై 18న విచారణ చేపడతామని అడిషనల్ సెషన్స్ జడ్జి సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు.

**ఉరి అమలుకు సిద్ధం:** ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జైలుకు చెందిన తలారి... తీహార్ జైలులో ఉరిశిక్షను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. నిర్భయ దోషులకు సుప్రీంకోర్టు ఉరిశిక్ష విధించిన నేపథ్యంలో తీహార్ జైలు అధికారులు తలారి కోసం ఉత్తరప్రదేశ్ జైళ్ల శాఖను అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో మీరట్ జైలుకు చెందిన తలారి పవన్ జల్లాద్ (55)... ఉరి అమలుకు సిద్ధమన్నాడు.

**విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తాం: కేజ్రీవాల్**

మహిళల పట్ల ఎలాంటి అనుచిత చర్యలకు దిగబోమంటూ విద్యార్థుల చేత పాఠశాలల్లో ప్రతిజ్ఞ చేయిస్తామని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. నిర్భయ కేసులో దోషులకు ఉరిశిక్ష పడాలని దేశమంతా కోరుకుంటోందని తెలిపారు.



శుక్రవారం జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌ను కప్పేసిన మంచు

# లోక్‌సభ 116% ఫలప్రదం

- రాజ్యసభ 99 శాతం
- ముగిసిన పార్లమెంటు సమావేశాలు

**న్యూఢిల్లీ:** పార్లమెంటు సమావేశాల ముగింపు సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఉభయసభల పనితీరును వెల్లడించారు. లోక్‌సభ సమావేశాలు 116 శాతం(కేటాయించిన సమయం కంటే ఎక్కువ చర్చ), రాజ్యసభ సమావేశాలు 99 శాతం ఫలప్రదమయ్యాయని శుక్రవారం చెప్పారు. శీతాకాల సమావేశాల్లో లోక్‌సభలో 18 బిల్లులను ప్రవేశపెట్టామన్నారు. అందులో లోక్‌సభ 14 బిల్లులను, రాజ్యసభ 15 బిల్లులను ఆమోదించిందన్నారు.

**సభా కార్యకలాపాలు తెలుగులో...**

సభా కార్యకలాపాలను ఒక రోజు పాటు తన మాతృభాష తెలుగులో నిర్వహించాలనుకుంటున్నానని రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. 'సభ్యులు తమ మాతృభాషల్లో మాట్లాడితే ప్రజలను ఈ దిశగా ప్రోత్సహించినట్టుగా ఉంటుంది. నా మాతృభాష తెలుగులో ఒకరోజు సభా కార్యకలాపాలు నిర్వహించాలని ఆసక్తిగా ఉన్నా' అని పేర్కొన్నారు. గత సమావేశాలతో పాటు తాజాగా 250వ సెషన్ కూడా వంద శాతం ఫలప్రదమైందని పేర్కొన్నారు. 'రోజుకు సగటున 9.5 ప్రశ్నలకు మౌఖిక సమాధానాలు వచ్చాయి. 49 ఏళ్లలో ఇదే అత్యుత్తమం' అని పేర్కొన్నారు. '199 జీరో అవర్ అభ్యర్థనలు, 115 ప్రత్యేక ప్రస్తావనలు వచ్చాయి. ఇదీ రికార్డే' అని పేర్కొన్నారు.

**2020కల్లా కొత్త పార్లమెంట్..**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2022కి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా అప్పటికి కొత్త పార్లమెంటు నిర్మాణం పూర్తవుతుందని భావిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభిప్రాయపడ్డారు. 2022లో జరిగే పార్లమెంటు సమావేశాలు కొత్త భవనంలో జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కొత్త భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం రెండు మూడు ప్రదేశాలను పరిశీలిస్తోందని తెలిపారు. తర్వాత పార్లమెంటు సమావేశాల నుంచి క్యాంటీన్‌లో సబ్సిడీ ఉండదని చెప్పారు. ఎంపీలు పూర్తి ధర చెల్లించి తమకు కావాల్సినవి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు.

# జాన్సన్ జయకేతనం

- బ్రిటన్ ఎన్నికల్లో కన్జర్వేటివ్ పార్టీ ఘన విజయం
- జనవరి 31కల్లా బ్రెగ్జిట్ ఖాయమన్న ప్రధాని జాన్సన్
- తదుపరి చర్చలకు సిద్ధమని ప్రకటించిన ఈయూ



ఫలితాల అనంతరం లండన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జాన్సన్

**లండన్/బ్రస్సెల్స్:** పదేపదే వస్తున్న ఎన్నికలతో విసిగిన బ్రిటిష్ ఓటర్లు ఈసారి నిర్ణాయక తీర్పునిచ్చారు. ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్‌కు చెందిన కన్జర్వేటివ్ పార్టీకి ఘన విజయం కట్టబెట్టారు. ఈ చారిత్రక విజయంతో వచ్చే జనవరి ఆఖరులోగా యూరోపియన్ యూనియన్(ఈయూ)నుంచి వైదొలిగేందుకు అవకాశం లభించిందని బోరిస్ జాన్సన్(55) తెలిపారు. 'బ్రెగ్జిట్ పూర్తి చేసుకుందాం' అనే ఏకైక నినాదంతో ఎన్నికల బరిలోకి దిగిన జాన్సన్..1980వ దశకంలో ప్రధాని మార్గరెట్ థాచర్ నేతృత్వంలో కన్జర్వేటివ్ పార్టీ సాధించిన ఘన విజయాన్ని పునరావృతం చేశారు. జెరెమి కార్బిన్ నేతృత్వంలో ప్రతిపక్ష లేబర్ పార్టీ కేవలం 203 సీట్లను సాధించింది.

అక్టోబర్ 31వ తేదీలోగా బ్రెగ్జిట్ అమలే లక్ష్యంగా జూలైలో థెరిసా మే నుంచి ప్రధాని పగ్గాలు చేపట్టిన బోరిస్ జాన్సన్, పార్లమెంట్‌లో మెజారిటీ లేకపోవడంతో అనుకున్నది సాధించలేక ఎన్నికలకు సిద్ధమయ్యారు. అయితే, గత అయిదేళ్లలో మూడోసారి ఎన్నికలు రావడంతో ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారు. దాదాపు వందేళ్ల తర్వాత శీతాకాలంలో గురువారం జరిగిన ఈ ఎన్నికల్లో 67 శాతం మంది ఓట్లేశారు. పార్లమెంట్(కామన్స్ సభ)లోని 650 సీట్లకు గాను కన్జర్వేటివ్ పార్టీ 365 స్థానాలను సాధించింది. విజయోత్సవ ర్యాలీలో బోరిస్ జాన్సన్ మాట్లాడుతూ.. 'బ్రిటన్‌కు ఇది మరో శుభోదయం. గడువులోగా బ్రెగ్జిట్ సాధిస్తాం. ప్రతిష్టంభనను తొలగిస్తాం. ఓటర్ల నమ్మకాన్ని వమ్ముచేయను' అని ప్రకటించారు.

**'లేబర్' ఓటమికి కారణాలు..**

ఈ ఎన్నికల్లో ప్రజలు బ్రెగ్జిట్ అంశానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారని పరిశీలకులు అంటున్నారు. 1935 తర్వాత ఆ పార్టీకి ఇదే ఘోర పరాజయం. ఫలితాలపై లేబర్ పార్టీ నేత జెరెమి కార్బిన్ మాట్లాడుతూ..'ఈ ఫలితాలు చాలా నిరుత్సాహం కలిగించాయి. ఇకపై జరిగే ఎన్నికల ప్రచారానికి నాయకత్వ బాధ్యతలు చేపట్టబోను' అని ప్రకటించారు. బ్రెగ్జిట్‌పై స్పష్టమైన వైఖరి తీసుకోలేకపోవడం, పార్టీ నేతల్లో యూదులపై వ్యతిరేకత వంటివి కూడా ఆ పార్టీ ఓటమికి దారితీశాయి. బ్రిటన్ ఎన్నికల్లో ప్రధాని బోరిస్ జాన్సన్ విజయంపై ఈయూ వెంటనే స్పందించింది. బ్రిటన్‌తో బ్రెగ్జిట్‌పై తదుపరి చర్చలు జరిపేందుకు సిద్ధమని ప్రకటించింది.

### ఫలితాల్లో భారతీయుల హవా

బ్రిటన్ పార్లమెంటుకి జరిగిన ఎన్నికల్లో భారతీయం వెల్లి విరిసింది. భారత సంతతికి చెందిన 15 మంది సభ్యులు హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికై కొత్త రికార్డు నెలకొల్పారు. అటు అధికార కన్జర్వేటివ్ పార్టీ, ఇటు ప్రతిపక్ష లేబర్ పార్టీ నుంచి ఏడుగురు చొప్పున విజయం సాధించారు. లిబరల్ డెమొక్రాట్ పార్టీ తరఫున మరొకరు ఎన్నికయ్యారు. 12 మంది తమ సీట్లను నిలబెట్టుకుంటే ముగ్గురు కొత్తగా పార్లమెంటులో అడుగుపెట్టనున్నారు. కన్జర్వేటివ్ పార్టీ తరఫున పోటీపడిన సిట్టింగ్ ఎంపీలందరూ తమ స్థానాలను నిలబెట్టుకోగా గగన్ మహీంద్రా, క్లెయిర్ కౌతినో కొత్తగా ఎన్నికయ్యారు. లేబర్ పార్టీ నుంచి మొదటిసారిగా నవేంద్రూ మిశ్రా కొత్తగా పార్లమెంటులో అడుగు పెట్టబోతుండగా లిబరల్ డెమొక్రాట్ తరఫు మునీరా విల్సన్ ఎన్నికయ్యారు. ఈసారి ఎన్నికల్లో విజయం సాధించిన ప్రతీ 10 మందిలో ఒకరు మైనార్టీ వర్గానికి చెందిన వారు. బ్రిటన్‌లో 15 లక్షల మంది వరకు ప్రవాస భారతీయులున్నారు. వీరంతా కన్జర్వేటివ్ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేశారు. ఆ పార్టీ నుంచి సిట్టింగ్ ఎంపీలు ప్రీతీ పటేల్, అలోక్ శర్మ, శైలేష్ వర, స్వ్యూల్లా బ్రేవ్‌మ్యాన్, రిషి సునాక మళ్లీ విజయం సాధించారు. లేబర్ పార్టీ నుంచి సిట్టింగ్‌లు వీరేంద్ర శర్మ, తన్మాన్‌జిత్ సింగ్, సీమ మల్హోత్రా, ప్రీతికౌర్, లిసా నాండీ, వాలెరీ వాజ్ మళ్లీ గెలిచారు.

**మొత్తం సీట్లు 650**

బ్రాకెట్లలోనివి గత ఎన్నికల్లో పొందిన సీట్లతో పోల్చితే తేడా

| పార్టీ | సాధించిన సీట్లు |
|---|---|
| కన్జర్వేటివ్ పార్టీ | 365(+47) |
| లేబర్ పార్టీ | 203 (-59) |
| స్కాటిష్ నేషనల్ పార్టీ | 48 (+13) |
| లిబరల్ డెమొక్రాట్ | 11(-1) |
| డీయూపీ | 8 (-2) |
| ఇతరులు | 15 (+2) |

సాక్షి
శనివారం, డిసెంబర్, 14

# సుస్థిరతకు బ్రిటన్ పట్టం

యూరప్ యూనియన్(ఈయూ) నుంచి బ్రిటన్ బయటకు రావాలన్న 'బ్రెగ్జిట్' నినాదం రాజుకుని రాజకీయ రూపం సంతరించుకున్నప్పటినుంచీ అస్థిరత్వంతో కొట్టుమిట్టాడుతున్న బ్రిటన్ చివరకు దృఢమైన నిర్ణయం తీసుకుంది. బ్రెగ్జిట్‌ను గట్టిగా సమర్థిస్తున్న కన్సర్వేటివ్ పార్టీకి గురువారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజారిటీ కట్టబెట్టి రాజకీయ అస్థిరత్వానికి తెరదించింది. అయిదేళ్లలో మూడో దఫా జరిగిన ఈ ఎన్నికల్లో సైతం హంగ్ పార్లమెంట్ తప్పదని, కన్సర్వేటివ్‌లకు బొటాబొటీ మెజారిటీ వస్తుందని, అది విపక్షాలతో కలిసి జాతీయ సంకీర్ణ ప్రభుత్వంతో సరిపెట్టుకోక తప్పదని అంచనా వేసిన రాజకీయ పండితులను శుక్రవారం వెలువడిన ఫలితాలు వెక్కిరించాయి. పార్లమెంటులోని 650 స్థానాల్లో ప్రధాని బోరిస్ జాన్సన్ నాయకత్వంలోని కన్సర్వేటివ్ పార్టీ 365 స్థానాలు సాధించగా, దాని ప్రధాన ప్రత్యర్థి లేబర్ పార్టీ కేవలం 203 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దేశం ఈయూలోనే ఉండాలని బలంగా వాదించిన లిబరల్ డెమొక్రాట్లకు కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. స్కాటిష్ నేషనల్ పార్టీకి 48 లభించాయి. ఎగ్జిట్ పోల్స్ కన్సర్వేటివ్‌లు భారీ మెజారిటీ సాధించే అవకాశం ఉన్నదని ముందే జోస్యం చెప్పాయి. అదే నిజమైంది. పద్నాలుగేళ్ల తర్వాత కన్సర్వేటివ్ పార్టీకి పార్లమెంటులో ఇంత స్పష్టమైన మెజారిటీ లభించడం ఇదే మొదటిసారి. అలాగే ఆ పార్టీకి 1987లో లభించిన స్థానాలకన్నా ఈసారి అత్యధిక స్థానాలు వచ్చాయి. అటు లేబర్ పార్టీది ఘోరమైన పరాజయం. తాజా ఎన్నికలతో కలుపుకొని చూస్తే అది వరసగా నాలుగు సాధారణ ఎన్నికల్లో ఓటమిపాలైట్టు లెక్క. పైగా 80 ఏళ్లలో ఎప్పుడూ ఇంత కింది స్థాయికి అది పడిపోయిన దాఖలా లేదు. అయిదేళ్లలో మూడు పార్లమెంటు ఎన్నికలను చవిచూసిన బ్రిటన్ ప్రజానీకం ఈ అస్థిరతకూ, దానివల్ల కలుగుతున్న దుష్ఫలితాలకూ విసుగెత్తి కన్సర్వేటివ్‌లకు తిరుగులేని ఆధిక్యతను అందించారు. అయితే ఈ ఫలితాల్లో మరో ప్రమాదం పొంచివుంది. స్కాట్లాండ్ స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్న స్కాటిష్ నేషనల్ పార్టీ ఆ గడ్డపై భారీగా సీట్లు సాధించింది. కనుక తమ డిమాండ్‌పై మరోసారి రెఫరెండం నిర్వహించాలని ఆ పార్టీ పట్టుబడుతుంది. అదే జరిగితే బ్రిటన్‌కు రాజ్యాంగ సంకటం ఎదురవుతుంది. 2014లో తొలిసారి జరిగిన రెఫరెండంలో 55 శాతంమంది ఐక్యతకే ఓటేయడంతో ఆ డిమాండ్ వీగిపోయింది. అయితే అప్పట్లో బ్రెగ్జిట్ గొడవ లేదు. ఈయూతో కలసి వుండాలన్న తమ ఆకాంక్షకు విరుద్ధంగా ఇప్పుడు జరగబోతోంది గనుక ఈసారి రెఫరెండం నిర్వహిస్తే వారు బ్రిటన్‌కు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించినా ఆశ్చర్యం లేదు. 312 ఏళ్లక్రితం రెండు రాచ కుటుంబాల మధ్య ఏర్పడ్డ వివాహబంధంతో ఆ ప్రాంతం బ్రిటన్‌లో విలీనమైంది.

ప్రపంచమంతా మితవాద ధోరణివైపు మొగ్గు చూపుతున్న వర్తమానంలో బ్రిటన్ అందుకు విరుద్ధమైన తీర్పునిస్తుందని కొందరు విశ్లేషకులు ఆశించిందంతా దురాశే కావొచ్చు. కానీ అందుకు కారణాలున్నాయి. అట్లాంటిక్ మహాసముద్రానికి ఆవలనున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు రూపంలో పోలికలున్న బోరిస్ జాన్సన్ ఆయన గుణాలనే పుణికిపుచ్చుకున్నారు. తరచుగా మహిళలను కించపరిచే వ్యాఖ్యానాలు చేయడం, ఇస్లాంను పెనుభూతంగా చూడటం, జాత్యహంకార వ్యాఖ్యలు చేయడం వంటి దురలవాట్లు జాన్సన్‌కు కూడా ఉన్నాయి. పైగా ఈయూతో ఒప్పందం కుదిరితే సరేసరి... లేదా ఏ ఒప్పందమూ లేకుండా బయటికొచ్చేయడానికి కూడా సిద్ధమని ఆయన చేసిన ప్రకటనలు ప్రకంపనలు సృష్టించాయి. మొన్న మే నెలలో మరో 27 సభ్య దేశాలతోపాటు బ్రిటన్‌లోకూడా జరిగిన ఈయూ పార్లమెంటు ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీ అంతకుముందున్న 19 స్థానాల్లో 15 కోల్పోయి, నాలుగుకు పరిమితమైంది. లేబర్ పార్టీ అంతకుముందున్న 20 స్థానాల్లో సగం మాత్రమే గెల్చుకోగలిగింది. ఈయూతోనే ఉండాలన్న లిబరల్ డెమొక్రాట్లు అంతకుముందున్న ఒక స్థానం నుంచి ఏకంగా 15కు చేరుకున్నారు. బ్రెగ్జిట్‌కు పట్టుబడుతున్న తీవ్ర మితవాద రాజకీయ పక్షం బ్రెగ్జిట్ పార్టీ 29 స్థానాలు గెల్చుకుంది. ఇప్పుడు బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల ఫలితాలకూ, ఆర్నెల్లక్రితం జరిగిన ఈయూ ఎన్నికల ఫలితాలకూ పొంతనే లేదు. ఆ ఎన్నికల్లో దెబ్బతిన్న కన్సర్వేటివ్‌లు చాలా త్వరగా కోలుకుని బలోపేతం కాగా, లేబర్ పార్టీకి అవే ఫలితాలు పునరావృతమయ్యాయి. ఈయూ ఎన్నికల్లో పుంజుకున్నట్టు కనబడిన తీవ్ర మితవాద పక్షం బ్రెగ్జిట్ పార్టీ ఈ ఎన్నికల్లో సున్నా చుట్టింది. ఒక్క సీటూ గెల్చుకోలేక డీలాపడింది. బోరిస్ జాన్సన్ రూపంలో బలమైన మితవాది రంగంలో ఉండగా నైజల్ ఫరాజ్ నేతృత్వంలోని బ్రెగ్జిట్ పార్టీ దండగని ఓటర్లు అనుకుని ఉండొచ్చు.

భారీగా మెజారిటీ సాధించిన బోరిస్ జాన్సన్‌కు ఇప్పుడు చేతినిండా పని. ఆయన పరిపూర్తి చేయాల్సిన కర్తవ్యాలు సాధారణమైనవి కాదు. సాధ్యమైనంత తక్కువ నష్టంతో ఈయూ నుంచి బయటకు రావడం, ఆ సంస్థ సభ్య దేశాలతో విడివిడిగా మెరుగైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం రెండూ సంక్లిష్టమైనవి. బ్రెగ్జిట్‌ను వచ్చే జనవరి 31కల్లా పూర్తి చేస్తానని ఎన్నికల ప్రచార పర్వంలో ఆయన పదే పదే చెప్పారు. అదంత సులభం కాదు. అందులో ఎన్ని చిక్కుముడులున్నాయంటే...బ్రిటన్ ఏ ఒప్పందమూ లేకుండా నిష్క్రమించక తప్పని పరిస్థితులు కూడా ఏర్పడొచ్చు. ఈ క్రమంలో ఎదురయ్యే ఆర్థిక ఒడిదుడుకులను తట్టుకోవడానికి కొన్ని 'పొదుపు' చర్యలు కూడా ఆయన తీసుకోవాల్సివుంటుంది. ఇందుకోసం జాతీయ ఆరోగ్య సర్వీసు (ఎన్‌హెచ్‌ఎస్) సహా పలు పథకాలకు కోత, ప్రైవేటీకరణ వంటివి తప్పకపోవచ్చు. ఎన్‌హెచ్‌ఎస్‌ని ప్రైవేటీకరిస్తే ప్రజారోగ్యానికి ముప్పు కలుగుతుందని లేబర్ పార్టీ చేసిన ప్రచారాన్ని ఖాతరు చేయని జనం సుస్థిర ప్రభుత్వంతో తమకు మేలే తప్ప కీడు జరగదని విశ్వసించారు. దాన్ని జాన్సన్ ఎలా నిలబెట్టుకోగలరో చూడాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి బ.విదియ ఉ.9.43 వరకు తదుపరి తదియ, నక్షత్రం ఆరుద్ర ఉ.7.20 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం రా.7.02 నుంచి 8.36 వరకు, దుర్ముహూర్తం ఉ.6.24 నుంచి 7.51 వరకు, అమృతఘడియలు... తె.4.23 నుంచి 5.56 వరకు (తెల్లవారితే ఆదివారం).

**సూర్యోదయం :** 6.25
**సూర్యాస్తమయం:** 5.24
**రాహుకాలం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు
**యమగండం :** ప.1.30 నుంచి 3.00 వరకు

# భ్రమల్లో బాబు, పవన్ ద్వయం!

**సీఎం జగన్ చేస్తున్న మంచి పనుల వల్ల ప్రజలకు తాము శాశ్వతంగా దూరమైపోతామన్న భయం చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లలో స్పష్టంగా కన్పిస్తోంది. అందుకే ప్రతి అంశాన్ని భూతద్దంలో చూపించడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందన్న వ్యూహంతో పనిచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, కేంద్రం మధ్య అంతరం పెంచే వ్యూహంలో భాగంగానే బీజేపీ ముసుగులు ధరించిన చంద్రబాబు ఏజెంట్లు వైఎస్సార్‌సీపీని బెదిరించాలని ప్రయాస పడుతున్నారు. కేంద్రం కావొచ్చు.. రాష్ట్ర ప్రభుత్వం కావొచ్చు.. ప్రతి ప్రభుత్వానికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఎవరి పరిధిలో వారు రాజ్యాంగబద్ధంగా పని చేస్తారు. చంద్రబాబు తన ఏజెంట్ల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద కుట్రలకు పాల్పడాలనుకుంటే.. అది వికటించి వారికే బెడిసి కొడుతుంది. తస్మాత్ జాగ్రత్త.**

విశ్లేషణ


సి. రామచంద్రయ్య

అమెరికా ఒకప్పుడు సీఐఏ (సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ) ఏజెంట్లను కొన్ని వ్యవస్థల్లోకి నేర్పుగా చొప్పించి ఎవరికీ అనుమానం కలుగని రీతిలో కుట్రలకు పాల్పడి తన ప్రత్యర్థులను దెబ్బతీసేది. రష్యా గూఢచారి వ్యవస్థ కేజీబీలోకి కూడా చొచ్చుకుపోయేంత నేర్పుగా చాపకింద నీరులాగా అది పనిచేసేది! లక్ష్య సాధనకు ఎంతకైనా తెగించడం సీఐఏ వ్యవహార శైలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ఇంటెలిజెన్స్ ఏజెంట్స్ కొందరు కొన్ని వ్యవస్థల్లోకి చొరబడ్డారు. వీరి లక్ష్యం బాబు చేసిన అక్రమాలకు తాను జైలుకు పోకుండా రక్షించడం, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఇబ్బందుల పాలు చేయడం. ఈ లక్ష్యంలో భాగంగా బీజేపీలోకి చేరిన సదరు బాబు ఏజెంట్లు బీజేపీ భుజాలపై తుపాకులు పెట్టి వైఎస్సార్‌సీపీపై కాల్పులు జరిపే దుస్సాహసం చేస్తున్నారు. చంద్రబాబు ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్న మరో ముసుగు వీరుడు జనసేన పవన్ కల్యాణ్‌దీ అదేదారి. చేగువేరా, జార్జిరెడ్డి వంటి వామపక్ష భావజాలాలు కలిగిన నాయకులు తనకు స్ఫూర్తి అని చెప్పిన పవన్ కల్యాణ్ తాజాగా అమిత్‌షా పట్ల వ్యామోహం పెంచుకున్నారు. పైగా ప్రజా తీర్పును అపహాస్యం చేసే రీతిలో 151 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు విస్మయంగా చూస్తున్నారు.

### రాష్ట్రంలో ప్రతిపక్షాలకు నిద్ర కరువు

గత 6 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనాపరంగా తీసుకున్న కొన్ని విప్లవాత్మక నిర్ణయాలు ప్రతిపక్షాలను నిద్రకు దూరం చేస్తున్నాయి. ఎన్నికల వాగ్దానాలను అధికారంలోకి రాగానే ఒక్కటొక్కటిగా నెరవేర్చడం గతంలో ఎవరికీ సాధ్యం కాలేదు. సీఎం వైఎస్ జగన్ ఎందులోనూ రాజీపడకుండా అమ్మఒడి, రైతుభరోసా, గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వాలంటీర్ల వ్యవస్థ మొదలైన పథకాల అమలుకు శ్రీకారం చుట్టారు. మద్య నియంత్రణలో భాగంగా దాదాపు 45,000 బెల్ట్ షాపులను, పర్మిట్ రూమ్‌లను ఎత్తివేసి మహిళల అభిమానాన్ని చూరగొన్నారు. సీఎం జగన్ చేస్తున్న ఈ మంచి పనుల వల్ల ప్రజలకు తాము శాశ్వతంగా దూరమైపోతామన్న భయం చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లలో స్పష్టంగా కన్పిస్తోంది. ప్రతి అంశాన్ని భూతద్దంలో చూపించడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందన్న వ్యూహంతో పనిచేస్తున్నారు. ఈ ఆరు నెలల్లోనే అనేక అసత్యాలను, అభూతకల్పనలను వ్యాప్తి చేయడానికి నానాతంటాలు పడుతున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజాతీర్పును ఎవరైనా గౌరవించాల్సిందే. కానీ, ఆ నైజం, సంస్కారం చంద్రబాబులో లేదు. తనకెదురైన దారుణ ఓటమికి తన తప్పేమీ లేదన్నట్లు చంద్రబాబు నటిస్తున్నారు. నిజానికి, బాబు ఓటమిని అందరూ ముందుగానే గ్రహించారు. ఐదేళ్లపాటు చంద్రబాబు చేసిన తప్పులు అనంతం. రైతాంగానికి, మహిళలకు, యువతకు చేసిన దగా, అలాగే స్వయంగా పాల్పడిన అవినీతి, పార్టీ నేతల దోపిడీ, రాజ్యాంగేతర శక్తిగా మారిన లోకేశ్ చేసిన అధికార దుర్వినియోగం, సామాజిక న్యాయానికి పాతర వేసి ఆశ్రిత పక్షపాతానికి తెర తీయడం, ఇంకా.. ఓటుకు నోటు కేసు కారణంగా



రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టడం, ప్రతిపక్షపార్టీని దెబ్బతీయడానికి ఎమ్మెల్యేలను సంతలో పశువులను కొన్నట్లు కొని, కొందర్ని రాజ్యాంగ విరుద్ధంగా మంత్రుల్ని చేయడం.. ఇదంతా ఒక ఎత్తయితే.. చంద్రబాబు తన రాజకీయ ప్రత్యర్థులపై చేసిన అనైతిక దాడి మరోఎత్తు. తన వైఫల్యాలను, పాపాలను అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుల మీద నెట్టివేసి మరోసారి అధికారాన్ని దక్కించుకోవడానికి చంద్రబాబు అతినీచమైన దుష్ప్రచారానికి ఒడిగట్టడం దేశం యావత్తూ వీక్షించింది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీతో చెలిమి కుదుర్చుకొని.. మోదీ వ్యక్తిత్వ హననానికి చంద్రబాబు తెగబడ్డారు. మోదీ, అమిత్‌షాల చెర నుండి విముక్తం చేయకపోతే దేశానికి భవిష్యత్తు లేదంటూ చంద్రబాబు తన ఎన్నికల ప్రచారంలో వెళ్లిన ప్రతిచోటా వారిని విమర్శించడం తెలి సిందే. కాంగ్రెస్ అధిష్టానానికి వనరులు సమకూర్చడం సహా ఆ పార్టీకి చేయగల ప్రతి సహాయం అందించారు. కానీ, ప్రజల విజ్ఞత కారణంగా ఎన్నికల్లో చంద్రబాబు పాచికలేవీ పారలేదు.

### ఊసరవెల్లిని మించి రంగు మారుస్తున్న బాబు

తాజాగా, తాను చేసిన ద్రోహాన్ని, దిగజారుడు ప్రచారాన్ని మర్చిపోయి ఉంటారనే ఆశతో చంద్రబాబు మరోసారి ప్రధాని మోదీ అనుగ్రహం కోసం పాకులాడుతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణమే వేగంగా తన రంగును మార్చేశారు. 'కాంగ్రెస్ పార్టీ హస్తాన్ని' వదిలేశారు. మోదీ, షాలను ప్రసన్నం చేసుకోవడానికి తన పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల్ని బీజేపీలోకి పంపారు. చంద్రబాబు ఆశిస్తున్నది.. బీజేపీకి దగ్గర కావడంతోపాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, కేంద్రం మధ్య అంతరం పెంచడం. ఈ వ్యూహంలో భాగంగానే బీజేపీ ముసుగులు ధరించిన చంద్రబాబు ఏజెంట్లు బీజేపీ భుజాలపై తుపాకీ పెట్టి వైఎస్సార్‌సీపీని బెదిరించాలని ప్రయాస పడుతున్నారు. చంద్రబాబు గూడుపుఠానీకి ఓ పత్రికాధిపతి సహకారం ఉంది. వైఎస్ జగన్, కేసీఆర్, మోదీల ఓటమికి కృషి చేసిన సదరు పత్రికాధిపతి బీజేపీకి అత్యధికంగా సీట్లు రావడంతో వెంటనే గేరు మార్చారు. బీజేపీని భుజానకెత్తుకున్నారు. తాను ఏమి రాసినా తనకు బీజేపీ అండ ఉందన్న సంకేతాలు పంపిస్తూ జగన్, కేసీఆర్‌ల మీద విషం చిమ్ముతున్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు ప్రధానిని, బీజేపీ నేతల్ని కలిసినా.. ఏదో జరిగిపోతోందన్న ప్రచారం సాగించడం వెనుక ఇరు పార్టీలమధ్య అంతరాన్ని పెంచే కుట్ర ఉంది.

### బీజేపీ 'బూచి'కి భయపడేదెవరు?

రాష్ట్ర ప్రభుత్వంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే బాధ్యతగల ప్రతిపక్ష పార్టీగా సూచనలు, విమర్శలు చేస్తే ఎవరూ తప్పుపట్టరు. కానీ, అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా బీజేపీ ముసుగులు ధరించిన తెలుగుదేశం ఏజెంట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న తీరు అందర్నీ విస్తుగొలుపుతోంది. సీఎం జగన్‌కి ఉన్నది ప్రజాబలం, నైతికబలం, సిద్ధాంతబలం. తెలుగుదేశం, జనసేన మాదిరిగా పార్టీ, వ్యక్తిగత అవసరాలను దృష్టిలో పెట్టుకొని వైఎస్ జగన్ ఎన్నడూ పార్టీ విధానాలను మార్చలేదు. ఊసరవెల్లిలా రంగులు మార్చలేదు. గెలుపు కోసం అడ్డదారులు తొక్కలేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రతిపక్షంలో ఉండగా.. ప్రత్యేక హోదా కోసం ప్రజాస్వామ్యయుతంగా దీక్షలు చేశారేతప్ప.. చంద్రబాబులా దొంగ దీక్షలు నిర్వహించి ప్రధాని మోదీని నీచంగా తిట్టించలేదు. మీడియాలో ఆయనను కించపరుస్తూ కథనాలు రాయించలేదు. ప్రారంభం నుంచీ.. ఎక్కడా విధానాల్లో రాజీపడలేదు, మడమ తిప్పలేదు.

ఎన్నికలముందు బీజేపీతో ఎలాంటి విధానం ఉందో.. ఫలితాల తర్వాత కూడా వైఎస్సార్‌సీపీ వైఖరిలో మార్పులేదు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విషయంలో సీఎం జగన్ ఎలాంటి మొహమాటాలకు పోవడంలేదు. 'నీతిఆయోగ్'తో జరిగిన తొలి సమావేశంలోనే, ప్రధాని సమక్షంలోనే సీఎం వైఎస్ జగన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి న్యాయంగా ఇవ్వాల్సిన నిధులు, విభజన బిల్లు ప్రకారం నెరవేర్చాల్సిన హామీలు ఏమిటో తేటతెల్లం చేశారు. నీతిఆయోగ్‌కు సమర్పించిన 98 పేజీల నివేదికలో రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రస్తావించారు. కేంద్రంతో వైఎస్సార్‌సీపీ సఖ్యతను కోరుతున్నది. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు ఉండాలని నమ్ముతున్నది. పరస్పర సహాయ సహకారాలతో అభివృద్ధిపథంలోకి వడివడిగా అడుగులు వేయడం వైఎస్సార్‌సీపీ లక్ష్యం. వాస్తవాలు ఈ విధంగా ఉంటే.. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఏదో చేయబోతున్నట్లు ప్రజల్లో అనుమానాల్ని, అపోహల్ని సృష్టించడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ప్రతి ప్రభుత్వానికి.. అది కేంద్రం కావొచ్చు.. రాష్ట్ర ప్రభుత్వం కావొచ్చు.. వాటికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఎవరి పరిధిలో వారు రాజ్యాంగబద్ధంగా పని చేస్తారు. చంద్రబాబుకు రాజ్యాంగం మీద విశ్వాసం లేదు. కనుకనే ఐదేళ్లలో అనేక రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడ్డారు. బీజేపీ కూడా తను చూపిన పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందనే ఆశతో చంద్రబాబు ఎదురుచూస్తున్నారు. ఆ దిశగా బీజేపీ ముసుగు వేసుకున్న చంద్రబాబు ఇంటెలిజెన్స్ ఏజెంట్లు తెరచాటు వ్యవహారాలు నడుపుతున్నారు. చంద్రబాబు తన ఏజెంట్ల ద్వారా ప్రజాబలం కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద కుట్రలకు పాల్పడాలనుకుంటే.. అది వికటించి వారికే బెడిసి కొడుతుంది. తస్మాత్ జాగ్రత్త!

మాజీ మంత్రి, ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### శరణార్థి



"పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే హిందూ శరణార్థుల్ని మాత్రమే అంగీకరించి, నేపాల్, శ్రీలంక దేశాలకు చెందిన హిందువులను అంగీకరించబోమని చెప్పటం గందరగోళంగా ఉంది. అమెరికా, బ్రిటన్ దేశాలలో ఉన్న హిందువులేమో హిందుత్వవాదుల మాతృభూమి, పితృభూమి నుంచి దూరంగా ఉండాలని కోరుకుంటున్నారు. మరి బాలిలో ఉన్న హిందువుల సంగతేమిటనేది తేల్చాల్సి ఉంది. ఈ అయోమయం అంతా ట్రోల్స్‌కి బాగానే అర్థమవుతున్నదనుకుంటున్నాను"

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

### ప్రజాస్వామ్యం



"రాజ్యాంగ విరుద్ధమైన పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న జామియా మిలియా యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. నిర్బంధించి, చితకబాదారు. దేశవ్యాప్తంగా ఇదే తరహా నాజీ పాలనా శైలి కొనసాగుతోంది. ఇక మనకు ప్రజాస్వామ్యం ఉన్నట్టేనా?"

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

### పరువు



"మీరు తెలియజేయాలనుకుంటున్న నిరసనంతటినీ ఇండియాలోనే తెలపండి. కానీ, ప్రపంచవ్యాప్తంగా దేశం పరువు తీయడమెందుకు? గత ఆరేళ్లలో మీరేమీ గుణపాఠాలు నేర్చుకోలేదా? భారత దౌత్యకార్యాలయాల దగ్గర తమ మాతృభూమిని అవమానిస్తే ప్రవాస భారతీయులు మిమ్మల్ని గౌరవిస్తారని అనుకుంటున్నారా? చాలా విచారకరం"

– సధావి ఖోస్లా, రచయిత్రి

### రాజకీయం



"కొన్నిసార్లు నేను రాజకీయం చేస్తున్నానని అంటారు. కానీ నేను ఎప్పుడూ ఏ రాజకీయ పార్టీనీ, రాజకీయ నాయకుడినీ, భావజాలాన్నీ సమర్థించలేదు. నేను కేవలం సైన్స్ గురించి మాత్రమే చెప్పాను. దాన్ని అనుసరించకపోతే కలిగే విపత్కర పరిస్థితుల గురించి చెప్పాను. లెఫ్ట్ అయినా, రైట్ అయినా.. ఈ రోజుల్లో అవసరమైన రాజకీయాలు లేవన్నది వాస్తవం"

– గ్రేటా థన్‌బర్గ్, పర్యావరణ కార్యకర్త

### పాపులర్



"2016లో కంటే ఇప్పుడు ట్రంప్ పునాది మరింత పటిష్టమైంది. వచ్చే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన సులువుగా గెలుస్తాడు. అందుకే డెమొక్రాట్‌లు కొత్త వారిని రంగంలోకి దించి ట్రంప్‌ను తొలగించడానికి యత్నిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ట్రంప్ ఇప్పుడు ఆదరణ సంపాదించుకున్నారు. దాంతో డెమొక్రాట్లు అసహనానికీ, ఆందోళనకూ గురవుతున్నారు"

– చార్లీ కిర్క్, రచయిత

### రేప్



"కొత్త ఇండియాలో రేప్ నేరం కాదు. కానీ, రేప్ గురించి మాట్లాడటం నేరం. రేపిస్ట్‌లను కాపాడటం సాధారణం, వారి గురించి మాట్లాడటం నేరపూరిత చర్య. అంతేనా... స్మృతి ఇరానీ గారూ...."

– సంజయ్ యాదవ్, ఆర్జేడీ నేత

## ఇన్‌బాక్స్

### ఆ బిల్లు.. రాజ్యాంగ స్ఫూర్తికి చిల్లు

పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి డిసెంబర్ 31, 2014కు ముందు భారతదేశంలోకి వచ్చిన అక్రమ వలసదారుల్లో ముస్లిమేతరులకు భారత పౌరసత్వం పొందడానికి అర్హత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. రాజ్యాంగం అన్ని మతాల్నీ సమానంగా గౌరవించే లౌకికత్వాన్ని, అందరికీ సమానత్వపు హక్కుని దఖలు పర్చింది. పౌరసత్వం నిర్ణయించడానికి మతాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం ఆ స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. పొరుగుదేశాల్లో బాధితులైన మైనారిటీలు శరణార్థులుగా వచ్చినందున వారికి ఆశ్రయం కల్పించడం ధర్మంగా తలచినా, అది మత భావనలకు అతీతంగా జరగాల్సి ఉంది. కేవలం మూడు దేశాల నుంచి కొన్ని మతాల వారికే ఆ అవకాశం కల్పించడం రాజ్యాంగపరంగా సరైంది కాదు. భిన్న సంస్కృతులు, భిన్న ప్రాంతాల నుంచి వచ్చిన మానవుల్ని అక్కున చేర్చుకున్న ఉదాత్త భారతీయత సంస్కృతిని పరిరక్షించడమే పాలకుల రాజధర్మం. రాజ్యాంగ ధర్మం.

దాడి చిలుకా శంకర్, నెల్లిమర్ల
మొబైల్ : 94408 36931

### అధిక ధరలకు అసలు కారణం

జనం ఎన్నికల సమయంలోనూ క్యూలో నిలుచుంటున్నారు. అదే విధంగా ఉల్లి కొనుక్కోటానికి పోటీ లుపడుతూ క్యూలో నిలుచుంటున్నారు. మొత్తం ప్రజల నుండి ఓటుకు గాను తీసుకున్న సొమ్ముకు చక్ర వడ్డీ, బారు వడ్డీ వచ్చేంతవరకు.. పైగా వచ్చే ఎన్నికలకు ఓటుకు రూ. 2,000 ఇవ్వటానికి అధికార పక్షాలు సంపాదించే వరకు ఉల్లి ధర పెరుగుతూ ఉంటుంది. మందులు, మద్యం తదితర వస్తువుల ధరలు.. ప్రజలు ఓటుకు డబ్బులు తీసుకున్న పాపానికి పెరుగుతూనే ఉంటాయి. అవినీతి ఉచ్చులో ఉన్నన్నాళ్లు ధరలు పెరగడం సహజమే.

మేడా శ్రీనివాస్, కార్యదర్శి, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్

# ఒక జీవనది అదృశ్యమైంది


శ్రీరమణ

'గొల్లపూడి మారుతీరావు గొప్ప నాటక రచయిత మాత్రమే కాదు, చాలా మంచి నటుడు కూడా. సినిమాల్లో వేస్తే ముఖ్య పాత్రలో బాగా రాణించగలడు' అంటూ 1970లో ప్రముఖ పత్రికా సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్య శర్మ గొల్లపూడిని అంచనా వేశారు. తర్వాత అక్షరాలా అంతే జరిగింది. పదేళ్ల తర్వాత ముఖానికి రంగు పూసుకుని వెండితెరకెక్కారు. గడ్డముక్కు, తీక్షణమైన చూపులు, సన్నగా పొడుగ్గా కింగ్ సైజు సిగరెట్ లాంటి విగ్రహం, చేతులు వూపేస్తూ వాదనలో పస లేకపోయినా అవతలివాళ్లని తగ్గేట్టు చేసే వాగ్ధాటి గొల్లపూడికి ముద్రవేసి నటుడిగా నిలబెట్టాయి. తొలి సినిమా 'ఇంట్లో రామయ్య...' చిత్రంతోనే అన్ని వయసుల వారిని ఆకట్టుకున్నారు. వంద సినిమాల తర్వాత అబ్బాల్సిన 'ఈజ్' మొదటి దెబ్బకే వంటబట్టింది. ఇక తర్వాత ఆయన వెనక్కి తిరిగి చూసింది లేదు.

మారుతీరావుది పరిపూర్ణ జీవితం. పద్నాలుగేళ్లప్పుడే మించిన ప్రతిభని ప్రదర్శిస్తూ 'ఆశాజీవి' కథ రాశారు. ఇంకో రెండేళ్లకి తొలి నాటకం అనంతం, ఇంకో రెండేళ్లకి మరో మంచి పెద్ద కథ గొల్లపూడిని రచయితగా నిలబెట్టాయి. విశాఖ పట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బీఎస్సీ చదివారు. ఆ పట్టాని, దార్ఢ్యకమైన వాక్కుని పట్టుకుని విజయవాడ ఆకాశవాణిలో ఉద్యోగం సంపాదించారు. అక్కడ మహానుభావుల మధ్యలో ఉండి కలానికి పదును పెట్టుకున్నారు. సరిగ్గా వృత్తి నాటకరంగం వెనకబడి సినిమాకు అన్ని కళలూ, శక్తియుక్తులూ దాసోహం అంటున్న తరుణంలో నాటకలు, నాటకాలు రాసేవారు ఒట్టిపోయారు. ఈ మహా శూన్యంలో గొల్లపూడి ప్రవేశించి పుంఖానుపుంఖాలుగా నాటక రచనలు చేసి తెలుగు అమెచ్యూర్ థియేటర్‌కి కొత్త చిగుళ్లు తొడిగారు. 'అనంతం' కొన్ని వందల ప్రదర్శనలకు నోచుకుంది. 'బియాండ్ ది హొరైజన్' ఆధారంగా తీర్చిద్దిన 'రాగగాగిణి' మాతృక వలే ఖ్యాతి పొందింది. కొత్త కొత్త నాటకాలు చదవడం, తనదైన శైలిలోకి దించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తన రచనలకు బారసాలలు చేసి పేర్లు పెట్టడంలో గొల్లపూడిది విలక్షణమైన దారి. పిడికెడు ఆకాశం, వెన్నెల కాటేసింది, రెండురెళ్లు ఆరు, మళ్లీ రైలు తప్పిపోయింది, కరుణించని దేవతలు, రోమన్ హాలిడే, కళ్లు, సత్యంగారి ఇల్లెక్కడ, చీకట్లో చీలికలు, ఎర్రసీత ఇవన్నీ కొత్తగా ఆకర్షణీయంగా ఉంటాయ్. ఆఖరికి ఆయన స్వీయ చరిత్రకి 'అమ్మ కడుపు చల్లగా...' అని నామకరణం చేసు కున్నారు. విజయనగరం నేల మహత్యం, గాలి నైజం మారుతీరావుకి పుట్టుకతోనే (1939) అంటింది. హమేషా కొత్తపూలు విరిసే విశాఖ ప్రభాతం ఆయనపై పూర్తిగా పడింది. తెలుగు కథని జాగృతం చేసిన చా.సో., కా.రా., రావి శాస్త్రి, భరాగో ఇంకా మరెందరో గొల్లపూడి రెక్క విచ్చే టప్పుడు ఉత్సాహంగా రాస్తున్నారు. విజయవాడ ఆకాశవాణి అప్పట్లో సరస్వతీ నిలయం. శంకర మంచి సత్యం, ఉషశ్రీ, జీవీ కృష్ణారావ్, బుచ్చి బాబు లాంటి విశిష్టులు తమ ప్రజ్ఞా పాటవాలతో వెలుగుతున్నారు. ఈ వనంలో తనూ ఒక మల్లె పొదలా ఎదిగి గుబాళించారు గొల్లపూడి.

అక్షర తూణీరం



పరిమళాలు గాలివాటున చెన్నపట్నందాకా వెళ్లాయి. అన్నపూర్ణ సంస్థ 'చక్ర భ్రమణం' ఆధారంగా తీస్తున్న 'డాక్టర్ చక్రవర్తి' సినిమాకి మాటల రచయితగా మారుతీరావుకి పిలుపు వచ్చింది. ఆయనకు సహజంగా ఉన్న మాటకారితనం సినిమాల్లో బాగా పనిచేసింది. 80 సినిమాలకు కథలు, మాటలు ఇచ్చారు. నటుడిగా 200 పైగా చిత్రాల్లో కనిపించి మెప్పించారు. నటుడు, రచయిత, వ్యాఖ్యాత, వ్యాసకర్త, విశ్లేషకుడు– అన్నిటా రాణించారు. నటుడుగా విలనీ, కామెడీ ఇంకా అనేక షేడ్స్ చూపించారు. 'వందేళ్ల తెలుగు కథకి వందనాలు' పేరిట కె. రామచంద్రమూర్తి పూనికతో గొల్లపూడి రూపొందించిన టీవీ కార్యక్రమం ఆయన మాత్రమే చేయగలడు. 14వ ఏట నించి సృజనాత్మకంగా ఆయన జీవితం సాగింది. అన్నీ ఒక ఎత్తైతే పాతికేళ్లపాటు అవిచ్ఛిన్నంగా నడిచిన ఆయన 'జీవన కాలమ్' మరో ఎత్తు. బ్రాడ్వే నాటకాలను స్వయంగా వెళ్లి, చూసి వచ్చి ఆయన అందించిన విపుల సమీక్షలు మనకి విజ్ఞానదాయకాలు. గొల్లపూడికి అక్షర నివాళి.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

### భాషలు వేరైనా కవిత్వం ఒక్కటే

మన దేశం అనేక వైవిధ్యాలకు మూలం. సంస్కృతి, సంప్రదాయాలు, వేష, భాషల్లో ఎక్కడికక్కడే ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకుని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుకుంటోంది. ఇంత వైవిధ్యాన్నీ దోసిట పట్టి అద్దంలో చూపించేది సాహిత్యం. వివిధ భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని చదివితే ఆయా ప్రత్యేకతలన్నిటినీ కొంతవరకైనా అర్థం చేసుకోవచ్చు. అయితే, తెలుగు పాఠకులకు ఇతర భాషల్లోని కవిత్వం దగ్గర కాలేదు. వచన రచనలకంటే, కవిత్వాన్ని అనువదించడం క్లిష్టమని భావించడం కూడా ఇందుకు కారణం కావచ్చు. ఆ లోటును మామూలుగా కాదు, భారీ ఎత్తున పూడుస్తూ ప్రముఖ కవి ముకుంద రామారావు 'అదే నేల' పేరిట భారతీయ కవిత్వం–నేపథ్యంను 867 పేజీలతో వెలువరించారు. భారత రాజ్యాంగం 22 భాషలకు గుర్తింపునిస్తే.. ఈ సంకలనంలో 32 భాషల నుంచి కవితలను సేకరించి, అనువదించి.. మన ముందుంచారు. ఆయా భాషల్లో కవిత్వం ప్రారంభమైన తీరు దగ్గర నుంచి ఆధునికతను సంతరించుకునే వరకూ తిరిగిన అన్ని కీలకమైన మలుపులనూ అందిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. శైలీ, శిల్పాల్లో వచ్చిన మార్పులను ప్రతిఫలించే కవితలకు ప్రాధాన్యతనిచ్చారు. ఆయా భాషల్లోని ప్రముఖ కవులతోపాటు జ్ఞానపీఠ్, సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నవారందరినీ పొందుపరిచారు. కవుల పరిచయంతోపాటు, ఆయా భాషా సాహిత్య చరిత్రలను సైతం పరిచయం చేశారు. కవయిత్రులపైనా, తిరుగుబాటు స్వరాలపైనా ప్రత్యేకంగా దృష్టిసారించారు. 'ఒకమారు నువ్వు అన్నావు ఈవిధంగా అయితే /ఆకాశమే నీ హద్దు అని/నేడు ఆకాశం నా చేతిలో ఉంది/కానీ నువ్వు లేవు ఆ ఘనమైన సంఘటనను చూడటానికి' (జయంతి నాయక్–కొంకణి), 'నా కళ్లలో/ఒక పురాతన నది ఉంది/నేను కూడా దానిని చూడలేదు/అయినా అది అక్కడ ప్రవహిస్తోంది' (సురేష్ దలాల్–గుజరాతీ) వంటి పంక్తులు కవులను పెనవేసుకునే ప్రకృతికి నిదర్శనంగా నిలుస్తాయి. భాషలు వేరైనా ప్రజలు–వారిని ప్రతిబింబించే కవిత్వ ఆకాంక్ష ఒక్కటేనని ఈ సంకలనం చూస్తే అర్థమవుతుంది.




– దేశరాజు

(రేపు సాయంత్రం హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో 'అదే నేల' పరిచయ సభ)

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
శనివారం ॥ 14-12-2019



మార్గళి ప్రసాదం
– పక్క పేజీలో

# మహిళారక్షణకు ఉక్కు కవచం

## ఏపీ దిశ యాక్ట్

విలన్‌లు ఉన్న చోట
ఒక హీరో ఉండాలి.
అలాంటి హీరో...
'ఏపీ దిశ యాక్ట్'.
చెల్లినెవరూ ఏడిపించకుండా
ఒక అన్న ఉండాలి.
అన్న లేని చెల్లెళ్లకు కూడా అన్న
'ఏపీ దిశ యాక్ట్'.
చెడుచూపు పడదన్న
ధైర్యం ఒకటి ఉండాలి.
ఆ.. ధైర్యం.. ధీమా.. భరోసా..
'ఏపీ దిశ యాక్ట్'!
మహిళల రక్షణకు
ఉక్కు కవచం ఈ చట్టం!



(ఫైల్ ఫోటో)

ఆగ్రహం కుదిపేస్తుంది. ఆవేదన కదిలిస్తుంది. దిశ ఘటన దేశాన్ని కుదిపితే, ఏపీ అసెంబ్లీని కదిలించింది. ఫలితమే ఏపీ దిశా యాక్ట్–2019. శుక్రవారం ఏపీ అసెంబ్లీ 'దిశ' బిల్లును ఆమోదించడంతో రాష్ట్రానికి కొత్త మహిళా రక్షణ చట్టం ఒక కవచం అయింది. ఈ చట్టం రాష్ట్రంలోని మహిళలకు, బాలికలకు భద్రత కల్పిస్తుంది. వారిపై జరిగే నేరాల విచారణకు జిల్లాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటవుతాయి. మహిళలపై అత్యాచారానికి, క్రూరమైన అకృత్యాలకు పాల్పడితే ఉరిశిక్ష పడుతుంది. వారం రోజుల్లో దర్యాప్తు, పద్నాలుగు రోజుల్లో విచారణ, మూడు వారాల్లో తీర్పు పూర్తవుతాయి! పిల్లలపై లైంగిక నేరాలకు పది నుంచి పద్నాలుగేళ్ల వరకు శిక్ష! సోషల్ మీడియాలో మహిళల్ని కించపరిస్తే రెండు నుంచి నాలుగేళ్ల వరకు జైలు శిక్ష! మహిళలకు భరోసాను, భద్రతను ఇచ్చే ఇలాంటి ఒక శక్తిమంతమైన చట్టం దేశ చరిత్రలోనే మొట్టమొదటిది.

• • •

ఆడపిల్లకు ఏదైనా జరిగితే ఆ తల్లిదండ్రులకు, తోడబుట్టినవాళ్లకు ఎంత పెయిన్ ఉంటుందో.. ఆ దుర్మార్గపు ఘటన సమాజంలోని మిగతా కుటుంబాలలో ఎంతటి కలవరం రేపుతుందో చెబుతూ.. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు ఏపీ ముఖ్యమంత్రి ఎంతో భావోద్వేగంతో ప్రసంగించారు. ఏపీ ప్రభుత్వం చేస్తున్న దిశ చట్టంతో 'నేరస్తులకు ఇక మూడినట్లే' అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఒక సంకేతం కూడా పంపారు. నిర్భయ ఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టం ప్రకారం నిర్భయ కేసుల్లో జైలు లేదా మరణ దండనను శిక్షగా విధిస్తుంటే.. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'దిశ' చట్టం దోషికి మరణదండనను తప్పనిసరి చేస్తోంది. నిర్భయ చట్టం ప్రకారం రెండు నెలల్లో దర్యాప్తు పూర్తయితే మరో రెండు నెలల్లో శిక్ష పడాలి. అంటే మొత్తం నాలుగు నెలల్లో దర్యాప్తు, విచారణ పూర్తి కావాలి. దిశ చట్టంలో మొత్తమంతా కలిపి మూడు వారాల్లోనే దోషికి శిక్ష పడుతుంది.

అత్యాచార ఘటనల్లో మాత్రమే కాకుండా పిల్లలపై జరిగే లైంగిక నేరాలన్నిటికి కూడా దిశ చట్టం శిక్షను తీవ్రం చేసింది. కేంద్రం చేసిన 'పోక్సో' చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక నేరాలు, లైంగిక వేధింపులకు కనీసం మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు శిక్ష విధించవచ్చు. అదే ఏపీలో దిశ చట్టాన్ని అనుసరించి జీవిత ఖైదు విధిస్తారు. అంటే పిల్లలపై ఇకపై ఎలాంటి లైంగిక నేరానికి పాల్పడినా జీవితాంతం జైల్లో ఉండటమో, లేక ఉరికంబం ఎక్కడమో శిక్ష అవుతుంది. సోషల్ మీడియా ద్వారా మహిళల్ని వేధించడం, వారిపై అసభ్యకరమైన పోస్టింగులు పెట్టడం వంటివి చేస్తే ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం ఇప్పటి వరకు నిర్దిష్టంగా శిక్షలు లేవు. ఏపీ దిశ చట్టం.. మెయిల్స్ ద్వారా గానీ, సోషల్ మీడియా ద్వారా గానీ, డిజిటల్ విధానంలో గానీ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే మొదటి తప్పుకు రెండేళ్లు, ఆ తర్వాతి తప్పుకు 4 ఏళ్ల శిక్ష విధించేలా ఒక కొత్త సెక్షన్‌ను తీసుకొచ్చింది. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంతవరకూ మహిళలపై, పిల్లలపై నేరాల సత్వర విచారణకు ప్రతి జిల్లాలోనూ ప్రత్యేక కోర్టు లేదు. కొన్ని రాష్ట్రాల్లో మాత్రం ఈ నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. ఏపీ దిశ చట్టం ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేస్తోంది! అత్యాచారం, సామూహిక అత్యాచారం, ఆసిడ్ దాడులు, సోషల్ మీడియాలో అసభ్యంగా చూపించడం, వేధించడం వంటి నేరాలు, పోక్సో పరిధిలోకి వచ్చేవన్నీ జిల్లాల్లోని ఈ ప్రత్యేక కోర్టుల పరిధిలోకి వస్తాయి.

మరి ఆ నేరాలపై దోషులు పైకోర్టుకు వెళ్లకుండా ఉంటారా? వెళ్తారు. అయితే అలా అప్పీలు చేసుకునే గడువు కాలం కేంద్ర ప్రభుత్వ చట్టంలో ఆరు నెలలు ఉండగా, ఆ కాలాన్ని ఏపీ పరిధిలో మూడు నెలలకు తగ్గించారు. ఇంకొక విషయం.. మహిళలు, పిల్లలపై నేరాల సత్వర విచారణ, శిక్షల విధింపు కోసం ప్రత్యేక పోలీసు బృందాలను, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను, ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్ర చట్టాల్లో ఇప్పటివరకు ఎటువంటి ఏర్పాట్లూ లేవు. ఏపీ దిశ చట్టం మాత్రం జిల్లా స్థాయిల్లో డీఎస్పీ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ స్పెషల్ పోలీసు బృందాలను ఏర్పాటు చేస్తోంది. ప్రతి కోర్టుకూ ప్రత్యేకంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని నియమించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. అన్నిటికన్నా ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం నేరస్థులను చట్టం ముందే కాకుండా, సమాజం ముందు కూడా నిలబెట్టబోతోంది. అందుకోసం ఒక డిజిటల్ రిజిస్ట్రీని ఏర్పాటు చేయబోతోంది. మహిళలు, పిల్లలపై నేరాలను నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక నేషనల్ రిజిస్ట్రీని పెట్టింది కానీ ఆ రిజిస్ట్రీ ద్వారా డిజిటల్ పద్ధతిలో డేటా బేస్ ఉన్నప్పటికీ.. జరిగిన నేరాలు, నేరస్తుల పేర్లు అందులో బహిర్గతం అయ్యే అవకాశం లేదు. అయితే ఏపీలో మాత్రం ఏ నేరస్తుడు ఏ నేరం చేశాడనే వివరాలను రిజిస్ట్రీలో ప్రజలకు అందుబాటులో ఉంచుతారు.

• • •

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ప్రతిష్ఠాత్మక 'దిశ' చట్టాన్ని 'ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ లా (సవరణ) చట్టం –2019 గా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఉద్వేగభరితమైన మాటల్ని బట్టి చెప్పాలంటే.. మహిళపై అఘాయిత్యం చేయాలనే ఆలోచన వస్తేనే వణుకు పుట్టించే చట్టం ఇది. ''మహిళలపై అకృత్యాలకు పాల్పడితే మరణశిక్ష పడుతుందనే భయం కలగాలి. అప్పుడే ఈ వ్యవస్థలో మార్పు వస్తుంది. అప్పుడే నేరాలు తగ్గుతాయి''అని ఆయన అన్నారు. ఆయన మాటలతో అన్ని వర్గాల్లోని ప్రముఖులు, సామాన్యులు ఏకీభవిస్తున్నారు.

### బ్యూటీఫుల్ యాక్ట్



జస్టిస్ డిలే అవడంలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌నే తప్పుబట్టారు ఇన్నాళ్లు. సత్వర న్యాయం జరగక పోవడానికి మౌలిక సదుపాయాల కొరత ప్రధాన కారణం. మొదటిసారి దీని మీద దృష్టిపెట్టింది ప్రభుత్వం. శుభపరిణామం. సరైన సాక్ష్యాధారాలున్న కేసుల్లో ఇన్వెస్టిగేషన్ వేగవంతంగా.. అంటే 21 రోజుల్లో జరిగిపోవాలి అన్నది ఈ బిల్లులోని మరో బ్యూటీ. అంతే కాదు సోషల్ మీడియాలో మహిళలను వేధించే వారికీ కఠిన శిక్షలను పెట్టిందీ బిల్లు. ఇది కచ్చితంగా ఇంప్లిమెంట్ అవ్వాలి. న్యాయం అందించడంలో ఉన్న వైఫల్యాలను గుర్తించి.. సరిచేయడానికి ఈ బిల్లు మంచి అవకాశాన్ని కల్పిస్తోంది.

**– సరిత, అడిషనల్ ఎస్‌పి సిఐడి, ఎస్‌పి విమెన్ ప్రొటెక్షన్ సెల్ (ఏపీ పోలీస్ డిపార్ట్‌మెంట్)**

### మంచి పరిణామం



సెక్సువల్ అస్సాల్ట్‌ను సీరియస్‌గా తీసుకున్నారు .. మంచి పరిణామం. ఇష్యూని వెంటనే టేకప్ చేసిన పద్ధతి బాగుంది. అయితే ఇప్పటి వరకు మహిళల మీద హింసకు సంబంధించి ఎలాంటి అధ్యయనాలు జరగలేదు. ఇలాంటి సీరియస్ చట్టాలున్నాయన్న అవగాహనా లేదు. వీటి మీదా దృష్టి పెట్టాలి. చట్టాల గురించి విస్తృత ప్రచారం సాగాలి. మహిళల మీద హింస జరగడానికి అవకాశాలున్న అన్ని పరిస్థితులూ మారడానికి కృషిచేయాలి.

**– కొండవీటి సత్యవతి, భూమిక ఎడిటర్,**

### దేశానికే మార్గదర్శకం



ఏపీ దిశ– 2019 బిల్లు చరిత్రాత్మకమైంది. దేశానికే మార్గదర్శకం. రేప్ వంటి క్రూరమైన నేరాలకు పాల్పడిన వాళ్లకు 21 రోజుల్లోనే శిక్షపడేలా చేస్తోందీ బిల్లు. దీనివల్ల సాక్ష్యాలు తారుమారు కావడం ఉండదు. ఒత్తిళ్లకు గురికాకుండా వేగంగా విచారణ జరిగి సత్వర న్యాయం అందుతుంది. సోషల్‌మీడియాలో మహిళల మీద వేధింపులకు పాల్పడిన వారికీ కఠిన శిక్షలు పడేలా బిల్లు తెచ్చిన మొదటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు. ఏపీ దిశ – 2019 బిల్లును చూసిన తర్వాత ఈ తరహా చట్టలు తేవాలని దేశంలోని మిగతా చోట్లా ఒత్తిడి పెరుగుతుంది. హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో కూడా నిర్ణీత కాలవ్యవధి ఉండాలని కేంద్రం మీద కూడా ఒత్తిడి మొదలవుతుంది. రెండు విషయాల్లో ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా ఉంటోంది. మొదటిది ఏపీ దిశ –2019 అయితే రెండవది దశలవారీగా మద్యపాన నిషేధం. మహిళల మీద జరిగే నేరాల్లో మద్యపానం పాత్ర గుర్తించకపోతే లాభంలేదు. ఏపీ ముఖ్యమంత్రి గుర్తించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి కఠినంగా ఉండడం వల్ల కింది స్థాయిలో అలర్ట్‌నెస్ ఉంటుంది. మహిళల భద్రతకు సంబంధించి మరింత బాధ్యతతో వ్యవహరిస్తారు.

**– వాసిరెడ్డి పద్మ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్**

### నిర్భయ కన్నా భిన్నమైనది

వందశాతం చరిత్రాత్మకమైనది. ఈ బిల్లు వల్ల అబ్బాయి తప్పు చేస్తే ఆడపిల్లకు న్యాయం జరుగుతుంది. నిర్భయ కన్నా డిఫరెంట్ బిల్లు ఇది. అందులో మొత్తం నాలుగు నెలల కాలవ్యవధి. ఏపీ దిశ – 2019లో కేవలం 21 రోజుల్లో న్యాయం అందుతుంది. సాక్ష్యాలు మరుగున పడే అవకాశమే లేదు.

**– నిర్మలత, సీనియర్ న్యాయవాది**

### దిశకు నివాళి



దిశ ఘటన అందరినీ కదిలించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతలు. ఆడవాళ్ల భద్రతకు దిశ పేరుతో బిల్ రావడం నిజంగానే దిశకు నివాళి. ఆడపిల్లలకు భద్రత దొరుకుతుందనే ఆశ కనిపిస్తోంది.

**– శ్రీధర్ రెడ్డి, దిశ తండ్రి**

---

# ఇంటి మాయిశ్చరైజర్లు

చలికాలం

### పాల మీగడ-తేనె



ఈ కాలం చర్మం పొడిబారుతుంటుంది. మాయిశ్చరైజర్లు పదే పదే రాయాల్సి వస్తుంది. ఆ అవసరం లేకుండా చర్మం మృదుత్వం కోల్పోకుండా ఉండాలంటే.. పాల మీగడ తీసుకోవాలి. మీగడలో ఉంటే నూనె చర్మాన్ని పొడిబారనీయదు. తేనెలో చర్మసంరక్షణకు సహాయపడే ఔషధాలు ఉన్నాయి. చర్మంపై ఏర్పడే మొటిమలు, యాక్నె వంటి సమస్యలకు కారణమయ్యే బ్యాక్టీరియాను దూరం చేస్తుంది. అందుకని మీగడ–తేనె కలిపి ముఖానికి, చేతులకు రాసుకొని పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. మాయిశ్చరైజర్ అవసరం లేదని మీకే తెలిసిపోతుంది. ఈ చలి కాలం రోజూ పాల మీగడ–తేనె కలిపిన మిశ్రమాన్ని ఉపయోగించవచ్చు. చర్మకాంతి కూడా పెరుగుతుంది.

### పాలు - అరటిపండు



చర్మానికి సరైన పోషణ లేకపోతే జీవ కళ కోల్పోతుంది. పాలు, అరటిపండు కలిపి మిశ్రమం తయారుచేసుకొని ప్యాక్‌వేసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత కడిగేయాలి. జిడ్డుచర్మం గలవారు పాలు–రోజ్‌వాటర్ కలిపి రాసుకోవచ్చు. అరటిపండు మృతకణాలను తీసేయడంలో అమోఘంగా పనిచేస్తుంది. బాగా మగ్గిన అరటిపండును గుజ్జు చేసి, దాంట్లో టేబుల్ స్పూన్ పాలు కలిపి ముఖానికి, మెడకు రాసుకోవాలి. తర్వాత వెచ్చని నీటితో కడిగేయాలి.

కలబంద– బాదంనూనె – నువ్వుల నూనె



చర్మంపై ఎక్కువ మృతకణాలు కనిపిస్తే కలబంద రసంలో పది చుక్కల చొప్పున బాదం నూనె, నువ్వుల నూనె కలిపి ముఖానికి, చేతులకు రాయాలి. వృత్తాకారంలో రాస్తూ మర్దన చేయాలి. రాత్రంతా అలాగే వదిలేసి, మరుసటి రోజు ఉదయం వెచ్చని నీటితో కడిగేయాలి.

### బొప్పాయి - పచ్చిపాలు



విటమిన్–ఇ అందితే చర్మం త్వరగా మృదుత్వాన్ని కోల్పోదు. బాగా పండిన బొప్పాయి ముక్కను గుజ్జు చేసి, దాంట్లో పచ్చి పాలు కలపాలి. ముఖానికి, మెడకు, చేతులకు రాసి ఆరనివ్వాలి. తర్వాత కడిగేయాలి.



---

### ● ముగ్గు-ముచ్చట



**ముగ్గులు పంపవలసిన చిరునామా:**
**ముగ్గు-ముచ్చట,**
**సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,**
**రోడ్ నెం.1, బంజారాహిల్స్,**
**హైదరాబాద్-34.**
muggulu.sakshi@gmail.com

### నానీ



మనసుతో ముడివేసుకున్న బంధాలు చాలా బలిష్టంగా ఉంటాయి. కాలం దూరం చేసినా, పరిస్థితులు వేరుచేసినా.. ఎప్పటికి మనసును హత్తుకునే ఉంటాయి. అలాంటి జ్ఞాపకాలను తలుచుకుంటూ.. ఓ వ్యక్తి వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తాడు. జ్ఞాపకాలను మాత్రమే మిగిల్చి దూరమైపోయిన ఆ బంధాన్ని వెతుకుంటూ.. చిన్ననాటి నుంచీ పెంచుకున్న మమకారాన్ని నెమరు వేసుకుంటూ, తన గుండెల్లోని అభిమానాన్ని చాటుకుంటూ.. చివరికి ఆమెని కలుసుకుంటాడు. వల్లమాలిన తన ప్రేమని, కృతజ్ఞతని ఆమెకు ఎలా తెలిపాడు? అసలు ఎవరు ఆమె? **'ఇసుక చెట్టు'** శీర్షికతో వస్తున్న వరుస కథనాల్లో 'నానీ' చదవండి.

### మృదుమధురంగా..



అందం కోసం బ్యూటీ పార్లర్‌కి వెళ్లాల్సిందే అనేది ఒకప్పటి మాట. ఇంట్లో ఉండి కూడా అందానికి మెరుగులు దిద్దుకోవచ్చు అనేది టెక్నాలజీ చూపుతున్న బాట. అందుకు అవసరమైన బ్యూటీ గాడ్జెట్స్ మార్కెట్‌లో పోటెత్తున్నాయి. రెండు మూడు సార్లు పార్లర్‌కి వెళ్లి వస్తే అయ్యే ఖర్చు.. ఒకేసారి ఆ గాడ్జెట్ కొనుగోలుకు పెడితే చాలు.. ఇంట్లోనే అందంగా రెడీ అయిపోవచ్చు. ప్రతివారం మగువల అందాన్ని పెంచే గాడ్జెట్స్‌ని పరిచయం చేస్తున్న 'బ్యూటీజర్'లో ఈసారి పెడిక్యూర్, మెనిక్యూర్ కిట్ గురించి వివరాలు ఉన్నాయి. ఆ కిట్ పని తీరు, ధర వంటి ఎన్నో వివరాలు రేపటి 'ఫన్‌డే'లో చదవండి.

## రేపటి 'ఫన్‌డే'లో..!




*ఇంకా..*
*ఉప్పు తిన్నెలలో.. పున్నమి వెన్నెలలో.. (యాత్రాయణం), హిట్లర్ మీసం (ఇది మీ పేజీ), వలస భారతం (ముఖచిత్ర కథనం), ప్రపంచసార తంత్రం (శంకర విజయం 26), యాపిల్ హల్వా (స్నాక్ సెంటర్), జగమంతా బొమ్మలాటమ్మా! (పాటతత్త్వం)..*
*ఇలా మిమ్మల్ని ఆకట్టుకునే మరెన్నో శీర్షికలు రేపటి 'ఫన్‌డే'లో చదవండి.*



# మార్గళి ప్రసాదం

మార్గశిర మాసాన్ని మనం ధనుర్మాసం అంటాం.
తమిళులు మార్గళి అంటారు.
వైష్ణవాలయాల్లో ఉదయపు పూజల్తో ఈ మాసమంతా
ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువెత్తుతుంది.
తిరుప్పావై మార్మోగుతుంది.
ప్రసాదాల గుబాళింపు భగవంతునికే కాక
భక్తులకూ ప్రీతికరమౌతుంది.

విష్ణుమూర్తి అలంకార ప్రియుడు...
వైష్ణవ ఆలయాలకు వెళితే చక్కెర పొంగలి, దద్ధ్యోదనం,
పులిహోర, పరమాన్నం ప్రసాదంగా దక్కుతుంది.
ధనుర్మాసం ఇంటింటా ప్రసాదాల పంట.
ఉదయాన్నే చలిలో ఈ ప్రసాదాలు తయారుచేసి,
భగవంతునికి నివేదన చేసి, స్వీకరించండి.
పుణ్యం, పురుషార్థం రెండూ దక్కుతాయి.

## కోయిల్ పులిహోర



**కావలసినవి:** బియ్యం – పావు కేజీ; చింతపండు – నిమ్మకాయంత; పసుపు – అర టీ స్పూను; ఎండు మిర్చి – 2; ఇంగువ – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత; బెల్లం పొడి – ఒక టేబుల్ స్పూను.

**పొడి కోసం:** నూనె – ఒక టీ స్పూను; ధనియాలు – 2 టేబుల్ స్పూన్లు; ఎండు మిర్చి – 6; పచ్చి సెనగ పప్పు – ఒక టేబుల్ స్పూను; మినప్పప్పు – 2 టీ స్పూన్లు; మెంతులు – అర టీ స్పూను; మిరియాలు – ఒక టీ స్పూను నువ్వులు – 2 టీ స్పూన్లు.

**పోపు కోసం:** నువ్వుల నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – ఒక టీ స్పూను; పచ్చి సెనగ పప్పు – 2 టీ స్పూన్లు; పల్లీలు – ఒక టేబుల్ స్పూను; ఎండు మిర్చి – 4 (ముక్కలు చేయాలి); కరివేపాకు – రెండు రెమ్మలు.

**తయారీ:** ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి, తగినన్ని నీళ్లు జత చేసి అన్నం ఉడికించి, పక్కన ఉంచాలి ● ఒక కప్పు నీటిలో చింత పండు నానబెట్టి, రసం తీసి పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి కాగాక, పొడి కోసం తీసుకున్న వస్తువులన్నీ (నువ్వులు మినహా) ఒకదాని తరవాత ఒకటి వేసి వేయించాలి ● చివరగా నువ్వులు జత చేసి మరో మారు వేయించి, దింపి, చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా పొడి చేయాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, ఆవాలు వేసి చిటపటలాడించాక, పచ్చి సెనగ పప్పు, పల్లీలు వేసి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి ● ఎండు మిర్చి ముక్కలు, కరివేపాకు జత చేసి కొద్దిసేపు వేయించాలి ● చింతపండు గుజ్జు, పసుపు, ఉప్పు, ఇంగువ జత చేసి సుమారు ఐదు నిమిషాల సేపు ఉడికించాలి ● చిక్కబడ్డాక బెల్లం పొడి జత చేసి బాగా కలియబెట్టి దింపేయాలి ● పెద్ద పళ్లెంలో అన్నం వేసి చల్లారబెట్టాలి ● వేయించిన పోపు, పొడి మిశ్రమాన్ని అన్నానికి జత చేసి బాగా కలియబెట్టి, కొద్దిగా నువ్వుల నూనె వేసి మరోమారు కలపాలి ● దేవునికి నివేదన చేసి, ప్రసాదంగా స్వీకరించాలి.

## అప్పాలు



**కావలసినవి:** బియ్యప్పిండి – ముప్పావు కప్పు; గోధుమ పిండి – పావు కప్పు; బెల్లం పొడి – ఒక కప్పు; నీళ్లు – ఒక కప్పు; నూనె – పావు కప్పు + డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ● ఒక పాత్రలో బియ్యప్పిండి, గోధుమ పిండి వేసి కలపాలి ● స్టౌ మీద ఒక పాత్రలో నీళ్లు, బెల్లం పొడి వేసి బెల్లం కరిగేవరకు కలుపుతూండాలి ● బియ్యప్పిండి గోధుమ పిండి మిశ్రమం జత చేస్తూ కలియబెట్టాలి ● ఉడుకుపడుతుండగా స్టౌ కట్టేయాలి ● పావు కప్పు నూనె జత చేసి గరిటెతో బాగా కలియబెట్టి, చల్లారబెట్టాలి ● స్టౌ మీద బాణలిలో నూనె పోసి కాచాలి ● పిండిని కొద్దిగా తీసుకుని, ఉండలా చేసి, నూనె పూసిన ప్లాస్టిక్ కవర్ మీద అప్పం మాదిరిగా ఒత్తాలి ● కాగిన నూనెలో వేసి రంగు మారేవరకు వేయించి ప్లేట్ లోకి తీసుకోవాలి ● చల్లారాక దేవునికి నైవేద్యం పెట్టి తినాలి.

## కోయిల్ పొంగల్



**కావలసినవి:** బియ్యం – ఒక కప్పు; పెసర పప్పు – అర కప్పు; నెయ్యి – 4 టేబుల్ స్పూన్లు ; జీడిపప్పులు – 15; మిరియాలు – ఒక టీ స్పూను; అల్లం తురుము – ఒక టీ స్పూను; ఇంగువ – పావు టీ స్పూను; కరివేపాకు – 2 రెమ్మలు.

**తయారీ:** ● స్టౌ మీద బాణలి వేడయ్యాక, పెసర పప్పు వేసి దోరగా వేయించి దింపేయాలి ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి, నీళ్లు ఒంపేయాలి ● కుకర్‌లో పెసరపప్పు, బియ్యం, ఐదు కప్పుల నీళ్లు జత చేసి, మూత పెట్టి ఆరు విజిల్స్ వచ్చాక దింపి, మూత తీశాక, మిశ్రమాన్ని గరిటెతో మెత్తగా మెదపాలి ● స్టౌ మీద బాణలిలో నెయ్యి వేసి కరిగాక, జీడిపప్పులు వేసి వేయించాలి ● మిరియాలు జత చేయాలి ● ఇంగువ, కరివేపాకు, అల్లం తురుము వేసి బాగా వేయించాలి ● ఉడికించిన బియ్యం, పెసరపప్పు మిశ్రమం జత చేసి, తగినంత ఉప్పు వేసి కలిపి దించేయాలి ● కోయిల్ పొంగల్ సిద్ధమైనట్లే.

## కోయిల్ పాయసం



**కావలసినవి:** బియ్యం – ముప్పావు కప్పు; నెయ్యి – అర కప్పు + ఒక టేబుల్ స్పూను; నీళ్లు – 5 కప్పులు; ముదురు రంగులో ఉండే బెల్లం – రెండున్నర కప్పులు; పటిక బెల్లం – పావు కప్పు; ఏల కుల పొడి – ఒక టీ స్పూను; శొంఠి పొడి – పావు టీ స్పూను.

**తయారీ:** ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి నీరు ఒంపేయాలి ● స్టౌ మీద బాణలిలో నెయ్యి వేసి కరిగాక బియ్యాన్ని అందులో వేసి కొద్దిసేపు వేయించి దింపేసి, తగినన్ని నీళ్లు జత చేసి స్టౌ మీద ఉంచి ఉడికించాలి (ఉడకటానికి సుమారు అరగంట సమయం పడుతుంది) ● స్టౌ మీద మరొక బాణలిలో నెయ్యి, కొద్దిగా నీళ్లు పోసి కరిగించి, ఉడికించాలి ● అన్నానికి జత చేసి, స్టౌ మీద ఉంచి కొద్దిసేపు ఉడికించాలి ● బాగా చిక్కబడ్డాక ఏలకుల పొడి, శొంఠి పొడి జత చేసి కలియబెట్టాలి ● నెయ్యి జత చేసి మరోమారు కలిపి దింపేయాలి ● వేయించిన కొబ్బరి ముక్కలు, పటికబెల్లం ముక్కలు జత చేసి కలియబెట్టి, నివేదన చేసి, ప్రసాదంగా స్వీకరించాలి.



## కోయిల్ దద్ధ్యోదనం



**కావలసినవి:** సన్నని ముడి బియ్యం – ఒక కప్పు; ఉప్పు – తగినంత; నువ్వుల నూనె – తగినంత; పాలు – 4 కప్పులు; పెరుగు – ఒక టేబుల్ స్పూను.

**పోపు కోసం:** జీడిపప్పులు – గుప్పెడు; పచ్చి సెనగ పప్పు+ మినప్పప్పు – 2 టీ స్పూన్లు; అల్లం తురుము – ఒక టీ స్పూను; పచ్చి మిర్చి తరుగు – ఒక టేబుల్ స్పూను; మిరియాలు – పావు టీ స్పూను; జీలకర్ర – అర టీ స్పూను; ఇంగువ – అర టీ స్పూను; ఆవాలు – ఒక టీ స్పూను; కరివేపాకు – 2 రెమ్మలు; నువ్వుల నూనె – తగినంత; **అలంకరించడానికి:** పచ్చి మామిడి ముక్కలు – కొద్దిగా; కొత్తిమీర – కొద్దిగా.

**తయారీ:** ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి తగినన్ని నీళ్లు, ఉప్పు, నూనె జత చేసి ఉడికించి, దింపి, వేడిగా ఉండగానే గరిటెతో మెత్తగా అయ్యేలా మెదపాలి ● స్టౌ మీద పాలు ఉంచి, మరిగించి, కొద్దిగా చల్లారాక, అన్నంలో పోసి బాగా కలియబెట్టాలి ● కొద్దిగా పెరుగు జత చేసి మూత పెట్టి పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి కాగాక పోపు సామాన్లను ఒకదాని తరవాత ఒకటి వేసి వేయించి, దింపి, అన్నం మీద వేసి కలియబెట్టాలి ● మామిడి ముక్కలు, కొత్తిమీరతో అలంకరించాలి.

---

**శ్రీ ముఖపుస్తకం గారి వంటలు రుచి చూద్దామా!**

## ఆపిల్ జిలేబీ



మీనా సమయాల్

**కావలసినవి:** ఆపిల్స్ – 2; పాలు – అర లీటరు; మైదాపిండి – ఒక కప్పు; కార్న్‌ఫ్లోర్ – 3 టీ స్పూన్లు; ఏలకుల పొడి – పావు టీ స్పూను + పావు టీ స్పూను; నీళ్లు – తగినన్ని; ఫుడ్ కలర్ – చిటికెడు; పచ్చి కోవా – ఒక టేబుల్ స్పూను; పంచదార – ఒక కప్పు; జీడిపప్పు తరుగు – ఒక టీ స్పూను

**తయారీ:** ● ఒక పాత్రలో మైదా పిండి, కార్న్‌ఫ్లోర్ వేసి కలపాలి ● ఏలకుల పొడి జతచేయాలి ● తగినన్ని నీళ్లు జత చేసి బజ్జీ పిండిలా కలుపుకోవాలి ● ఫుడ్ కలర్ కొద్దిగా జత చేయాలి ● స్టౌ మీద పాలు పోసి మరిగించాలి ● కోవా జత చేసి కలియబెట్టాలి ● స్టౌ మీద ఒక గిన్నెలో తగినన్ని నీళ్లు పోసి మరిగాక, పంచదార జత చేసి తీగ పాకం వచ్చే వరకు కలియబెట్టాలి ● మరో పక్కన రబ్డీ (పాలు కోవా మిశ్రమం) కూడా సిద్ధం చేసుకుని దింపేయాలి ● ఆపిల్ పైచెక్కు తీసి, చక్రాలుగా తరిగి పొడిగా ఉన్న మైదా పిండిలో దొర్లించాలి ● తయారుచేసి ఉంచుకున్న మైదా పిండి మిశ్రమంలో ఈ చక్రాలను ముంచి, స్టౌ మీద కాగుతున్న నూనెలో బజ్జీల మాదిరిగా వేసి వేయించి తీసేసి, పంచదార పాకంలో కొద్దిసేపు నానబెట్టాక, ప్లేట్‌లోకి తీసుకుని, వాటి మీద రబ్డీ పోసి, జీడిపప్పులతో అలంకరించి అందించాలి.

---

**ఆయుర్వేదం**

# అనుదిన ద్రవ్యాలు అమోఘ గుణాలు

**తెలుగువారి పండుగలు, ఆచారాలు, ధార్మిక సంస్కృతితో సమ్మిళితమై ఉంటాయి. దైవ కైంకర్యంలో నైవేద్యానిది ప్రధాన పాత్ర. చక్రపొంగలి, దద్ధ్యోదనం, పులిహోర వంటి ప్రసాదాలు మనకు అతి సాధారణం. వీటన్నింటిలోనూ సామాన్య ద్రవ్యం 'వరి అన్నమే'. ఇతర పదార్థాలలో నెయ్యి, బెల్లం/శర్కర ; పెరుగు, నిమ్మకాయ/చింతపండు' ప్రధానమైనవి. ఇవి మనకి అతి సామాన్యంగా కనిపిస్తాయే గాని వాటి పోషక విలువలు, గుణధర్మాలు అమోఘం. వీటి ప్రయోజనాలు ఆయుర్వేద గ్రంథాలలో సుస్పష్టంగా కనిపిస్తాయి.**

### నెయ్యి



ఘృతం, ఆజ్యం, సర్పి మొదలైనవి నెయ్యికి సంస్కృత పర్యాయపదాలు. ఆయుర్వేదంలో ఆవు నేతికి విశిష్టత ఉంది.

**గుణధర్మాలు:** మధురం, ప్రధానంగా పిత్త దోషహరం, వాత కఫ శ్యామకం, చలువ చేస్తుంది. తెలివితేటలను పెంచుతుంది. ఓజోకరం, శుక్రకరం, రసాయనం (సప్త ధాతు పుష్టికరమై క్షమత్వ వర్ధకం). లావణ, కాంతి, తేజోవర్ధకం. ముసలితనం రానీయకుండా యౌవనాన్ని పదిలపరుస్తుంది. ఆయు వర్ధకం. మంగళకరం. కంటికి మంచిది.

**గవ్యం ఘృతం విశేషేణ చక్షుష్యం, వృషం, అగ్నికృత్.... మేధా లావణ్య కాంతి తేజో ఓజో వృద్ధికరం, వయస్థాపకం, బల్యం, సుమంగలం, ఆయుష్యం, సర్వ ఆజ్యేషు గుణాధికం**

➡ ఆవు నెయ్యిని హోమం చేస్తే వచ్చే పొగ విష హరం, క్రిమిహరం, వాతావరణ కాలుష్య హరం.

➡ **ఆవు పెరుగు:** కొంచెం పులుపు. ఎక్కువ తీపి కలిగితే రుచిలో నుంచి ఆకలిని పెంచి, ధాతుపుష్టిని కలిగించి, గుండెకు కూడా శక్తినిస్తుంది. నాడీవ్యవస్థను పటిష్ఠపరుస్తుంది (వాత హరం).

అందువలననే దీనిని చాలా పవిత్రమని వర్ణించారు.

**గవ్యం దధి విశేషేణ... రుచిప్రదం, పవిత్రం, దీపనం, హృద్యం, పుష్టికృత్, పవనాపహం...**

**గేదె పెరుగు:** ఇది చాలా చిక్కగా ఉండటం వలన బరువైన ఆహారంగా చెప్పబడింది. కఫకరం, స్రోతస్సులలో అవరోధం కలిగిస్తుంది. రక్తాన్ని దూషిస్తుంది. శుక్రకరం.

రాత్రిపూట పెరుగు తినకూడదు (రాత్రౌ దధి న భుంజీత). పెరుగును వేడి చేయకూడదు. మితిమీరిన పరిమాణంలో పెరుగును సేవించకూడదు.

### బెల్లం



చెరకు రసం నుంచి తయారుచేసిన బెల్లం తియ్యగా, జిగురుగా ఉండి శుక్రవర్ధకంగా ఉపకరిస్తుంది. దేహంలో కొవ్వుని పెంచుతుంది. కొంతవరకు వేడిని తగ్గిస్తుంది కాని శర్కరంత చలువచేయదు. బలవర్ధకమే కాని, కఫాన్ని క్రిములను పెంచుతుంది.



పాతబెల్లం (పురాణ గుడం) చాలా మంచిది (పథ్యం). వేడిని తగ్గించి, కొవ్వును కరిగిస్తుంది. జఠరాగ్నిని పెంచి పుష్టిని కలిగిస్తుంది. (కాని ఈనాడు బెల్లం తయారీలో చాలా కెమికల్స్‌ని కలిపి, కల్తీ చేస్తున్నారు. ఇది హానికరం).

### శర్కర

ఆయుర్వేద శాస్త్రంలో చెప్పిన శర్కర చాలా విశిష్టమైనది. దాని తయారీ వేరు. ఈనాడు చేస్తున్న పంచదార తయారీలో పోషక విలువలు శూన్యం. పరిపూర్ణంగా కెమికల్స్ మయం. చాలా అనర్థదాయకం.

### చింత



చింతకాయ చక్కటి పులుపు కలిగి వాత హరంగానూ, కించిత్ పిత్తకఫాలను పెంచేదిగానూ ఉంటుంది. బరువుగా ఉండి ఆలస్యంగా జీర్ణమవుతుంది. పక్వమైనది (చింత పండు) ఆకలిని పెంచి, విరేచనం సాఫీగా అవటానికి సహకరిస్తుంది (సుఖరేచకం). ఉష్ణ వీర్యమై వాతకఫహరంగా ఉంటుంది.

'చించా, తింత్రిణీ, తింతిడీ, అమ్లీ, చుక్రికా... మొదలైనవి. చింతకాయ /పండునకు సంస్కృత పర్యాయ పదాలు

### నిమ్మ



నింబు, జంబీర అను పర్యాయ పదాలున్నాయి. కఫవాత శ్యామకం. దప్పికను తగ్గిస్తుంది. (తృష్ణాహరం). రుచిని పెంచుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మూత్రకరం. జ్వరహరం. కంఠవికారాన్ని తగ్గిస్తుంది. నేత్రదృష్టి వర్ధకం. బాగుగా పరిపక్వమైనది (పండు) వాడుకుంటే మంచిది.

### ఇంగువ (హింగు)



ఉష్ణవీర్యం, ఆహార పచనం బాగా చేస్తుంది. కడుపు నొప్పి, కడుపులోని వాయువు, క్రిములను పోగొడుతుంది. వాతకఫహరం.

### పసుపు (నిశా, హరిద్రా)



ఇది కడుపులోకి సేవించినా లేక బయట పూతగా వాడినా కూడా క్రిమిహరం. రక్తశోధకం, జ్వరహరం, మధుమేహ హరం. శరీర కాంతిని పెంచి చర్మరోగాలని దూరం చేస్తుంది.



- డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ శనివారం
14-12-2019

అతిథి

# ముద్దుల మావయ్య హిందీలో నేనే తీశాను


'నమస్తే నేస్తం'లో ఓ దృశ్యం

**బాలీవుడ్‌లో భారీ చిత్రాల నిర్మాతగా ఒక కాలంలో ఊపు ఊపిన వ్యక్తి కేసీ బొకాడియా. అమితాబ్‌తో హిందీలో 'ముద్దుల మావయ్య'ను 'ఆజ్ కా అర్జున్'గా రీమేక్ చేశారు. రజనీకాంత్, మిథున్ చక్రవర్తి బొకాడియా సినిమా అంటే డేట్స్ ఇవ్వడానికి రెడీగా ఉండేవారు. ఇప్పుడాయన హిందీలో తాను తీసిన 'తేరీ మెహర్బానియా' చిత్రం స్ఫూర్తితో తెలుగులో 'నమస్తే నేస్తం' అనే సినిమా తెరకెక్కించారు. ఈ సినిమా ద్వారా తెలుగులోకి తొలిసారి దర్శక–నిర్మాతగా పరిచయమవుతున్నారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా తన ప్రయాణం గురించి 'సాక్షి'తో ముచ్చటించారు.**

హిందీలో మన్మోహన్ దేశాయ్ అనే దర్శకుడు ఉన్నారు. ఆయన ఫార్ములా ఏంటంటే.. సినిమాలో ఇద్దరు హీరోలుంటారు. వాళ్లు చిన్నప్పుడు విడిపోతారు. ఇంటర్వెల్‌కి కలుస్తారు. ఈ ఇద్దరూ సెకండ్ హాఫ్‌లో విలన్లను ఎలా మట్టుపెట్టారన్నది కథాంశం. ఇదే పాయింట్‌తో రెండు కుక్కలను హీరోలుగా పెట్టి 'నమస్తే నేస్తం' సినిమా తీశాను.

### కుక్కపిల్లలతో నేస్తం

విడిపోయిన రెండు కుక్కపిల్లల్లో ఒకటి పోలీసుల దగ్గర, మరోటి దొంగల దగ్గర పెరుగుతాయి. శ్రీరామ్ పోలీస్ పాత్ర చేశారు. అతను హత్యకు గురవుతాడు. విడిపోయిన కుక్కపిల్లలు ఎలా కలుసుకున్నాయి, ఎలాంటి సాహసాలు చేశాయి? బాస్‌ని చంపిన వాళ్ల మీద ఎలా పగ తీర్చుకున్నాయి? అనేది కథ. బ్రహ్మానందం ఈ కుక్కపిల్లలకు శిక్షణ ఇచ్చే పాత్రలో కనిపిస్తారు.

### అప్పుడే కాదు.. నేనిప్పుడూ అంతే

పెద్ద హీరోలతో సినిమా చేద్దామనుకున్నాను. బడ్జెట్ పెరిగిపోయింది. పైగా హీరోలందరూ ఎవరి బ్యానర్ వారు పెట్టుకొని సొంతంగా సినిమాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో 'నాకో సినిమా చేయండి' అంటూ అందరి డోర్ కొట్టలేను. నేను బాగా సినిమాలు తీస్తున్న సమయంలో అలా అడిగింది లేదు. ఇప్పుడూ అంతే..

### ఫాస్టెస్ట్ ప్రొడ్యూసర్

మా నాన్నగారు ఒక్క సినిమా కూడా చూసింది లేదు. అలాంటిది నేను హిందీ పరిశ్రమలోకి వచ్చి 50 సినిమాలకు పైగా నిర్మించాను. అతి తక్కువ సమయంలో 50 సినిమాలు తీసిన నిర్మాతను కాబట్టి నన్ను 'ఫాస్టెస్ట్ ప్రొడ్యూసర్' అంటారు. దర్శకుడిగా తొలి సినిమాను అమితాబ్ బచ్చన్ ('ఆజ్ కా అర్జున్')తో తీశాను. రజనీకాంత్‌తో ఐదు సినిమాలు చేశాను.

### రజనీతో ప్రయాణం

చెన్నైలో రజనీకాంత్ ఇల్లు, మా ఇల్లు దగ్గర దగ్గరే ఉండేవి. రజనీతో నేను 'ఫూల్ బనే అంగారే, త్యాగీ, ఇన్‌సానియత్ కా క్యా హోగా, ఇన్‌సాఫ్ క్యా కరేగా?, అస్‌లీ– నక్‌లీ' సినిమాలు చేశాను. 'ఈ సినిమా కథేంటి' అని రజనీ అడిగిన సందర్భం లేదు. 'బొకాడియా సినిమా.. చేస్తున్నా' అనేవారు. మా ఇద్దరి అనుబంధం అలాంటిది.

- రజనీ ఫిలాసఫీలు భలే ఉంటాయి ఓసారి.. డబ్బంటే ఏంటి? కాగితం అంతే. ఆ కాగితానికి కరెన్సీ అనే విలువ ఇవ్వకపోతే బీరువాలో న్యూస్‌పేపర్ పెట్టుకుని కూడా కోట్లు ఉన్నట్టు దీమాగా ఉండొచ్చు అన్నారు.

### బచ్చన్‌కి కోటి రూపాయల పారితోషికం

అమితాబ్ బచ్చన్‌తో సినిమా తీయండని మా ప్రొడక్షన్ మ్యానేజర్ అంటే, బచ్చన్‌ని కలసి విషయం చెప్పాను. అప్పటికి దర్శకుడు, కథ ఏదీ లేదు. 'కథ, దర్శకుడు' లేకుండా అంగీకరిస్తున్న సినిమా ఇదే బొకాడియా' అన్నారు బచ్చన్. రెండు నెల్లలో పాయింట్ ఓకే అయింది. ఒక దర్శకుడిని అనుకున్నాం కానీ కుదర్లేదు. మీరెందు కు డైరెక్షన్ చేయకూడదు అని నా స్టాఫ్ అన్నారు. నాకు దర్శకత్వం మీద అవగాహన లేదు. కానీ కథ మీద కంట్రోల్ ఉంది. రేపు ముహూర్తం అనగా తమిళ దర్శకుడు మణివణ్ణన్‌తో అరగంట మాట్లాడాను. ఆ అవగాహనతో నేనే డైరెక్షన్ చేయాలనుకున్నాను. మరుసటి రోజు ముహూర్తంలో నేను పెట్టిన షాట్ చూసి అమితాబ్ అభినందించారు. అదే 'ఆజ్ కా అర్జున్' సినిమా.


రజనీకాంత్‌తో...

- మేం 70 లక్షలు తీసుకుంటున్నాం, ఇప్పుడు 80 లక్షలు అని పారితోషికం గురించి బచ్చన్ మేనేజర్ అన్నారు. 'ఏంటీ? బచ్చన్ కోటి రూపాయిలు కూడా తీసుకోవడం లేదా? కోటి తీసుకోండి' అన్నాను. మార్వాడీ అతను బేరం చేయకుండా అడిగిన దానికంటే ఎక్కువ ఇస్తున్నాడేంటి? అన్నట్టు చూశారు.


అమితాబ్‌తో...

### నా స్వభావమే అంత

'పోలీస్ ఔర్ ముజ్రిమ్' అనే సినిమాను వినోద్ ఖన్నా, మీనాక్షీ శేషాద్రితో ప్లాన్ చేశాను. ముహూర్తం కుడా పెట్టాం. ముందు రోజు సాయంత్రం రాజ్‌కుమార్‌గారు ఓ పాత్రకు బావుంటార నుకున్నాం. ఆయనకు ఫోన్ చేసి ఓ మంచి పాయింట్ ఉంది.. చేయాలన్నాను. వెంటనే ఒప్పుకుని మరుసటి రోజు ఓపెనింగ్‌కు వచ్చారు.

- ఆయన సినిమా అంగీకరించాలంటే మనిషి కూడా నచ్చాలి. ఒక దర్శకుడు ఆయనకు కథ చెప్పడానికి వెళ్లాడు. రాజ్‌కుమార్ కథంతా విని, బావుంది కానీ నీ తలకు పెట్టుకున్న సంపెంగ నూనె ఇబ్బందిపెడుతోంది. 6 నెలలు ఇబ్బంది పడుతూ పని చేయలేను. అందుకే సినిమా చేయలేను అని చెప్పారు. అలాంటి ఆయన 'పోలీస్ ఔర్ ముజ్రిమ్'లో కీలక పాత్ర చేశారు. నేను చాలామంది హీరోలకు సినిమా చేయాలనుకుంటున్న విషయాన్ని ఫోన్‌లో చెబితే, ముందు 'యస్' చెప్పి, తర్వాత కథ వినేవారు.

### నా అభిమాన నటుడు ఇబ్బందిపెట్టాడు

చిన్నప్పుడు మనందరం మనకు నచ్చిన స్టార్స్‌లా హెయిర్ కట్ చేయించుకుంటాం కదా. నేనూ అలానే ఓ స్టార్ హీరోకి ఫ్యాన్‌గా ఉండే వాణ్ణి. దర్శకుడిని అయ్యాక ఆయనతో సినిమా చేసే అవకాశం లభించింది. కానీ ఆ ప్రముఖ నటుడు నా సినిమా సెట్లో ఇబ్బంది పెట్టారు. ఆరోగ్యం బాలేదని చెప్పి రూమ్‌లో మందు కొడుతూ కూర్చున్నాడు. మీ అవసరం మాకు లేదు అని అతన్ని అక్కడి నుంచి వెనక్కి పంపించేశాను. నా స్వభావమే అంత.

### స్టార్స్‌ని పరిచయం చేశాను

'దీవానా మే దీవానా'తో ప్రియాంక చోప్రాను హిందీలో పరిచయం చేశాను. జేకే బీహారి దర్శకత్వంలో తెరకెక్కిన 'బీవీతో ఏసీ హై' ద్వారా సల్మాన్ ఖాన్ నటుడిగా పరిచయం అయ్యారు. ఆ సినిమాకు నేనే సమర్పకుణ్ణి. ముందు వేరే హీరోలను అనుకున్నాం కానీ బాగోరనిపించింది. ఫైనల్‌గా సల్మాన్‌ని ఓకే చేశాం.

### తెలుగు ఇండస్ట్రీ బెస్ట్

ప్రస్తుతం బాలీవుడ్‌లో కంపెనీ కల్చర్ నడుస్తోంది. ఏ దర్శకుడైనా కథను యాక్టర్‌కి చెప్పాలి కదా? కథ ఉంది అంటే మన కంపెనీలో చెప్పండి అంటున్నారు. ఈ విధానం నాకు నచ్చలేదు. దర్శకుడు, హీరో నేరుగా కూర్చుని కథ గురించి చర్చించుకోవాలి. కంపెనీతో నేను చెప్పి, వాళ్లు హీరోకి చెప్పి.. ఇదంతా నాకిష్టం లేదు. అందుకే సినిమాలు తీయడంలేదు.

- ప్రస్తుతం భారతదేశంలో తెలుగు ఇండస్ట్రీయే బెస్ట్ ఇండస్ట్రీగా ఉంది. తెలుగులో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాను.
- నిర్మాత గా సున్నా నుంచి మొదలై టాప్ పొజిషన్‌లోకి వచ్చాను. మధ్యలో కొంచెం విరామం వచ్చింది. ఇప్పుడు మళ్లీ ప్రయాణం ప్రారంభిస్తున్నాను. టాప్‌కి వెళ్లగలను అనే నమ్మకం నాకుంది. దర్శక–నిర్మాతగా చాలా వైభవాన్ని చూశాం. ఓ సినిమాకి దర్శకుడిగా నేను కోటి రూపాయిల పారితోషికం అందుకుంటే ఆ సినిమాకి రజనీకాంత్ 20 లక్షల రూపాయిలు పారితోషికం తీసుకున్నారు. అలాంటి వైభవాన్ని చూశాను.

# వెబ్‌లోకి ఎంట్రీ

వెబ్ వరల్డ్‌లోకి అడుగుపెడుతున్న స్టార్స్ జాబితాలోకి మాధురీ దీక్షిత్ కూడా జాయిన్ అయిపోయారు. ఇటీవలే సమంత, కియారా అద్వానీ, రాధికా ఆప్టే, జాన్వీ కపూర్ వెబ్‌లో అడుగుపెట్టారు. త్వరలోనే నెట్‌ఫ్లిక్స్ రూపొందించబోయే ఓ వెబ్ సిరీస్‌లో మాధురీ లీడ్ రోల్‌లో నటించనున్నారు. ఈ సిరీస్‌ను నెట్‌ఫ్లిక్స్‌తో కలసి కరణ్ జోహార్ నిర్మిస్తారు. ''నెట్‌ఫ్లిక్స్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. గతంలో నెట్‌ఫ్లిక్స్ కోసం 'ఆగస్ట్ 15' అనే మరాఠీ చిత్రాన్ని నిర్మించాను. మేం చేయబోయే సిరీస్ వినోదాత్మకంగా, హృదయాన్ని హత్తుకునేలా ఉంటుంది'' అని పేర్కొన్నారు మాధురీ దీక్షిత్. శ్రీ రావ్ దర్శకత్వం వహించనున్న ఈ వెబ్ సిరీస్ చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది.


మాధురీ దీక్షిత్

# ఫుల్ యాక్షన్...


జ్యోతి, వినయ్

వినయ్ పరుసెల్ల, జ్యోతి జంటగా 'రామ రావణ రాజ్యం' అనే సినిమా తెరకెక్కనుంది. వీ3 ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కనున్న ఈ చిత్రానికి వికాశ్ వి. దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేసింది చిత్రబృందం. ''జనవరి మొదటి వారం నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. పాత, కొత్త నటుల కాంబినేషన్‌లో సినిమా ఉంటుంది. పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం ఇది'' అని వికాశ్ వి. తెలిపారు. ఈ చిత్రానికి కనిష్క సంగీతాన్ని అందించనున్నారు.

# ఐదు పాత్రల చుట్టూ...

ఎస్తర్ అనిల్ ('దృశ్యం' ఫేమ్), నైనా గంగూలీ ('వంగవీటి' ఫేమ్), ఈశ్వరీరావు, రోహిణి, శుభలేఖ సుధాకర్ ప్రధాన తారాగణంగా తేజ మార్ని దర్శకత్వంలో భాను సందీప్ మార్ని నిర్మించిన చిత్రం 'జోహార్'. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''దర్శకుడిగా ఇది నాకు తొలి సినిమా. ఇంతకు ముందు రామ్ గోపాల్‌వర్మ 'వంగవీటి' చిత్రానికి దర్శకత్వ శాఖలో, ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్‌గారి వద్ద రచనా విభాగంలో పని చేసిన అనుభవం ఉంది. పొలిటికల్ సెటైర్ నేపథ్యంలో ఐదు పాత్రల చుట్టూ అద్భుతంగా తిరిగే ఎమోషనల్ డ్రామాయే ఈ చిత్రం. సినిమాలో మంచి కంటెంట్ ఉంది. విజయంపై నమ్మకంతో ఉన్నాం'' అన్నారు తేజ మార్ని. ఈ సినిమాకు ప్రియదర్శన్ స్వరకర్త.


ఎస్తర్

బాలీవుడ్

# అదే జీవితం కాదు

''దిగులుగా ఉంది చాలా..! అమ్మా, నాన్న, అక్క.. ఫ్యామిలి అంతా ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తారు నన్ను. అయినా సంతోషంగా లేను. ఎందుకో తెలియదు. దీని మీదే ఇన్‌స్టాగ్రామ్‌లో ఏదో రాయాలనుకున్నా. అందుకు తగిన ఫొటోల కోసం చూస్తుంటే... అన్నీ హ్యాపీ ఫీల్‌తో ఉన్నవే. అరే.. దిగులుతో సగమవుతూ సంతోషంగా ఉన్న ఫొటోలు ఎందుకు చూస్తున్నాను? అనిపించింది. ఆ ఆలోచన, నాకు నేను వేసుకున్న ప్రశ్నే "I' ve Never Been (Un)Happier" పుస్తకంగా మీ ముందుకు వచ్చింది.''

ఈ మాటను పంచుకున్న వ్యక్తి షహీన్ భట్. 'ఐ హావ్ నెవర్ బీన్ (అన్) హ్యాపియర్' రచయిత్రి. నిజానికి షహీన్‌కూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. పదమూడో యేట నుంచే రచనా వ్యాసంగంలో ఉంది ఆమె. కాని.. మరింత వివరంగా తెలియాలంటే ఆమె అలియాభట్ సోదరి అని చెప్పక తప్పదం లేదు. ఈ పుస్తకంతో ఒక్కసారిగా వార్తల్లోకి వచ్చింది షహీన్. రచయితగా ఆమె పరిచయం, ఆ పుస్తకాన్ని ఆమె తను అనుభవించిన డిప్రెషన్ మీద రాయడం.. ఈ రెండూ సంచలనం రేపాయి. షహీన్ డిప్రెషన్‌తో బాధపడ్తున్నట్టు ఆమె పద్దెనిమిదో యేట మానసిక వైద్యనిర్ధారణలో వెల్లడైంది. అప్పటికే అయిదేళ్ల నుంచి దాని తాలూకు లక్షణాలు ఆమెను వెంటాడుతూనే ఉన్నాయి. ఆమె అందులోంచి బయటపడ్డానికి తల్లి సోనీ రాజ్దాన్, తండ్రి మహేశ్ భట్, అక్క అలియా ఎంతో సహకరించారు. ''క్షణం తీరికలేని బిజీ షెడ్యూల్‌లో ఉన్నా నా కోసం టైమ్ కేటాయించేది అలియా. నేను మామూలు మనిషి అవడానికి ఎంత హెల్ప్ చేసిందో! నేను ఈ కుటుంబంలో పుట్టడం.. అర్థం చేసుకునే తల్లిదండ్రులు ఉండడం, చేయి వదలని తోబుట్టువు దొరకడం నిజంగా అదృష్టం'' అంటుంది షహీన్ ఆ రోజులను గుర్తుచేసుకుంటూ! 'ఐ హావ్ నెవర్ బీన్ (అన్)హ్యాపియర్' పుస్తకం రాయడానికి దాదాపు యేడాది పట్టిందట. ముందసలు తన దిగులు, వ్యాకులత గురించి బయటకుఎందుకు చెప్పుకోవాలి? తన బాధను పుస్తక రూపంలో అలా బయటపెట్టడం సాహసమే. అంత ధైర్యం తనకు ఉందా అని ఎంతో మానసిక సంఘర్షణ అనుభవించాకే పుస్తకం రాసిందట షహీన్. ''అమ్మానాన్న ఇద్దరూ ధైర్యవంతులే. దాపరికం అస్సలు ఉండదు వాళ్లకు. ఉన్నదున్నట్టు నిజాయితీగా మాట్లాడేస్తారు. వాళ్ల నుంచి నాకూ ఆ నిజాయితీ గుణం వచ్చింది. కాని ధైర్యం లేదు. నిజాయితీ, ధైర్యం ఈ రెండు వేర్వేరు విషయాలు. తర్జనభర్జన తర్వాత డిసైడ్ అయ్యా.. నేను పడ్డ బాధను నిజాయితీగా పుస్తక రూపంలో పంచుకోవాలనుకున్నా. అదే చేశా. మన దగ్గర దీని మీద సరైన అవగాహన లేదు. ఫలానా ఆమె మెంటల్ అనో.. పిచ్చిదనో.. ముద్ర వేసేస్తారు. ఈ పుస్తకం ద్వారా డిప్రెషన్ మీద కొంత అవగాహన కూడా వస్తుందని ఆశ'' అని చెప్తుంది షహీన్.




ఆమె అనుకున్నట్టుగానే ఆ పుస్తకం రాసినందుకు షహీన్ మీద కామెంట్లు వచ్చాయి. దానికి ఆమె ఘాటుగానే స్పందించింది.. ''డిప్రెషన్‌తో స్ట్రగుల్ నా జీవితంలో ఒక భాగం మాత్రమే. అదే నా జీవితం కాదు'' అని.


అక్క అలియా భట్‌తో షహీన్ భట్

మార్పు

# చదువుల తల్లుల తండ్రి

**డాడీస్ లిటిల్ గర్ల్... అవును
కూతుళ్లెప్పడూ నాన్నలకు బంగారు తల్లులే!
నాన్నలెప్పుడూ బిడ్డలకూ రోల్‌మోడల్సే!
అందుకే నాన్న వేసే ప్రతి అడుగూ
జాగ్రత్తగా పడాలి.. పడ్తోంది!
అలాంటి తండ్రులు మన దగ్గరే కాదు
పాకిస్తాన్‌లో ఉన్నా.. అఫ్ఘానిస్తాన్‌లో
కనిపించినా సెల్యూట్ చేయాల్సిందే!!
మియా ఖాన్ కూడా
ఆ వందనం స్వీకరించదగ్గ ఫాదరే!!**

అమ్మాయిలకు చదువును నిషేధించిన తాలిబన్ ప్రభావం విపరీతంగా ఉన్న అఫ్ఘానిస్తాన్ నివాసి మియా ఖాన్. అక్షరం ముక్క తెలియదు. రోజూవారీ కూలీతో కుటుంబాన్ని పోషిస్తాడు. అతనికి ఏడుగురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. మన దగ్గర నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అమ్మాయిలను చదువు మాన్పించి మైళ్ల దూరంలో ఉన్న బావులు, చెరువులు, కొలనుల నుంచి నీళ్లు మోసుకొచ్చే కొలువులో పెడ్తాం. శారీరక దారుఢ్యం ఉన్న అబ్బాయిలను మాత్రం స్కూళ్లకు పంపుతాం. మియా ఖాన్ ఆ కోవకు చెందిన వాడు కాదు. ఘోషాయే అమ్మాయిల అస్తిత్వంగా ఉన్న దేశంలో తన ఏడుగురు కూతుళ్లకు చదువు చెప్పించి... ఆ ఏడుగురిలో ఒకమ్మాయిని వైద్యసౌకర్యం లేని తన ఊరికి డాక్టర్‌గా చేయాలని నిర్ణయించుకున్నాడు. కొడుకులను పనికి పంపించి.. ప్రతిరోజు ఉదయం తన బిడ్డలను పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూల్‌కి తీసుకెళ్తాడు. బడి వేళ అయిపోయే వరకు ఉండి మళ్లీ వాళ్లను ఇంటికి తీసుకొస్తాడు. అనారోగ్యం వల్ల పనికి వెళ్లడం మానేసినప్పటి నుంచి ఇదే అతని దినచర్య అయింది. అంతకుముందు మియా ఖాన్ కొడుకులు తమ చెల్లెళ్లను బడికి తీసుకెళ్లేవారు. ఏడుగురిలో ఒకమ్మాయి అయిన రోజీ ''మా ఊళ్లో చాలామంది అమ్మాయిలకు లేని అవకాశం, అదృష్టం మాకు కలిగింది. ఎందుకంటే మా నాన్న ధైర్యవంతుడు. తన బిడ్డలు చదువుకోవాలి.. చదువుకుంటేనే జీవితం అని తెలిసిన వాడు. మాకూ అదే చెప్తూంటాడు. ఇప్పుడు నేను ఆరవ తరగతిలో ఉన్నాను. డాక్టర్ కావాలనుకుంటున్నాను'' అని చెప్తుంది గర్వంగా!




మియా ఖాన్

''చదువు లేకపోవడం.. రాకపోవడం ఎంత శాపమో నాకు తెలుసు. అందునా ఆడపిల్లలకు అక్షరమే ఆయుధం. నా బిడ్డలు నాలా కాకూడదు. బాగా చదువుకోవాలి. వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడాలి. నా పిల్లల్ని అంత దూరం స్కూల్‌కి తీసుకెళ్తుంటే చాలా మంది చాలా రకాలుగా మాట్లాడారు. నా మొండితనం చూసి ఇప్పుడిప్పుడే వెనక్కి తగ్గుతున్నారు''అంటాడు మియా ఖాన్.

అప్పుడు మలాలా.. ఇప్పుడు రోజీ, ఆమె ఆరుగురు అక్కచెల్లెళ్లు. వీళ్లు కదా ఆడపిల్లలకు ధైర్యం! మలాలా తండ్రి.. మియా ఖాన్ వీళ్లు కదా.. ప్రపంచానికి స్ఫూర్తి!

సైన్స్ బిట్స్

# కంటి పరీక్ష ఇక ఇంట్లోనే...



వయసుతోపాటు చూపు మందగించడం అందరికీ అనుభవమైన విషయమే. కళ్లజోళ్లతో ఆ చిక్కును కాస్తా దాటేస్తామనుకోండి. కాకపోతే తరచూ కళ్లు చెక్ చేయించుకోవడం, తగిన ప్రిస్క్రిప్షన్‌తో కళ్లజోళ్లు ఆర్డర్ చేయడం, వచ్చేదాకా పాతవాటితో సర్దుకుపోవడం కొంచెం చీకాకైన పనే. థ్యాంక్స్‌టు స్మార్ట్‌ఫోన్... ఇకపై ఆ సమస్య ఉండబోదు. ఓ బుల్లి పరికరం దాంతోపాటు పనిచేసే అప్లికేషన్‌తో ఎంచక్కా ఇంట్లోనే కళ్లు పరీక్షించుకునే అవకాశం కల్పిస్తోంది ఓ కంపెనీ. ఐక్యూ విజన్ చెక్ అని పిలుస్తున్న ఈ కొత్త పరికరం, ఆప్ అత్యాధునిక మెషీన్ లెర్నింగ్ ఆధారంగా పనిచేస్తాయి. కళ్లు చెక్ చేసుకోవాలనుకున్నప్పుడు పరికరాన్ని స్మార్ట్‌ఫోన్ కు బిగించుకోవడం.. కళ్లజోళ్లు తీసేసి ఒక్కో కంటికి దగ్గరగా పెట్టుకుని పరీక్ష చేసుకోవచ్చు. కళ్ల ముందు కనిపించే రెండు గీతలను ఒకదానిపై ఒకటి చేర్చేలా ఐక్యూ యంత్రంపై ఉన్న బటన్‌లను నొక్కుతూండటం ఒక్కటే మనం చేసే పని. కంటిలోని ప్రతి కోణం నుంచి వివరాలు సేకరించి మన దృష్టి మాంద్యం తీవ్రత ఎంతన్నది అంకెల్లో చెప్పేస్తుంది ఈ యంత్రం. ఆన్‌లైన్‌లో డిజైన్ ఎంచుకుని, ప్రిస్క్రిప్షన్‌ను జోడిస్తే ఒకట్రెండు రోజుల్లో కొత్త కళ్లజోడు రెడీ!

# కలుపు తీసే కొత్త యంత్రం



వ్యవసాయంలో రైతు పెట్టే పెట్టుబడుల్లో కలుపుతీత కూడా ఒకటి. అయితే ఈ కాలంలో కలుపు తీసే వ్యవసాయ కూలీలకు కొరత ఉన్న నేపథ్యంలో బ్రిటన్‌కు చెందిన స్మాల్ రోబోట్ కంపెనీ ఓ సరికొత్త యంత్రాన్ని అభివృద్ధి చేసింది. ఇది పంట చేలలో మొలిచే పిచ్చి మొక్కలను మాత్రమే ఎంచుకుని మరీ కరెంటు షాకిచ్చి చంపేస్తుంది. ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. ఇదే కంపెనీ గత ఏడాది వ్యవసాయ పనులను స్వతంత్రంగా చక్కబెట్టే టాం, హ్యారీ పేర్లతో రెండు రోబోలను సిద్ధం చేయడం. టాం తన కెమెరా కన్నులతో కలుపు మొక్కలను గుర్తించేదికాగా.. హ్యారి అత్యంత కచ్చితత్వంతో విత్తనాలు నాటుతుంది. స్మాల్ రోబో కంపెనీ తాజాగా అభివృద్ధి చేసిన రోబోట్ డిక్.. విద్యుత్తు షాక్‌లతో కలుపు మొక్కలను నాశనం చేస్తుంది. ఇంకోలా చెప్పాలంటే హానికారక రసాయన మందుల వాడకం అస్సలు అవసరం లేదన్నమాట. అంతే కాకుండా.. పొలంలోని జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటూ నేల సారాన్ని పరిరక్షించుకునేందుకు ఈ రోబో అవకాశం కల్పిస్తుంది. ఈ మూడు రోబోలను కలిపి ఉపయోగించడం ద్వారా పొలం పనులు చాలా వేగంగా పూర్తి చేయవచ్చునని కంపెనీ చెబుతోంది. పొలంలోని ఒక్కో మొక్కను పరిశీలించి.. మిల్లీమీటర్ సైజులో ఉన్న కలుపు మొక్కలను సైతం గుర్తించగలగడం ఈ రోబోల ప్రత్యేకత అని స్మాల్ రోబోట్ కంపెనీ వ్యవస్థాపకుడు సామ్ వాట్సన్ జోన్స్ అంటున్నారు. 2020లో సుమారు 20 చోట్ల వీటిని ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తామని, ఆ తరువాతి సంవత్సరం అందరికీ అందుబాటులోకి తెస్తామని కంపెనీ వివరించింది.

సాక్షి
ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
శనివారం ॥ 14-12-2019


చిరంజీవి

# ఛలో రాజమండ్రి

చిత్రబృందంతో కలసి రాజమండ్రిలో ల్యాండ్ అవడానికి స్కెచ్ గీస్తున్నారు కొరటాల శివ. చిరంజీవి హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. రామ్‌చరణ్, నిరంజన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ ఈ నెల 26న హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. పాట చిత్రీకరణతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభిచాలనుకుంటున్నారు. ఇందులో త్రిష కథానాయికగా నటించనున్నారని సమాచారం. ఈ సినిమా రెండో షెడ్యూల్‌ను రాజమండ్రిలో చిత్రీకరించాలనుకుంటున్నారట. అక్కడ లొకేషన్స్ వెతికే పనిలో ఉందట యూనిట్. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

# బాహుబలి కంటే గొప్పగా...


రానా

రానా హీరోగా గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న మైథాలజీ మూవీ 'హిరణ్యకశ్యప'. దాదాపు 180 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రం తెరకెక్కనుందని సమాచారం. అయితే ఈ సినిమా ప్రకటన వచ్చి దాదాపు రెండేళ్లు అవుతోంది. కానీ ఈ చిత్రం ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందనే విషయంపై సరైన స్పష్టత రావడం లేదు. ఈ విషయంపై రానా ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడారు. ''ఈ సినిమా ప్రీ–ప్రొడక్షన్ వర్క్‌ని పక్కాగా ప్లాన్ చేస్తున్నాం. ఇలాంటి సినిమాల్లో విజువల్స్ బాగుండాలని ఓ యాక్టర్‌గా నేను కోరుకుంటున్నాను. అందుకే సాంకేతికపై మరింత బాగా దృష్టి పెట్టాం. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా వర్చువల్ రియాలిటీ సెట్స్‌ని క్రియేట్ చేయాలనుకుంటున్నాం. ఇలా చేయడం వల్ల సినిమా మొదలు కాకముందే విజువల్స్ ఎలా ఉంటాయో ఓ అవగాహనకు రావొచ్చు. బహుశా.. ఇండియాలో ఇలా చేస్తున్నది మా టీమే అనుకుంటాను. ఇందుకోసం ఓ త్రీడీ స్కానింగ్ కంపెనీతో అసోసియేట్ కాబోతున్నాం. ఇంకా గ్రౌండ్ వర్క్ జరుగుతోంది. మేం అనుకున్న ప్రణాళిక ప్రకారం ముందు ప్రీ–ప్రొడక్షన్ పనులు పూర్తి చేస్తాం. అంతా సమకూర్చుకున్న తర్వాత వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లాలనుకుంటున్నాం. 'హిరణ్య కశ్యప' చిత్రాన్ని 'బాహుబలి' కంటే గొప్పగా తెరకెక్కించాలని ప్రయత్నిస్తున్నాం'' అని పేర్కొన్నారు రానా.

# సిక్స్ ప్యాక్ తేజ్

ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్.. రీసెంట్‌గా రామ్ సిక్స్ ప్యాక్ బాడీతో విలన్ల బెండు తీశారు. ఇంకా ఆరు పలకల దేహంతో కనిపించిన హీరోలు చాలామందే ఉన్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి సాయితేజ్ పేరు కూడా చేరబోతోంది. మారుతి దర్శకత్వంలో సాయితేజ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ప్రతి రోజూ పండగే'. ఇందులో రాశీ ఖన్నా కథానాయికగా నటించారు. సత్యరాజ్, రావు రమేష్ కీలక పాత్రధారులు. ఈ సినిమాలోని రెండు యాక్షన్ సీక్వెన్స్‌లో సాయి తేజ్ సిక్స్‌ప్యాక్ బాడీతో కనిపిస్తారు. ఆ రెండు ఫైట్స్‌లో హోమం నేపథ్యంలో వచ్చే ఫైట్ సీన్ ఒకటి. ఈ రెండు ఫైట్లు హైలైట్‌గా నిలుస్తాయట. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది.


సాయి తేజ్

# తల్లిదండ్రుల ప్రేమను వెలకట్టలేం

- విజయేంద్ర ప్రసాద్


ఎం.ఎస్. చౌదరి, విజయేంద్ర ప్రసాద్

నటుడు ఎం.ఎస్ చౌదరి నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఆది గురువు అమ్మ'. 'సురభి' ప్రభావతి, వేమూరి శశి, గోపరాజు విజయ్ కీలక పాత్రధారులు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన రచయిత వి. విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– ''దైవసమానులుగా భావించే తల్లిదండ్రుల ప్రేమను వెలకట్టలేం. తల్లి ప్రేమ చాలా గొప్పది. ఆమె తొలి గురువుగా బిడ్డకు అన్నీ నేర్పిస్తుంది. అలాంటి అమ్మపై రూపొందిన 'ఆది గురువు అమ్మ' ట్రైలర్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉంది. ట్రైలర్ బాగుంది'' అన్నారు. ''ట్రైలర్‌ను విడుదల చేసిన విజయేంద్ర ప్రసాద్ గారికి థ్యాంక్స్. అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అన్నారు ఎం.ఎస్. చౌదరి.

# రామ్.. రామ్.. హిట్

- గురురాజ్

సీనియర్ నటుడు సత్య ప్రకాశ్ కుమారుడు నటరాజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. నూరిన్, అంకిత కథానాయికలు. ఎ. ముత్తమ్మ సమర్పణలో ఎ. గురురాజ్ నిర్మించిన ఈ చిత్రానికి సత్యప్రకాశ్ దర్శకుడు. ఈ చిత్రంలో 'రామ్ రామ్..' అనే పాటను పాడుతూ నటించటమే కాకుండా హీరోయిన్ నూరిన్‌కి డబ్బింగ్ చెప్పారు గాయని, నటి మంగ్లీ. ఆమెతో పాటు కమెడియన్ రఘుబాబు, ర్యాప్ సింగర్ రోల్ రైడా కూడా ఈ పాటకు గొంతు కలిపారు. మంగ్లీ మాట్లాడుతూ– ''దర్శకుడు సత్యప్రకాశ్‌ను చిన్నప్పుడు విలన్‌గా చూసిన గుర్తుతో మొదట్లో భయపడ్డాను. తర్వాత ఆయన తెరవెనక స్వభావం, తెలుగుపై ఆయనకున్న పట్టు చూసి ఆశ్చర్యపోయాను. రచయిత కాసర్ల శ్యామ్ రాసి, నేను పాడిన పాటలన్నీ హిట్ అవుతున్నాయి. ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది'' అన్నారు. గురురాజ్ మాట్లాడుతూ– ''మా చిత్రం జనవరి 1న విడుదలవుతుంది. ఈ మధ్య కాసర్ల శ్యామ్ రాసిన 'అల.. వైకుంఠపురములో..', 'ఇస్మార్ట్ శంకర్' పాటలు పెద్ద హిట్. అలాగే మా సినిమాలోని 'రామ్ రామ్..' పాట కూడా హిట్ అవుతుంది'' అన్నారు. ''నాకేం తెలుసో, తెలియదో అడక్కుండా ఈ సినిమాకి దర్శకత్వం చేసే చాన్స్ ఇచ్చిన మా నిర్మాత గురురాజ్ గారే ఈ సినిమాకు కర్త, కర్మ, క్రియ అన్నారు'' సత్యప్రకాశ్.


గురురాజ్, కాసర్ల శ్యామ్, మంగ్లీ, ముత్తమ్మ, సత్య ప్రకాశ్

# కామెడీ.. థ్రిల్


కాలభైరవ, శ్రీసింహా

ప్రముఖ సంగీతదర్శకుడు కీరవాణి తనయుడు శ్రీసింహా హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'మత్తు వదలరా'. రితేష్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మాతలు. కీరవాణి పెద్ద కుమారుడు కాలభైరవ సంగీతదర్శకుడు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో పాటు తొలి లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఇటీవల రామ్‌చరణ్ విడుదల చేసిన మా చిత్రం టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. వినోద ప్రధానంగా సాగే మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: పి.టి.గిరిధర్ రావు,

# రంగ మార్తాండలో...


శివాత్మికా రాజశేఖర్

ఈ ఏడాది విడుదలైన 'దొరసాని' చిత్రం ద్వారా తెలుగు తెరకు కథానాయికగా పరిచయమయ్యారు శివాత్మికా రాజశేఖర్... డాటరాఫ్ జీవితారాజశేఖర్. తొలి చిత్రంతోనే నటిగా ప్రేక్షకుల మెప్పు పొందారామె. తాజాగా ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ దర్శకత్వంలో నటించే చాన్స్ కొట్టేశారు శివాత్మిక. ప్రకాష్ రాజ్, రమ్యకృష్ణ ప్రధాన పాత్రధారులుగా కృష్ణవంశీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంగ మార్తాండ'. నానా పటేకర్ నటించిన మరాఠీ చిత్రం 'నట సామ్రాట్'కు ఇది తెలుగు రీమేక్. ఈ సినిమాలో గాయనిగా నటిస్తున్నారట శివాత్మిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సినిమా చిత్రీకరణలో శివాత్మిక పాల్గొంటున్నారని తెలిసింది. ఇందులో ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణల కూతురి పాత్రలో కనిపిస్తారట శివాత్మిక. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.













# మీరూ... కోహ్లిలా శ్రమించాలి

## విండీస్ ఆటగాళ్లతో సహాయ కోచ్ ఎస్ట్‌విక్



**చెన్నై:** భారత కెప్టెన్ విరాట్ కోహ్లిలా వెస్టిండీస్ ప్లేయర్లు కూడా చెమటోడ్చాలని ఆ జట్టు సహాయ కోచ్ రాడీ ఎస్ట్‌విక్ అన్నాడు. శుక్రవారం అతను మీడియాతో మాట్లాడుతూ 'హెట్‌మైర్, నికోలస్ పూరన్, హోప్‌లాంటి యువ క్రికెటర్లు ప్రత్యర్థి కెప్టెన్ కోహ్లిని చూసి నేర్చుకోవాలి. ఆట కోసం అతను ఎంతో శ్రమిస్తాడు. నిత్యం జిమ్‌లో కసరత్తు చేస్తాడు, నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తాడు. కఠోరంగా శ్రమించేతత్వానికి అతనే ఓ నిదర్శనం. కుర్రాళ్లంతా అతన్ని అనుసరించాల్సిందే. కష్టపడితేనే విజయమైనా... ఏదైనా... లేదంటే ఏదీ రాదు' అని ఎస్ట్‌విక్ అన్నాడు. టి20 సిరీస్‌లో రాణించినట్లే ఈ వన్డే సిరీస్‌లోనూ తమ జట్టు రాణిస్తుందని చెప్పాడు. తమ కుర్రాళ్లకు ఈ పర్యటన ఓ పాఠంలా పనికొస్తుందన్నాడు. విండీస్ పొట్టి ఫార్మాట్‌లో 1–2తో సిరీస్‌ను కోల్పోయింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఆదివారం ఇక్కడ తొలి వన్డే జరుగుతుంది.

## ఆసియా జూ. బ్యాడ్మింటన్: క్వార్టర్స్‌లో లోకేశ్ జంట

**సురబాయ (ఇండోనేసియా):** ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్–15 బాలుర డబుల్స్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ కలగొట్ల లోకేశ్ రెడ్డి–అమిత్ మండల్ (భారత్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో లోకేశ్–అమిత్ జోడీ 21–17, 22–20తో సెయుంగ్ వన్ బేక్–సుంగ్ జి పార్క్ (దక్షిణ కొరియా) జోడీపై గెలిచింది. అండర్–15 బాలికల సింగిల్స్ విభాగంలో భారత్‌కే చెందిన తస్నిమ్ మీర్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మూడో రౌండ్‌లో తస్నిమ్ 21–6, 21–16తో వెన్ సె చాన్ (మలేసియా)ను ఓడించింది. అండర్–17 బాలుర సింగిల్స్ మూడో రౌండ్‌లో టాప్ సీడ్ వరుణ్ కపూర్ (భారత్) 19–21, 21–23తో రెనాల్డి ఒక్టావియనుర్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయాడు.

# బ్రేవో వచ్చేస్తున్నాడు

## రిటైర్మెంట్‌పై మనసు మార్చుకున్న విండీస్ ఆల్‌రౌండర్



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రేవో మళ్లీ అంతర్జాతీయ టి20 క్రికెట్‌లోకి వచ్చేస్తున్నాడు. నిరుడు అక్టోబర్‌లో వెస్టిండీస్ క్రికెట్ బోర్డు (సీడబ్ల్యూఐ) మాజీ అధ్యక్షుడు డేవ్ కామెరూన్‌తో గొడవల కారణంగా... అన్ని ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన బ్రేవో తిరిగి తన దేశానికి ఆడాలని ఉందంటూ మనసులోని మాటను బయట పెట్టాడు. దీనికి కారణం వివాదాస్పద అధ్యక్షుడిగా ముద్ర వేయించుకున్న డేవ్ కామెరూన్ స్థానంలో మాజీ విండీస్ జట్టు మేనేజర్ రికీ స్కెరిట్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టడమే అని అతడు పేర్కొన్నాడు. అయితే తన పునరాగమనం టి20లకి మాత్రమే పరిమితమని బ్రేవో తెలిపాడు. ప్రస్తుతం ఉన్న జట్టులో ప్రతిభకు కొదవలేదని, కొత్త కోచ్ ఫిల్ సిమన్స్, పొలార్డ్ సారథ్యంలోని జట్టు అద్భుతంగా ఆడుతుందంటూ కితాబిచ్చాడు. బ్రేవో విండీస్ తరఫున చివరి టి20ని మూడేళ్ల క్రితం సెప్టెంబర్‌లో ఆడాడు. బ్రేవో విండీస్ తరఫున మొత్తం 40 టెస్టులు, 164 వన్డేలు, 66 టి20 మ్యాచ్‌లు ఆడాడు. మూడు ఫార్మాట్‌లలో కలిపి మొత్తం 6310 పరుగులు చేసిన అతను 337 వికెట్లు కూడా తీశాడు.

# న్యూజిలాండ్ ఎదురీత

### తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 416

**పెర్త్:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న డే నైట్ తొలి టెస్టు మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఎదురీదుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 32 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 109 పరుగులు చేసింది. ప్రస్తుతం రాస్ టేలర్ (66 బ్యాటింగ్, 8 ఫోర్లు) వాట్లింగ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఆసీస్ బౌలర్లు స్టార్క్ (4/31), హాజల్‌వుడ్ (1/0) ప్రత్యర్థిని కట్టడి చేశారు. అంతకుముందు ఆస్ట్రేలియా 146.2 ఓవర్లలో 416 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 248/4తో తమ తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆసీస్‌ను సెంచరీ హీరో లబ్‌షేన్ (143; 18 ఫోర్లు, సిక్స్), హెడ్ (56; 10 ఫోర్లు) ముందుకు నడిపించారు. వీరు ఐదో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ అవుట్ అయినా... పైన్ (39; 2 ఫోర్లు), స్టార్క్ (30; 3 ఫోర్లు, సిక్స్), కమిన్స్ (20; 2 ఫోర్లు) తలా ఒక చెయ్యి వేయడంతో ఆసీస్ భారీ స్కోరు చేసింది.



స్టార్క్

## పాక్, లంక మ్యాచ్‌ను వీడని వర్షం

**రావల్పిండి:** పాకిస్తాన్, శ్రీలంకల మధ్య జరుగుతోన్న తొలి టెస్టును వర్షం వదలడం లేదు. రెండో రోజు వాన కారణంగా 18.2 ఓవర్ల ఆట మాత్రమే జరగగా... మూడో రోజు 5.2 ఓవర్లకే పరిమితమైంది. మైదానం చిత్తడిగా ఉండటంతో ఆట దాదాపు 3 గంటలు ఆలస్యంగా ఆరంభమైంది. ఓవర్‌నైట్ స్కోర్ 263/6తో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక... వెలుతురులేమితో ఆట ముగించే సమయానికి 282/6తో నిలిచింది. ధనంజయ డి సిల్వా (151 బంతుల్లో 87 బ్యాటింగ్; 13 ఫోర్లు) పెరీరా (18 బంతుల్లో 6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. శనివారం కూడా వర్ష సూచన ఉండటం... ఇంకా పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్ కూడా ప్రారంభం కాకపోవడంతో ఈ మ్యాచ్ 'డ్రా'గా ముగియడం ఖాయమైంది.

## కేరళ, జంషెడ్‌పూర్ మ్యాచ్ 'డ్రా'

**కొచ్చి:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ ఆరో సీజన్‌లో భాగంగా కేరళ బ్లాస్టర్స్, జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ మధ్య జరిగిన మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2–2 గోల్స్‌తో సమంగా నిలిచాయి. జంషెడ్‌పూర్ ఆటగాళ్లలో పిటీ (38వ నిమిషంలో), వినీత్ (72వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. కేరళ తరఫున మెస్సీ బౌలి (75వ, 87వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేసి జట్టును గట్టెక్కించాడు. ఈ మ్యాచ్‌లో నమోదైన నాలుగు గోల్స్‌లో రెండు గోల్స్ పెనాల్టీ రూపంలో రావడం విశేషం.

# మనదే పైచేయి

ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌నే శాసించిన వెస్టిండీస్... 80వ దశకంలో భారత్‌పై కూడా గర్జించింది. కానీ ఆ తర్వాత సీన్ మారింది. భారత్ గేర్ మార్చుకుంది. వన్డేల్లో సొంత గడ్డపై కరీబియన్‌ను మట్టికరిపిస్తూనే ఉంది. గడిచిన పుష్కర కాలంగా 4 వన్డేల సిరీస్ జరిగినా... 5 వన్డేల్లో తలపడినా... 3 వన్డేలు... ఇలా సిరీస్ ఏదైనా విజేత మాత్రం భారతే. అంతగా రాటుదేలింది టీమిండియా.



**55** వెస్టిండీస్‌తో స్వదేశంలో భారత జట్టు ఇప్పటి వరకు 55 వన్డేలు ఆడింది. టీమిండియా 27 మ్యాచ్‌ల్లో... విండీస్ కూడా 27 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. మరో మ్యాచ్ 'టై'గా ముగిసింది.

**130** ఓవరాల్‌గా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన వన్డేల సంఖ్య. భారత్ 62 మ్యాచ్‌ల్లో... విండీస్ కూడా 62 మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. రెండు మ్యాచ్‌లు 'టై'గా ముగియగా... నాలుగు మ్యాచ్‌లు రద్దయ్యాయి.

సాక్షి క్రీడా విభాగం

వెస్టిండీస్ ఇటు వన్డేల్లో, అటు టి20ల్లో రెండేసి సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. ఒకప్పుడు నిప్పులు చెరిగే బౌలింగ్‌తో, ఎదురుదాడి బ్యాటింగ్‌తో ప్రపంచ ప్రత్యర్థుల్నే వణికించిన ఈ జట్టు క్రమంగా ప్రాభవం కోల్పోయింది. తమ దీవుల్లో జరిగే కరీబియన్ లీగ్ పుణ్యమాని ఇప్పుడు టి20ల్లో సత్తా చాటుతున్నప్పటికీ... వన్డేల్లో మాత్రం నిలకడలేని ఆటతీరుతో చతికిలబడుతోంది. అలనాడు భారత్‌లోనూ విండీస్‌ది అద్భుతమైన రికార్డు. 1983 సీజన్‌లో ఇక్కడ ఐదు వన్డేల సిరీస్‌ను 5–0తో, 1987 సీజన్‌లో ఏడు వన్డేల సిరీస్‌ను 6–1తో గెలిచిన అసాధారణ జట్టు వెస్టిండీస్. కానీ ఆ తర్వాత... మళ్లీ ఆడేందుకు ఇక్కడికి వస్తే మాత్రం కరీబియన్ సిరీస్‌లు కాదు కదా... మ్యాచ్‌లు గెలిచేందుకే ఆపసోపాలు పడుతోంది.

- 2002 తర్వాత భారత్‌లో వన్డే సిరీస్ నెగ్గని విండీస్
- పుష్కరకాలంగా ఎదురులేని టీమిండియా
- ఈసారీ సూపర్ ఫామ్‌లో కోహ్లి సేన
- సీజన్‌లో చివరి వన్డే సిరీస్‌కు సిద్ధం

### 90 దశకంలో భారత్ ఆధిపత్యం...

ప్రపంచ వ్యాప్తంగా వెస్టిండీస్ 80వ దశకంలో ఎక్కడ ఆడినా గెలిచేది. కానీ 90 నుంచి తిరోగమనం మొదలైంది. భారత్ పైచేయి సాధించడం కూడా ప్రారంభమైంది. కరీబియన్‌తో ముఖాముఖి సిరీస్‌లతో పాటు, విండీస్ ఆడేందుకు వచ్చిన హీరో కప్ (1993), విల్స్ వరల్డ్ సిరీస్ (1994)లలో భారతే విజేతగా నిలిచింది. సొంతగడ్డపై భారత్ గర్జిస్తుంటే బ్యాటింగ్ దిగ్గజం లారా, బౌలింగ్ లెజెండ్స్ వాల్ష్, అంబ్రోస్‌లు ఉన్న విండీస్ జట్టు ఏమీ చేయలేకపోయింది. రిక్తహస్తాలతోనే తిరుగుముఖం పట్టేది. దీంతో ప్రపంచ క్రికెట్లో వెస్టిండీస్ స్వర్ణయుగం కరిగిపోయింది. తర్వాత ఓ మామూలు జట్టుగా మిగిలిపోయింది. ఆటగాళ్ల వైఫల్యం, బోర్డు రాజకీయాలు, కాంట్రాక్టు వివాదాలు, సంక్షోభం ఇలా అన్నింటితో సతమతమై ఇప్పుడు కొన్ని మెగా టోర్నీల్లో క్వాలిఫయింగ్ ఆడే పరిస్థితికి దిగజారింది.

### 12 ఏళ్లుగా టీమిండియాదే విక్టరీ...

గుడ్డిలో మెల్లగా వెస్టిండీస్‌ను దశాబ్దాల తర్వాత 2002 సీజన్ ఆదుకుంది. ఆ ఏడాది భారత్‌కు వచ్చిన విండీస్ మొదట టెస్టు సిరీస్ ఓడిపోయినా... సుదీర్ఘంగా సాగిన ఏడు వన్డేల సిరీస్‌లో టీమిండియాను భారత గడ్డపై 4–3తో కంగుతినిపించింది. క్రిస్ గేల్ రెండు శతకాలతో చెలరేగాడు. ఇక ఆ తర్వాత భారత్‌లో ముఖాముఖి వన్డే సిరీస్‌కు రావడం, ఓడిపోవడం రివాజుగా జరిగేవి. 2007 నుంచి ఇప్పటివరకు ఐదు సార్లు భారతగడ్డపై అడుగుపెట్టిన కరీబియన్ జట్టు పరాజయంతోనే తిరుగు పయనమైంది. 2007తో పాటు 2011, 2013, 2014, 2018దాకా ఇరు జట్ల మధ్య 20 వన్డేలు జరిగాయి. ఇందులో 14 మ్యాచ్‌ల్లో భారత్ జయకేతనం ఎగురవేసింది. ఈ ఐదు సిరీస్‌లలోనూ ప్రత్యర్థి జట్టు ఒక మ్యాచ్‌కు మించి గెలవలేకపోవడం భారత ఆధిపత్యానికి నిదర్శనం. ఒకటేమో 'టై' అయింది.



విండీస్ కోచ్ సిమన్స్, కెప్టెన్ పొలార్డ్

### ఈసారి వన్డే సిరీస్‌లోనూ కోహ్లి సేనే ఫేవరెట్

కొన్నాళ్లుగా భారత్ అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఇటీవలే ముగిసిన టి20 సిరీస్‌లోనూ భారత్ ఆల్‌రౌండ్ ప్రతాపం తెలిసిందే. బ్యాటింగ్‌లో టాపార్డర్ దుర్భేద్యంగా తయారైంది. రోహిత్ శర్మ, లోకేశ్ రాహుల్, విరాట్ కోహ్లి ఈ ముగ్గురు నిలబడితే ఎంతటి బౌలింగ్ అయినా చెల్లాచెదురు కావాల్సిందే. గత ఆఖరి టి20లో విండీస్ బౌలర్లకు ఇది బాగా గుర్తయింది. ఇక బౌలింగ్‌లోనూ షమీ, దీపక్ చాహర్ పేస్‌కు కుల్దీప్, చహల్, జడేజాల స్పిన్ అండ ఉండనే ఉంది. ఎటొచ్చి జట్టు మేనేజ్‌మెంట్ బెంగంతా మిడిలార్డర్, ఫీల్డింగ్‌లపైనే ఉంది. పొట్టి క్రికెట్‌లో భారత ఫీల్డర్లు పదేపదే క్యాచ్‌ల్ని నేలపాలు చేశారు. అదే విధంగా నిలకడలేని మిడిలార్డర్ వైఫల్యంతోనే రెండో టి20ని కోల్పోయింది. ఈ రెండు విభాగాలపై జట్టు సహాయ సిబ్బంది కన్నేస్తే భారత జోరుకు తిరుగుండదు.

### మీకు తెలుసా...

ఈ ఏడాది భారత్ బాగానే ఆడినట్లు కనిపించింది. వరుసబెట్టి సిరీస్‌ల్లో పాల్గొంటుంది... గెలుస్తుంది. కానీ స్వదేశంలో మాత్రం ఒకే ఒక్క వన్డే సిరీస్ ఆడింది. అది మార్చిలో ఆస్ట్రేలియాతో ఐదు వన్డేల సిరీస్ ఆడిన టీమిండియా అందులో 2–3తో ఓడింది. ఆ తర్వాత ఐపీఎల్, ఇంగ్లండ్‌లో వన్డే ప్రపంచకప్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో సిరీస్‌లు ఆడింది. ఇక ఈ ఏడాది భారత్ ఆడే ఆఖరి వన్డే సిరీస్ ఇదే. దీన్ని విజయంతో ముగించాలని కోహ్లిసేన గట్టి పట్టుదలతో ఉంది.

## గాయంతో భువనేశ్వర్ ఔట్



**చెన్నై:** భారత పేసర్ భువనేశ్వర్ కుమార్ మళ్లీ గాయపడ్డాడు. దీంతో వెస్టిండీస్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ సీనియర్ సీమర్ గజ్జల్లో గాయంతో బాధపడుతున్నట్లు తెలిసింది. దీంతో అతని స్థానంలో యువ పేసర్ శార్దుల్ ఠాకూర్‌ను తీసుకునే అవకాశముంది. ఈ ఏడాది భువీని గాయాలు చికాకు పెడుతున్నాయి. ఇంగ్లండ్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్ సమయంలో అతను తొడ కండరాల నొప్పితో ఇబ్బంది పడ్డాడు. పాక్‌తో మ్యాచ్ మధ్యలోనే మైదానం వీడాల్సి వచ్చింది. మళ్లీ సెమీఫైనల్లో ఆడినప్పటికీ... తదనంతరం స్వదేశంలో దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో జరిగిన సిరీస్‌లకు అతను దూరమయ్యాడు. ఎట్టకేలకు విండీస్‌తో జరిగిన మూడు టి20ల సిరీస్‌తో పునరాగమనం చేసిన అతను మళ్లీ వన్డేలకు దూరం కావడం జట్టు వర్గాలను ఆందోళన పరుస్తోంది. భువీ గాయంపై ఇంకా బోర్డు గానీ, జట్టు బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్‌గానీ అధికారికంగా వెల్లడించలేదు.

# విజయంతో ముగింపు

గెలుపుతో ప్రారంభించిన ఈ ఏడాదిని భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సీజన్‌ను కూడా విజయంతోనే ముగించింది. అయితే ఈ సంవత్సరం ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ టూర్ సూపర్ టోర్నమెంట్‌లలో ఆమె ఒక్క దాంట్లోనూ టైటిల్ సాధించలేకపోవడం కాస్త లోటుగా అనిపిస్తోంది. కానీ ఆగస్టులో స్విట్జర్లాండ్ ఆతిథ్యమిచ్చిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సింధు విశ్వవిజేతగా నిలిచి ఈ ఘనత సాధించిన తొలి భారతీయ ప్లేయర్‌గా కొత్త చరిత్ర సృష్టించింది. విశ్వ వేదికపై సింధు సాధించిన ఈ గొప్ప విజయంతో మిగతా టోర్నీలలో ఆమె ప్రదర్శనలో నిలకడ లోపించినా అంతగా ఆందోళన కలిగించలేదు.

- వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ చివరి లీగ్ మ్యాచ్‌లో సింధు గెలుపు
- గ్రూప్ 'ఎ'లో మూడో స్థానం



**గ్వాంగ్‌జౌ (చైనా):** సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు అర్హత పొందిన గత మూడు పర్యాయాల్లో కనీసం సెమీఫైనల్ చేరిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఈ ఏడాది మాత్రం లీగ్ దశలోనే నిష్క్రమించింది. మహిళల సింగిల్స్ గ్రూప్ 'ఎ'లో వరుసగా తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడి గురువారమే సెమీఫైనల్ రేసు నుంచి తప్పుకున్న ఈ ఆంధ్రప్రదేశ్ అమ్మాయి శుక్రవారం చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచి ఊరట చెందింది. ప్రపంచ ఏడో ర్యాంకర్ హి బింగ్‌జియావో (చైనా)తో జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్, డిఫెండింగ్ చాంపియన్ సింధు 21–19, 21–19తో గెలిచింది. 42 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌లో ఒకదశలో 9–18తో వెనుకబడటం గమనార్హం. ఈ దశలో సింధు ఒక్కసారిగా విజృంభించి వరుసగా తొమ్మిది పాయింట్లు గెలిచి స్కోరును 18–18తో సమం చేసింది. ఆ తర్వాత హి బింగ్‌జియావో ఒక పాయింట్ నెగ్గగా... ఆ వెంటనే సింధు వరుసగా మూడు పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్ ఆరంభంలోనే సింధు 5–2తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఈ క్రమంలో 2019 సీజన్‌ను విజయంతో ముగించింది. రెండేళ్ల తర్వాత హి బింగ్‌జియావోపై సింధు గెలుపొందడం విశేషం. చివరిసారి 2017 వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ లీగ్ మ్యాచ్‌లోనే ఆమెపై నెగ్గిన సింధు గత రెండేళ్ల వ్యవధిలో ఈ చైనా ప్లేయర్ చేతిలో నాలుగుసార్లు ఓడిపోయింది. ఓవరాల్‌గా హి బింగ్‌జియావోతో ముఖాముఖి రికార్డులో సింధు 6–9తో వెనుకంజలోనే ఉండటం గమనార్హం. 2016లో తొలిసారి వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీకి అర్హత పొందిన సింధు ఆ ఏడాది సెమీస్‌లో నిష్క్రమించింది. 2017లో రన్నరప్‌గా నిలిచి, 2018లో విజేతగా అవతరించింది. ఈసారి తన గ్రూప్‌లో మూడో స్థానంలో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించిన సింధుకు 16,500 డాలర్ల (రూ. 11 లక్షల 68 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

### ఈ ఏడాది సింధు ప్రదర్శన

| టోర్నీ | రౌండ్ |
| --- | --- |
| ఇండోనేసియా మాస్టర్స్ | క్వార్టర్ ఫైనల్ |
| ఆల్ ఇంగ్లండ్ | తొలి రౌండ్ |
| ఇండియా ఓపెన్ | సెమీఫైనల్ |
| మలేసియా ఓపెన్ | రెండో రౌండ్ |
| సింగపూర్ ఓపెన్ | సెమీఫైనల్ |
| ఆసియా చాంపియన్‌షిప్ | క్వార్టర్ ఫైనల్ |
| ఆస్ట్రేలియా ఓపెన్ | రెండో రౌండ్ |
| ఇండోనేసియా ఓపెన్ | ఫైనల్ |
| జపాన్ ఓపెన్ | క్వార్టర్ ఫైనల్ |
| ప్రపంచ చాంపియన్‌షిప్ | విజేత |
| చైనా ఓపెన్ | రెండో రౌండ్ |
| కొరియా ఓపెన్ | తొలి రౌండ్ |
| డెన్మార్క్ ఓపెన్ | రెండో రౌండ్ |
| ఫ్రెంచ్ ఓపెన్ | క్వార్టర్ ఫైనల్ |
| చైనా మాస్టర్స్ | తొలి రౌండ్ |
| హాంకాంగ్ ఓపెన్ | రెండో రౌండ్ |
| వరల్డ్ టూర్ ఫైనల్స్ | లీగ్ దశ |

**17** ఈ ఏడాది సింధు ఆడిన టోర్నీలు. సుదిర్మన్ కప్‌లోనూ సింధు ఆడినా అది టీమ్ ఈవెంట్ కాబట్టి టోర్నీల జాబితాలో తీసుకోలేదు. సుదిర్మన్ కప్‌లో సింధు ఒక మ్యాచ్ ఆడి గెలిచింది

**14** ఈ ఏడాది సింధును ఓడించిన వేర్వేరు దేశాల క్రీడాకారిణులు. అకానె యామగుచి, నొజోమి ఒకుహారా (జపాన్), సుంగ్ జీ హున్, యాన్ సె యంగ్ (దక్షిణ కొరియా), చెన్ యుఫె, హి బింగ్‌జియావో, కాయ్ యాన్ యాన్ (చైనా), తై జు యింగ్, పాయ్ యు పో (చైనీస్ తైపీ), బుసానన్, పోర్న్‌పవీ, నిచావోన్ జిందాపోల్ (థాయ్‌లాండ్), కరోలినా మారిన్ (స్పెయిన్), బీవెన్ జాంగ్ (అమెరికా). యామగుచి మూడుసార్లు, సుంగ్ జీ హున్ రెండుసార్లు సింధుపై నెగ్గగా... మిగతా వాళ్లు ఒక్కోసారి ఓడించారు.

**48** ఈ సంవత్సరం సింధు ఆడిన మ్యాచ్‌ల సంఖ్య. ఇందులో సింధు 31 మ్యాచ్‌ల్లో గెలిచింది. 17 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

**3839** ఈ ఏడాది సింధు ఆడిన మొత్తం పాయింట్ల సంఖ్య. ఇందులో సింధు ప్రత్యర్థులపై 2053 పాయింట్లు సాధించింది. 1786 పాయింట్లను ప్రత్యర్థులకు కోల్పోయింది.

**108** ఈ ఏడాది సింధు ఆడిన మొత్తం గేమ్‌ల సంఖ్య. ఇందులో ఆమె 68 గేముల్లో గెలిచింది. 40 గేమ్‌లను చేజార్చుకుంది.

## విశ్వనాథన్ ఆనంద్ 'మైండ్‌మాస్టర్' విడుదల

**చెన్నై:** భారత సూపర్ గ్రాండ్‌మాస్టర్, ఐదు సార్లు ప్రపంచ చాంపియన్ అయిన విశ్వనాథన్ ఆనంద్ రాసిన 'మైండ్ మాస్టర్' పుస్తకం శుక్రవారం విడుదలైంది. ఇక్కడ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో 'ది హిందు' పబ్లిషింగ్ గ్రూప్ చైర్మన్ ఎన్.రామ్ లాంఛనంగా ఆ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ 'మీరు చెస్ రొమాంటిక్ అయితే ఈ ఆట అందాన్ని ఆస్వాదిస్తారు. ఈ కంప్యూటర్ల యుగంలోనూ చెస్ ఆట అనుభూతే వేరు. కంప్యూటర్లు కూడా అంతే అనంతమైన సాధ్యాల్ని సాకారం చేస్తాయి' అని అన్నాడు. తన పుస్తకంలో చెస్ గడులతో పాటు కంప్యూటర్‌కూ చోటిచ్చానని దీంతో ఎలాంటి మార్పులు సంభవించాయో పేర్కొన్నట్లు చెప్పాడు.



సాక్షి బిజినెస్
శనివారం
14-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 428 ▲ | 115 ▲ |
| 41,010 | 12,087 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,736 | ▲ 20 |
| డోజోన్స్ | 28,134 | ▲ 2 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,353 | ▲ 80 |
| డాక్స్ | 13,283 | ▲ 61 |
| షాంఘై | 2,968 | ▲ 52 |
| నికాయ్ | 24,023 | ▲ 598 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 69.85 | 71.49 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 93.49 | 96.80 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.50 | 80.43 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.30 | 65.68 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.92 | 50.08 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.38 | 53.17 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.10 | 19.70 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.82 | 19.82 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.52 | 10.93 |




# నిర్మలా శక్తిరామన్!

## ప్రపంచ టాప్-100 శక్తివంతమైన మహిళల్లో చోటు..

### ఫోర్బ్స్ జాబితాలో 34వ ర్యాంక్... భారత్ నుంచి మరో ఇద్దరికి కూడా



**న్యూయార్క్:** ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన ఈ ఏడాది అగ్రశ్రేణి వంద అత్యంత శక్తివంతమైన మహిళల్లో భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చోటు దక్కించుకున్నారు. అంతర్జాతీయంగా శక్తివంతమైన 100 మంది మహిళల 2019 జాబితాను ఫోర్బ్స్ తాజాగా విడుదల చేయగా.. ఇందులో మన దేశ ఆర్థిక మంత్రి 34వ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. గతంలో భారత రక్షణరంగానికి సారథ్యం వహించిన ఆమె.. ప్రస్తుతం మొత్తం భారత ఆర్థిక వ్యవస్థకు పూర్తిస్థాయి బాధ్యతలు వహిస్తూ దేశ తొలి మహిళా ఆర్థిక మంత్రిగా నిర్ణయాత్మక పాత్ర నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ పన్నుల తగ్గింపు వంటి వ్యూహాత్మక నిర్ణయాలతో సత్తా చాటుతోన్న నిర్మలా సీతారామన్ ప్రతిభకు నిదర్శనంగా.. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో చోటు దక్కింది. ఇక మన దేశం నుంచి మరో ఇద్దరు మహిళలకు ఈ జాబితాలో స్థానం లభించింది. హెచ్‌సీఎల్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ రోష్నీ నాడార్ మల్హోత్రా 54వ స్థానంలో నిలిచారు. బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా 65వ స్థానాన్ని దక్కించుకున్నారు. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బయోకాన్ చైర్మన్, ఎండీ కిరణ్ మజుందార్ షా బెంగళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్‌పర్సన్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె నికర సంపద రూ.310 కోట్ల అమెరికా డాలర్లు (2019). దేశంలోనే అతిపెద్ద బయోఫార్మాసూటికల్ కంపెనీ ఏర్పాటుచేసి, సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఇక రోష్నీ నాడార్ విషయానికొస్తే, ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురుణ్ ఇండియా రిచ్ లిస్ట్ (2019) ప్రకారం, భారత్‌లోనే అత్యంత మహిళా సంపన్నురాలు.

**ఫోర్బ్స్ 'పవర్‌ఫుల్' మహిళలు...**

| ర్యాంక్ | పేరు | దేశం |
|---|---|---|
| 1 | ఏంజెలా మెర్కెల్ | జర్మనీ |
| 2 | క్రిస్టీనా లగార్డ్ | ఫ్రాన్స్ |
| 3 | నాన్సీ పెలోసీ | అమెరికా |
| 4 | ఉర్సులా వాన్ డెర్ లేయన్ | బెల్జియం |
| 5 | మేరీ బరా | అమెరికా |
| 34 | నిర్మలా సీతారామన్ | భారత్ |
| 54 | రోష్నీ నాడార్ మల్హోత్రా | భారత్ |
| 65 | కిరణ్ మజుందార్ షా | భారత్ |

### అగ్రస్థానంలో ఏంజెలా మెర్కెల్

ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలోనూ జర్మనీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ టాప్‌లో నిలిచారు. గత తొమ్మిదేళ్ళుగా అత్యంత శక్తివంతమైన మహిళగా తన స్థానాన్ని సుస్థిరపరుచుకుంటూనే ఉన్నారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ప్రెసిడెంట్ క్రిస్టీనా లగార్డ్ రెండో ర్యాంకును సొంతం చేసుకున్నారు. ఇక అమెరికా ప్రతినిధుల సభకు స్పీకర్ నాన్సీ పెలోసీ మూడో స్థానంలో నిలిచారు. జాబితాలో యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్(4 వ ర్యాంకు), జనరల్ మోటార్స్ సీఈఓ మేరీ బరా(5) బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా(29), అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్(42) ఉన్నారు. కొత్తగా ఈ జాబితాలో చోటు దక్కించుకున్న 23 మందిలో పర్యావరణ పరిరక్షణకోసం గళమెత్తిన స్వీడన్‌కు చెందిన 16 ఏళ్ల గ్రేటా థంబర్గ్ కూడా ఉన్నారు. ఆమె 100వ స్థానంలో నిలిచారు.

## కొత్త ఫిర్యాదుల గురించి తెలీదు

**'క్లాస్ యాక్షన్ దావా' వార్తలపై ఇన్ఫోసిస్ వివరణ**



**న్యూఢిల్లీ:** అమెరికాలో కొత్తగా మరో క్లాస్ యాక్షన్ దావా దాఖలైనట్లు వచ్చిన వార్తలపై ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ స్పందించింది. అక్టోబర్‌లో వచ్చిన ఆరోపణలు తప్ప కొత్త ఫిర్యాదుల గురించి తమకేమీ తెలియదని శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వివరణనిచ్చింది. గతంలో వచ్చిన ఆరోపణల గురించి అప్పుడే ఎక్స్ఛేంజీలకు తెలియజేశామని కూడా పేర్కొంది. అనైతిక విధానాలతో ఇన్వెస్టర్లను నష్టాల పాలు చేసిందనే ఆరోపణతో ఇన్ఫీపై క్లాస్ యాక్షన్ దావా వేసినట్లు అమెరికన్ న్యాయసేవల సంస్థ షాల్ లా ఫర్మ్ ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇన్ఫోసిస్ ఇచ్చిన వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. కంపెనీలపై ఫిర్యాదు చేయగోరేవారు, క్లాస్ యాక్షన్ దావాలో భాగం కావాలనుకునేవారు తమను సంప్రదించాలని న్యాయసేవల సంస్థలు ఇలాంటి ప్రకటనలివ్వడం సర్వసాధారణమేనని ఇన్ఫీ తెలిపింది. షాల్ లా ఫర్మ్ కూడా ఇందుకోసమే ప్రకటన చేసినట్లుగా కనిపిస్తోందని పేర్కొంది. ఇన్ఫీ సీఈవో సలీల్ పరేఖ్, సీఎఫ్‌వో నీలాంజన్ రాయ్ అనైతిక విధానాలకు పాల్పడుతున్నారని అక్టోబర్‌లో ప్రజా వేగుల నుంచి ఫిర్యాదులొచ్చాయి. దీంతో కంపెనీ షేరు ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ అంశాలపై స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీతో పాటు అటు అమెరికన్ మార్కెట్ల నియంత్రణ సంస్థ ఎస్ఈసీ కూడా విచారణ జరుపుతోంది. రోజెన్ లా ఫర్మ్ అనే న్యాయసేవల సంస్థ అమెరికన్ ఇన్వెస్టర్ల తరఫున ఇన్ఫీపై క్లాస్ యాక్షన్ దావా వేస్తామని అప్పట్లో ప్రకటించింది. మరోవైపు, అకౌంటింగ్ లోపాలపై నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్ఎఫ్ఆర్ఏ) దృష్టి సారించింది.

## బ్యాంకులకు 'ఎన్‌బీఎఫ్‌సీ'ల భారం

- మొండిబకాయిల తీవ్రత పెరిగే అవకాశం
- రేటింగ్ దిగ్గజం మూడీస్ నివేదిక

**ముంబై:** నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు ఎదుర్కొంటున్న లిక్విడిటీ (ద్రవ్య లభ్యత) సంక్షోభం బ్యాంకింగ్ మొండి బకాయిల (ఎన్‌పీఏ) భారాన్ని మరింత పెంచే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం– మూడీస్ అంచనావేసింది. లిక్విడిటీ సమస్య వల్ల ఎన్‌బీఎఫ్‌సీలు కస్టమర్లకు రుణాలు ఇవ్వలేని పరిస్థితి ఉంటుందని... దీనితో బ్యాంకింగ్ రుణ పునఃచెల్లింపుల విషయంలో ఫండింగ్ లభించక సంబంధిత కస్టమర్లు ఇబ్బందులు పడే అవకాశం ఉందని మూడీస్ పేర్కొంది. ఇక ఎన్‌బీఎఫ్‌సీల వ్యాపారం కూడా దెబ్బతిని తమకు రుణాలు అందించే బ్యాంకింగ్‌కు బకాయిల చెల్లింపుల్లో ఇబ్బందులు పడే అవకాశం ఉందని విశ్లేషించింది. వెరసి మొత్తంగా ఎన్‌పీఏలు, లాభదాయకత, మూలధనం వంటి విషయాల్లో బ్యాంకింగ్‌పై ఈ ప్రతికూల ప్రభావం పడే వీలుందని అభిప్రాయపడింది. ఇవన్నీ బ్యాంకింగ్‌కు 'క్రెడిట్ నెగటివ్' అని కూడా మూడీస్ తన తాజా నివేదికలో తెలిపింది. 2018 సెప్టెంబర్‌లో ఐఎల్అండ్ఎఫ్ఎస్ దివాలా నేపథ్యంలో అప్పటి నుంచీ ఎన్‌బీఎఫ్‌సీలు తీవ్ర లిక్విడిటీ సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దీనితో రుణాలకు సంబంధించి వీటిపై ఆధారపడే కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల లిక్విడిటీ సమస్యల వల్ల రియల్టీ, లఘు చిన్న మధ్య తరహా పరిశ్రమలు అన్నీ తీవ్ర సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందనీ, ఆయా అంశాలు ఆర్థిక వ్యవస్థలో మందగమనాన్ని మరింత తీవ్రతరం చేయవచ్చని నివేదిక విశ్లేషించింది.

**2019లో వృద్ధి 5.6 శాతమే...**

కాగా 2019లో భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 5.6 శాతమే ఉంటుందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ పేర్కొంది. వినియోగం నెమ్మదించడం, ఉపాధి కల్పనలో మందగమనం వంటి అంశాలు తమ అంచనాలకు కారణమని మూడీస్ పేర్కొంది. అయితే 2020, 2021లో వృద్ధి పుంజుకునే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఆయా సంవత్సరాల్లో వృద్ధి వరుసగా 6.6%, 6.7%గా ఉండొచ్చని విశ్లేషించింది. 2018లో భారత్ వృద్ధిరేటు 7.4%గా పేర్కొన్న మూడీస్, ఈ స్థాయికి తిరిగి వృద్ధి రేటు చేరుకునేందుకు మరింతకాలం పడుతుందని అభిప్రాయపడింది. ''ఆర్థిక వృద్ధికి కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. కార్పొరేట్ పన్ను రేటు కోతలు, బ్యాంకులకు మూలధన కల్పన, మౌలిక రంగంలో వ్యయ ప్రణాళికలు, ఆటో రంగానికి మద్దతు వంటివి ఇక్కడ ఎన్నో ఉన్నాయి. అయితే ఆయా అంశాలు ఏవీ వినియోగ డిమాండ్ బలహీనతలను ప్రత్యక్షంగా నిలువరించలేవు'' అని మూడీస్ పేర్కొంది.



### 5 శాతానికి డీఎస్‌బీ కోత

ఇదిలావుండగా, సింగపూర్ డీబీఎస్ బ్యాంకింగ్ గ్రూప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 5.5 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. అయితే 2020లో ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా పుంజుకుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. భారత్ ఆర్థిక వృద్ధి రెండవ త్రైమాసికంలో ఆరేళ్ల కనిష్టం 4.5%కి పడిపోయింది. మొదటి త్రైమాసికంలో 5%. గత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు 6.8 శాతంగా నమోదయ్యింది.

## వోల్వో 'ఎక్స్‌సీ40 టీ4' ఎస్‌యూవీ



**ధర 39.9 లక్షలు**

**న్యూఢిల్లీ:** స్వీడన్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ 'వోల్వో' తాజాగా తన కొత్త ఎంట్రీ లెవెల్ ఎస్‌యూవీ 'ఎక్స్‌సీ40 టీ4 ఆర్–డిజైన్'ని భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. భారత్ స్టేజ్ (బీఎస్)–6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఈ కారు ధర రూ. 39.9 లక్షలు. కంపెనీకి చెందిన కాంపాక్ట్ మాడ్యులర్ ఆర్కిటెక్చర్ (సీఎంఏ) ఆధారంగా రూపొందిన ఈ ఎస్‌యూవీలో 2–లీటర్ ఇంజిన్ అమర్చింది. ఈ సందర్భంగా కంపెనీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ చార్లెస్ ఫ్రంప్ మాట్లాడుతూ.. 'ఎంట్రీ లెవెల్ ఎస్‌యూవీలో విడుదలైన తొలి పెట్రోల్ ఇంజిన్ కారు ఇది' అని చెప్పారు. 8–స్పీడ్ గేర్‌బాక్స్, ఫ్రంట్ వీల్ డ్రైవ్ పవర్‌ట్రైన్, ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లేతో పనిచేసే 9–అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉన్నట్లు కంపెనీ వివరించింది.

## పోర్షే కయన్ కూపే @ 1.32 కోట్లు



**ముంబై:** జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ పోర్షే.. 'కయన్ కూపే' మోడల్‌ను శుక్రవారం భారత మార్కెట్లోకి విడుదలచేసింది. కేవలం 6 సెకన్ల వ్యవధిలోనే సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలిగిన ఈ మోడల్‌లో రెండు వేరియంట్లు ఉన్నాయి. వీటిలో కయన్ కూపే ధర రూ. 1.32 కోట్లు కాగా, కయన్ టర్బో కూపే ధర రూ. 1.98 కోట్లు. ఈ నూతన మోడల్‌లో మూడు లీటర్ల వీ6 టర్బో ఇంజిన్ అమర్చగా, అవుట్‌పుట్ 340 హెచ్‌పీగా ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది. సన్‌రూఫ్, ఎలక్ట్రికల్‌గా సర్దుబాటు చేయగలిగిన సీట్లు, 7–అంగుళాల డిస్‌ప్లే, 12.3–అంగుళాల హెచ్‌డీ టచ్‌స్క్రీన్, 22 ఇంచ్ జీటీ డిజైన్ వీల్స్ నూతన మోడల్లో స్పెసిఫికేషన్లుగా వివరించింది.

# ఎగుమతులు 'రివర్స్'లోనే..

- నవంబర్‌లో మైనస్ 0.34 శాతం క్షీణత
- వరుసగా నాలుగో నెలలోనూ తిరోగమనం
- విలువ రూపంలో 25.98 బిలియన్ డాలర్లు
- దిగుమతులూ క్షీణతలోనే...
- విలువ 38.11 బిలియన్ డాలర్లు
- వెరసి వాణిజ్యలోటు 12 బిలియన్ డాలర్లు



**న్యూఢిల్లీ:** భారత్ ఎగుమతులు వరుసగా నాల్గవ నెలా నిరాశనే మిగిల్చాయి. అసలు వృద్ధిలేకపోగా –0.34 శాతం క్షీణతను నమోదుచేసుకున్నాయి. విలువ రూపంలో ఎగుమతుల విలువ 25.98 బిలియన్ డాలర్లు. ఇక దిగుమతులూ క్షీణ బాటలో ఉన్నాయి. –12.71 శాతం క్షీణతను నమోదుచేసుకున్నాయి దిగుమతుల విలువ 38.11 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. వెరసి ఎగుమతులు–దిగుమతుల మధ్య వాణిజ్యలోటు 12.12 బిలియన్ డాలర్లుగా ఉంది. 2018 నవంబర్‌లో వాణిజ్యలోటు 17.58 బిలియన్ డాలర్లు. కేంద్రం శుక్రవారం విడుదల చేసిన గణాంకాల్లో ముఖ్యాంశాలు చూస్తే...

- పెట్రోలియం (–13.12 శాతం), రత్నాలు– ఆభరణాలు(–8.14 శాతం), పండ్లు–కూరగాయలు (–15.10%), తోలు ఉత్పత్తులు (–5.29%), రెడీమేడ్ దుస్తుల (–6.52 శాతం) ఎగుమతుల్లో అసలు వృద్ధి నమోదుకాలేదు. ఎగుమతులకు సంబంధించి దాదాపు 30 కీలక రంగాల్లో 17 క్షీణతను నమోదుచేసుకున్నాయి.
- పసిడి దిగుమతులు నవంబర్‌లో 6.59 శాతం ఎగబాకాయి. 2.94 బిలియన్ డాలర్లకు పెరిగాయి.
- చమురు దిగుమతులు – 18.17% పడిపోయి 11.06 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. చమురు యేతర దిగుమతుల విలువ 10.26 శాతం తగ్గి 27.04 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

**ఎనిమిది నెలల్లోనూ క్షీణత...:** కాగా, ఏప్రిల్ నుంచి నవంబర్ వరకూ చూస్తే, ఎగుమతులు 1.99 శాతం పడిపోయి 211.93 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు కూడా 8.91 శాతం పడిపోయి 318.78 బిలియన్ డాలర్లకు చేరాయి.

### ఇబ్బందిగానే ఉంది..



2019 నవంబర్‌లో ఇంజనీరింగ్ ఎగుమతుల్లో వృద్ధి 6.32 శాతంగా ఉంది. అయితే మొత్తంగా చూస్తే, విదేశీ వాణిజ్య పరిస్థితులు సవాళ్లమయంగా కనిపిస్తోంది. ప్రపంచమార్కెట్లో మరింతగా పోటీపడేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం.

*– రవి సింఘాల్, ఈఈపీసీ ఇండియా చైర్మన్*

### ఆర్థిక వ్యవస్థలో బలహీనత



గణాంకాలు చూస్తుంటే, ఆర్థిక వ్యవస్థలో బలహీన డిమాండ్‌కు అద్దం పడుతోంది. ఆయిల్, రవాణా తదితర పరికరాల దిగుమతులు క్షీణతలో ఉండడం ఇక్కడ గమనార్హం.

*– అదితి నాయర్, ఐసీఆర్ఏ ప్రిన్సిపల్ ఎకనమిస్ట్*

### సేవల ఎగుమతుల్లో 5 శాతం వృద్ధి

ఇదిలావుండగా, అక్టోబర్‌లో సేవల ఎగుమతులు 5.25 శాతం పెరిగాయి. విలువ రూపంలో ఈ ఎగుమతులు 17.70 బిలియన్ డాలర్లు. అయితే ఎగుమతుల విలువ మాత్రం దాదాపు యథాతథంగా 10.86 బిలియన్ డాలర్లుగా ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం తాజా గణాంకాలను విడుదల చేసింది. 2018 అక్టోబర్‌లో సేవల ఎగుమతుల విలువ 16.82 బిలియన్ డాలర్లు. దిగుమతుల విలువ 10.10 బిలియన్ డాలర్లు. భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో సేవల వాటా దాదాపు 55 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే.



# అవసరమైనప్పుడు మరిన్ని చర్యలుంటాయ్

**ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ:** ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న రంగాలకు మరిన్ని ప్రోత్సాహక చర్యలు ఉంటాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. వృద్ధికి ప్రోత్సాహకంగా అవసరమైనప్పుడు మరిన్ని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు వినియోగాన్ని పెంచడం ద్వారా వృద్ధికి ఊతమిస్తాయన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. శుక్రవారం ఢిల్లీలో సీనియర్ అధికారులతో కలసి ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) పెంచబోతున్నట్టు తన కార్యాలయం మినహా అంతటా వదంతులు వ్యాప్తి చెందుతున్నట్టు వ్యాఖ్యానించారు. ఈ నెల 18న జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్‌టీ పరిహార బకాయిలపై అవగాహన ఉందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని మంత్రి చెప్పారు. ఆర్థిక రంగం ఎప్పుడు పుంజుకోవచ్చంటూ ఈ సందర్భంగా ఎదురైన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. ''నేను ఎటువంటి అంచనాలు వేయను. ఆర్థిక వ్యవస్థకు సంబంధించి అవసరమైనప్పుడు జోక్యం చేసుకుంటాను. పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది'' అని వివరించారు. స్టాగ్‌ఫ్లేషన్ (ద్రవ్యోల్బణం పెరుగుతూ, వృద్ధి తగ్గుతుండడం)పై తానేమీ వ్యాఖ్యానించబోనన్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రాజన్ భారత్ స్టాగ్‌ఫ్లేషన్ దశలోకి వెళుతోందని వ్యాఖ్యానించిన విషయం గమనార్హం.

**ధరలు దిగొస్తున్నాయి..**

ఉల్లిపాయల దిగుమతులతో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ధరలు దిగొస్తున్నట్టు మంత్రి చెప్పారు. తాజా పంట దిగుబడులు కూడా మార్కెట్‌కు చేరితే ధరలు మరింత తగ్గుముఖం పడతాయన్నారు.

## రూ.1.57 లక్షల కోట్ల పన్ను రీఫండ్‌లు



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019–20)లో ఇప్పటి వరకు (ఎనిమిదిన్నర నెలల్లో) రూ.1.57 లక్షల కోట్ల మొత్తాన్ని పన్ను చెల్లింపుదారులకు రీఫండ్ చేసినట్టు కేంద్ర రెవెన్యూ సెక్రటరీ అజయ్‌భూషణ్ పాండే శుక్రవారం ఢిల్లీలో తెలిపారు. 2018–19లో ఇదే కాలంలో రీఫండ్ రూ.1.23 లక్షల కోట్లుగా ఉందని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రీఫండ్‌లు రూ.38,988 కోట్లుగా ఉన్నట్టు తెలిపారు.

## కార్పొ బ్రీఫ్..

మొబైల్ పేమెంట్స్ యాప్ ఫోన్‌పే 500 కోట్ల లావాదేవీలను అధిగమించింది. గతేడాది నవంబర్‌లో 100 కోట్ల లావాదేవీలను నమోదుచేసిన సంస్థ.. ఈ ఏడాది ఏకంగా 5 రెట్లు వృద్ధిని నమోదుచేసింది.

## బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,540 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,700 | 0 |
| వెండి (కిలో) | 47,300 | ▲ 400 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,800 | ▼ 20 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,000 | ▼ 20 |
| వెండి (కిలో) | 47,300 | ▲ 400 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,800 | ▼ 20 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,000 | ▼ 20 |
| వెండి (కిలో) | 45,000 | ▲ 100 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,850 | ▲ 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,980 | ▲ 10 |
| వెండి (కిలో) | 45,000 | ▲ 100 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,580 | ▼ 100 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,880 | ▼ 100 |
| వెండి (కిలో) | 45,500 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,920 | ▼ 20 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,000 | ▼ 20 |
| వెండి (కిలో) | 47,300 | ▲ 400 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 60.00 (రాత్రి 11.30కు) | $59.18 (గురువారం ముగింపు) |
| బ్రెంట్ | 65.19 (రాత్రి 11.30కు) | $64.20 (గురువారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 14-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 458-00 |
| వరంగల్ | 428-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |
| 13-12-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 425-00 |

# వాణిజ్య ఒప్పంద లాభాలు

- అమెరికా–చైనాల మధ్య తొలి దశ ఒప్పందం !
- బ్రెగ్జిట్ అనుకూలుడైన బోరిస్‌కు భారీ మెజార్టీ
- కొనసాగిన రూపాయి బలం
- 41,000 పాయింట్లపైకి సెన్సెక్స్
- 428 పాయింట్ల లాభంతో 41,010 వద్ద ముగింపు
- 12,050 పాయింట్లపైకి నిఫ్టీ
- 115 పాయింట్లు పెరిగి 12,087కు చేరిక



సుదీర్ఘకాలం ప్రతిష్టంభన తరువాత అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారు కావడంతో శుక్రవారం స్టాక్ మార్కెట్ జోరుగా పెరిగింది. బ్రిటన్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న బోరిస్ జాన్సన్ పార్టీయే ఎన్నికల్లో గెలవడంతో ప్రపంచ మార్కెట్లు బాగా పెరిగాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 41,000 పాయింట్లపైకి, ఎన్ఎస్ఈ నిఫ్టీ 12,050 పాయింట్లపైకి ఎగబాకాయి. పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణ గణాంకాలు బలహీనంగా ఉన్నా, ముడి చమురు ధరలు 1 శాతం మేర పెరిగినా, అంతర్జాతీయ సంకేతాలు సానుకూలంగా ఉండటంతో సెన్సెక్స్, నిఫ్టీలు దూసుకుపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం బలపడటం కొనసాగడం కలసివచ్చింది. సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 428 పాయింట్ల లాభంతో 41,010 పాయింట్ల వద్ద, నిఫ్టీ 115 పాయింట్లు పెరిగి 12,087 పాయింట్ల వద్ద ముగిశాయి. ఇక వారం పరంగా చూస్తే, సెన్సెక్స్ 565 పాయింట్లు, నిఫ్టీ 165 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.

ఈ ఏడాది నవంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం మూడేళ్ల గరిష్ట స్థాయికి ఎగసింది. ఈ అక్టోబర్‌లో పారిశ్రామికోత్పత్తి వరుసగా మూడో నెలలోనూ క్షీణించింది. ఇలాంటి ప్రతికూలతలు ఉన్నప్పటికీ, మన మార్కెట్ లాభాల్లోనే ఆరంభమైంది. రోజంతా ఈ జోరు కొనసాగింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 475 పాయింట్ల మేర లాభపడింది. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.5 శాతం నుంచి 2.5 శాతం మేర లాభపడ్డాయి.

**లోహ షేర్ల ర్యాలీ**

లోహ షేర్లు దుమ్ము రేపాయి. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారు కావడంతో లోహ షేర్లు లాభపడ్డాయి. ఈ దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా గత కొంత కాలంగా ఈ షేర్లు నష్టపోయాయి. వేదాంత, హిందాల్కో, కోల్ ఇండియా, సెయిల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నాల్కో, ఎన్ఎమ్‌డీసీ, హిందుస్తాన్ జింక్‌లు 0.2 శాతం నుంచి 3.6 శాతం రేంజ్‌లో లాభపడ్డాయి.

- యాక్సిస్ బ్యాంక్ షేర్4.1 శాతం లాభంతో రూ.752 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే.
- భారతీ ఎయిర్‌టెల్ షేర్ 2 శాతం నష్టంతో రూ.427 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.

## స్టాక్ మార్కెట్ డేటా

| టర్నోవర్ (రూ. కోట్లలో) | |
|---|---|
| బీఎస్ఈ | 2,041 |
| ఎన్ఎస్ఈ | 36,712 |
| ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్) | 8,79,129 |
| ఎఫ్ఐఐ | 116 |
| డీఐఐ | 385 |

- 31 సెన్సెక్స్ షేర్లలో 25 షేర్లు లాభపడగా, ఆరు షేర్లు నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్తాన్ యునిలివర్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఆటో, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎయిర్‌టెల్‌లు నష్టపోయాయి.
- ఇంగ్లాండ్, ఇతర యూరప్ దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీల షేర్లు పెరిగాయి. టాటా మోటార్స్, భారత్ ఫోర్జ్, మదర్సన్ సుమి, టీసీఎస్ తదితర షేర్లు లాభపడ్డాయి.

## లాభాలు ఎందుకంటే..

**1 అమెరికా–చైనాల మధ్య కుదిరిన డీల్**

అమెరికా–చైనాల మధ్య దాదాపు 17 నెలలుగా సాగుతున్న వాణిజ్య యుద్ధం ఇక ముగిసినట్లే .వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు సంబంధించి తొలి దశ ఒప్పందం దాదాపు ఖరారైంది. దీంతో ఈ నెల 15 నుంచి అమల్లోకి రానున్న ప్రతిపాదిత సుంకాలు రద్దవుతాయి. అంతే కాకుండా ప్రస్తుతం చైనాపై విధిస్తున్న సుంకాలు 50% మేర తగ్గుతాయి. తాజా వాణిజ్య ఒప్పందం ఇరు దేశాలకు ప్రయోజనం చేకూర్చనుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

**2 బోరిస్ జాన్సన్‌కు మెజారిటీ**

ఇంగ్లాండ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న బోరిస్ జాన్సన్‌కు చెందిన కన్జర్వేటివ్ పార్టీకి భారీ మెజారిటీ దక్కింది. దీంతో మూడున్నరేళ్ల బ్రెగ్జిట్(యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగడం) అనిశ్చితికి తెరపడనున్నది. వచ్చే నెల చివరికల్లా బ్రెగ్జిట్ పూర్తవుతుందని అంచనా. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ లాగానే యూరోపియన్ కేంద్ర బ్యాంక్‌కు రేట్లను పెంచకపోవడం కలిసొచ్చింది.

**3. మరిన్ని తాయిలాలు...**

ఆర్థిక మందగమనంతో కుదేలైన ఆర్థిక రంగాన్ని ఆదుకోవడానికి మరిన్ని తాయిలాలను కేంద్రం ప్రకటించగలదన్న అంచనాలతో కొనుగోళ్లు జోరుగా సాగాయి.

**4. ఇతర కారణాలు...**

ఎస్సార్ స్టీల్ దివాలా కేసుకు సంబంధించిన నిధులు అందే అవకాశాలున్నాయన్న వార్తల కారణంగా ఈ కంపెనీకి రుణాలిచ్చిన ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. ఎఫ్‌పీఐ బాండ్లలో ఇన్వెస్ట్ చేసే పరిమితిని కనీసం 10% మేర పెంచాలని కేంద్రం యోచిస్తోందన్న వార్తలు సానుకూల ప్రభావం చూపించాయి.

## సహకార బ్యాంకుల పనితీరుపై ఆర్‌బీఐ సమీక్ష

**భువనేశ్వర్:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకు (పీఎంసీ) స్కామ్‌తో లక్షల మంది డిపాజిటర్లు సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అర్బన్ సహకార బ్యాంకుల పనితీరును రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డు శనివారం సమీక్షించింది. ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు, అంతర్గతంగాను.. అంతర్జాతీయంగాను దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు మొదలైన అంశాలు కూడా చర్చించింది. గవర్నర్ శక్తికాంత దాస్ సారథ్యంలో సమావేశమైన సెంట్రల్ బోర్డు.. పట్టణ ప్రాంత కోఆపరేటివ్ బ్యాంకులు, వాటితో పాటు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల్లో నిబంధనల అమలు తదితర అంశాలను సమీక్షించిందని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. రియల్టీ సంస్థ హెచ్‌డీఐఎల్‌కు మొత్తం రూ. 6,226 కోట్ల మేర రుణాలిచ్చినప్పటికీ .. పీఎంసీ బ్యాంకు కేవలం రూ. 440 కోట్లు మాత్రమే ఇచ్చినట్లు ఆర్‌బీఐకి చూపించిన సంగతి తెలిసిందే. ఈ స్కామ్ బైటపడటంతో పీఎంసీ బ్యాంకు ఖాతాదారుల విత్‌డ్రాయల్స్‌పై ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది.

## పేటీఎమ్‌కు రూ.4,724 కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ:** డిజిటల్ చెల్లింపుల సంస్థ పేటీఎమ్ మరోసారి నిధులు సమీకరించింది. పేటీఎమ్ మాతృసంస్థ, వన్97 కమ్యూనికేషన్స్ రూ.4,724 కోట్లు(66 కోట్ల డాలర్లు) సమీకరించిందని, చైనా ఆన్‌లైన్ దిగ్గజం అలీబాబాకు చెందిన అలీపేతో పాటు టి రొవె ప్రైస్ నిర్వహణలోని ఫండ్స్, సాఫ్ట్ బ్యాంక్‌కు చెందిన ఎస్‌వీఎఫ్ పాంథర్(కేమ్యాన్) ఈ పెట్టుబడులు పెట్టాయని తెలిసింది. ఈ వివరాలను బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫార్మ్ టోఫ్లర్ పేర్కొంది. అయితే, ఈ అంశంపై పేటీఎమ్ స్పందించలేదు.

## ఆంధ్రప్రదేశ్‌లో 971 కంపెనీలు స్ట్రయిక్ ఆఫ్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్‌లో తాజాగా 971 కంపెనీలు స్ట్రయిక్ ఆఫ్ అయ్యాయి. 2016–17, 2017–18 వరుసగా రెండేళ్లు వార్షిక రిటర్నులు, బ్యాలెన్స్ షీట్లను ఫైల్ చేయని కారణంగా సెక్షన్ 248 ప్రకారం ఈ కంపెనీలను స్ట్రయిక్ ఆఫ్ చేసినట్లు ఇండియన్ కార్పొరేట్ లా సర్వీసెస్ (ఐసీఎల్ఎస్) సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. తొలిసారిగా స్ట్రయిక్ ఆఫ్ అయిన కంపెనీల బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేసినట్లు చెప్పారు. కంపెనీల డేటాతో పాటు బ్యాంక్ అకౌంట్, పాన్ నంబర్ల వివరాలను ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్, ఆర్‌బీఐ, ఐటీ, జీఎస్‌టీ కార్యాలయాలకు పంపించామన్నారు.

**5 వేల మంది డైరెక్టర్లు డిస్క్వాలిఫై...**

2015–16, 2016–17, 2017–18 వరుసగా మూడేళ్ల పాటు బ్యాలెన్స్ షీట్లను సమర్పించని వివిధ కంపెనీలకు చెందిన సుమారు 5 వేల మంది డైరెక్టర్లను అనర్హులుగా (డిస్క్వాలిఫై) ప్రకటించారు.వీరిలో అక్షయ గోల్డ్, అగ్రిగోల్డ్ వంటి కంపెనీల డైరెక్టర్లున్నారు.

## టెక్ మహీంద్రాకు రూ.500 కోట్ల కాంట్రాక్టు



**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలోని పింప్రి చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ (పీసీఎంసీ) నుంచి రూ.500 కోట్ల స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కాంట్రాక్టును టెక్ మహీంద్రా దక్కించుకుంది. పీసీఎంసీ పరిధిలో టెక్నాలజీ ఆధారంగా 15 లక్షలకు పైగా ప్రజలకు స్మార్ట్ సేవలు అందించనుంది.

## ఎయిర్‌లైన్స్ కంపెనీలకు రూ.4,260 కోట్ల నష్టాలు

**2019–20 సంవత్సరంపై సీఏపీఏ తాజా అంచనా**

విమానయాన సంస్థలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 600 మిలియన్ డాలర్లకు (రూ.4,260 కోట్లు) పైగా నష్టాలను నమోదుచేయవచ్చని కన్సల్టెన్సీ సంస్థ సీఏపీఏ అంచనా వేసింది. 500–700 మిలియన్ డాలర్ల వరకు లాభాలకు అవకాశం ఉంటుందని ఈ ఏడాది జూన్‌లో వేసిన అంచనాలను సవరించింది. జెట్ ఎయిర్‌వేస్ మూసివేత, సానుకూలంగా ఉన్న చమురు ధరల నుంచి ప్రయోజనం పొందడంలో ఎయిర్‌లైన్స్ కంపెనీలు విఫలమైనట్టు సీఏపీఏ తన తాజా నివేదికలో పేర్కొంది.

## హైదరాబాద్‌లో ఎండ్రెస్ హోసర్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ప్రాసెస్ ఆటోమేషన్ రంగంలో ఉన్న ఎండ్రెస్ హోసర్ హైదరాబాద్‌లో టెక్నాలజీ ఆధారిత ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. ఇప్పటికే కంపెనీకి ఇతర నగరాల్లో ఇటువంటివి రెండు కేంద్రాలున్నాయి. దేశవ్యాప్తంగా 3,000కు పైగా క్లయింట్లకు తాము సేవలు అందిస్తున్నట్టు ఎండ్రెస్ హోసర్ ఇండియా ఎండీ కైలాష్ దేశాయ్ శుక్రవారమిక్కడ మీడియాకు తెలియజేశారు. 70 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థ ఖాతాలో 7,000 పేటెంట్లు ఉన్నాయని గుర్తు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.750 కోట్ల ఎగుమతులతో కలిపి రూ.1,400 కోట్ల టర్నోవర్ సాధించింది.

## టి-హబ్‌లో రక్షణ రంగ స్టార్టప్‌ల వర్క్‌షాప్

**డిసెంబర్ 16న ప్రారంభం**

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రక్షణ రంగ స్టార్టప్ సంస్థలకు సంబంధించిన వర్క్‌షాప్‌కు హైదరాబాద్‌లోని టి–హబ్ వేదిక కానుంది. డిసెంబర్ 16, 17 తారీఖుల్లో (సోమ, మంగళ) రెండు రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌ను.. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్, నెక్సస్ స్టార్టప్ హబ్ (న్యూఢిల్లీ) కలిసి సంయుక్తంగా నిర్వహించనున్నాయి. భారత్, అమెరికా రక్షణ రంగ సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇది తోడ్పడనుంది. డిఫెన్స్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి స్టార్టప్ సంస్థలు వినూత్న ఆవిష్కరణలు ఇందులో ప్రదర్శించనున్నాయి. పలువురు వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, ప్రభుత్వ అధికారులు ఈ వర్క్‌షాపులో పాల్గొనున్నారు.

**రాష్ట్రీయం**

# మద్యాన్ని నిషేధించాలి

- బీజేపీ నేత పరిపూర్ణానంద స్వామి
- డీకే అరుణకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసిన స్వామి

**హైదరాబాద్:** భావితరాల భవిష్యత్ కోసం మద్యపానాన్ని నిషేధించాలని బీజేపీ నాయకుడు పరిపూర్ణానంద స్వామి అన్నారు. భావితరాల్లో పెనుమార్పు కోసం కడుపు మాడ్చుకుని దీక్ష చేస్తే కానీ ప్రభుత్వానికి కనువిప్పు కలగదేమోనని వ్యాఖ్యానించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలో మద్యాన్ని నిషేధించాలంటూ మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు డీకే అరుణ తలపెట్టిన 48 గంటల మహిళా సంకల్ప దీక్షను పరిపూర్ణానంద స్వామి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి దిశ పాపం తగలకుండా ఉండాలంటే మద్యపాన నిషేధం చేయాలని కోరారు.



డీకే అరుణకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేస్తున్న పరిపూర్ణానంద స్వామి

ఎన్‌కౌంటర్ ప్రభుత్వం, పోలీసుల గొప్పతనం కాదు, ఇది ప్రజల తీర్పు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విడతల వారీగా మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. డీకే అరుణ చేస్తున్న దీక్ష బీజేపీ కోసం కాదని, ఇది తెలంగాణ మహిళల కోసం తలపెట్టిన దీక్షని అన్నారు. మద్యంతోపాటు డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దీక్షకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో మద్యం ఏరులైపారుతోందని విమర్శించారు. డీకే అరుణ మాట్లాడుతూ.. దొర లెక్క తెలంగాణను పాలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే మద్యం నిషేధించలేరా అని ప్రశ్నించారు. దిశ సంఘటనతోనైనా సీఎంకు కనువిప్పుకలగాలని అన్నారు. దీక్షకు మాజీ మంత్రి ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, గజ్జల రామకృష్ణారెడ్డి, ఇంటి పా ర్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్, గుజ్జు కృష్ణ, నీల వెంకటేశ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఆకుల విజయ, ప్రధాన కార్యదర్శి అరుణ జ్యోతి, రాధిక, రమాదేవి, గౌరీ పాల్గొన్నారు.

## విద్యార్థినులపై ఉపాధ్యాయుని అసభ్యప్రవర్తన

**పోక్సో కేసు నమోదు..**

**హైదరాబాద్:** విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఓ గురువు మైనర్ విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. విషయం తెలిసిన విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీయడంతో శుక్రవారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. నేరేడ్‌మెట్ సీఐ నరసింహస్వామి, స్థానికులు కథనం ప్రకారం...రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మల్కిజి గూడకు చెందిన రెడ్డెమోని జగదీశ్వర్ మల్కాజిగిరిలోని నేరేడ్‌మెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. పాఠాలు చెప్పే క్రమంలో కొంత కాలంగా అతను ఇరువురు 8వ తరగతి విద్యార్థినులతో అసభ్యంగా వ్యవహరిస్తున్నాడు. పిల్లల మానసిక ప్రవర్తనలో మార్పు రావడంతో కుటుంబీకులు గమనించి ప్రశ్నించడంతో విషయాన్ని చెప్పారు. శుక్రవారం బాధిత కుటుంబసభ్యులు నేరేడ్‌మెట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకొని ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌కు ఫిర్యాదు చేసి, జగదీశ్వర్‌ను నిలదీయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పోలీసుస్టేషన్ వద్ద టీచర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సదరు విద్యార్థినుల కుటుంబసభ్యులు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జగదీశ్వర్‌పై పోక్సోతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని సీఐ నరసింహస్వామి తెలిపారు.

## బాలికపై అత్యాచారం

**పోక్సో చట్టం కింద ఇద్దరి అరెస్ట్**

**హైదరాబాద్:** ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో మభ్యపెట్టి అత్యాచారం చేసిన యువకుడిని, సహకరించిన అతడి మామను నారాయణగూడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. దూద్‌బౌలి ప్రాంతానికి చెందిన ఠాకూర్ అమర్‌సింగ్ కుమారుడు ఠాకూర్ దినేశ్ సింగ్ (19) బషీర్‌బాగ్‌లోని భవాని జ్యువెల్లర్స్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. దూద్‌బౌలి ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలిక హిమాయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ చదువుతోంది. దినేశ్ కొంత కాలం క్రితం బాలికతో పరిచయం పెంచుకుని ప్రేమ పేరుతో మభ్యపెట్టాడు. ఈ నెల 11న కాలేజీకి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు కామాటిపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నారాయణగూడ పోలీసులు కేసును తిరిగి నమోదు చేసి కళాశాల వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా.. దినేశ్ ఆ బాలికను తన బైక్‌పై తీసుకువెళ్తున్నట్లు గుర్తించారు. నిందితుడి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కార్వాన్‌లో అతడి మామ లఖన్‌సింగ్ (50) ఇంట్లో ఉన్నట్టు గుర్తించారు. లఖన్‌సింగ్ ఇంట్లో 2 రోజులపాటు బాలికను ఉంచిన దినేశ్ సింగ్ ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. పోక్సో చట్టం ప్రకారం నిందితులపై కేసు నమోదు చేసి దినేశ్‌సింగ్‌తోపాటు అతడికి సహకరించిన లఖన్‌సింగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## 23 నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్

**హైదరాబాద్:** ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ పుస్తక ప్రదర్శన (హైదరాబాద్ బుక్ ఫెయిర్)ను ఈ నెల 23 నుంచి జనవరి 1 వరకు తెలంగాణ కళాభారతి (ఎన్‌టీఆర్ స్టేడియం)లో నిర్వహించనున్నటు హెచ్‌బీఎఫ్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుక్ ఫెయిర్ వివరాలను ఆయన వెల్లడించారు. ఏటా 10 లక్షల మంది పుస్తక ప్రేమికులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారని, తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, పుణేల నుంచి కూడా ప్రదర్శనకు హాజరవుతున్నారని తెలిపారు. ఈసారి ప్రదర్శనలో 330 స్టాళ్లు ఉంటాయని, దేశ విదేశాలకు చెందిన పబ్లిషర్స్ ఇందులో పాల్గొంటారన్నారు. సెలవు దినాల్లో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 వరకు, పనిదినాల్లో మధ్యాహ్నం 2:30 నుంచి 8:30 వరకు ఫెయిర్ జరుగుతుందని తెలిపారు. ప్రదర్శన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. 2 లక్షల పాస్‌లు ముద్రించి రచయితలు, కవులు, పుస్తక ప్రియులు, ఎన్జీవోలు, విద్యా సంస్థల వారికి అందజేస్తున్నామని, విద్యార్థులు, జర్నలిస్టులకు ప్రవేశం ఉచితమన్నారు.

## స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజన జరగాలి

**టీఈఈజేఏసీ, టీఎస్‌పీఈఏ డిమాండ్**

**సాక్షి, హైదరాబాద్:** విద్యుత్ ఉద్యోగుల విభజన అంశంలో ఏపీ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు అనుసరిస్తున్న మొండివైఖరిని వీడాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఈఈజేఏసీ), తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీఈఏ)లు డిమాండ్ చేశాయి. స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజన జరగాల్సిందేనని ఆయా సంఘాలు స్ప ష్టం చేశాయి. ఒత్తిళ్లకు తలొగ్గి ఏపీ ఉద్యోగులను తెలంగాణ సంస్థలకు కేటాయిస్తే చూస్తూ ఊరు కునే ప్రసక్తే లేదని హెచ్చరించాయి. ఈ మేరకు శుక్రవారం టీఈఈజేఏసీ చైర్మన్ ఎన్.శివాజీ, కన్వీనర్ అంజయ్య, టీఎస్‌పీఈఏ అధ్యక్షుడు రత్నాకర్ రావు, కార్యదర్శి సదానందం, ప్రచార కార్యదర్శి శ్రీనివాస్‌లు మింట్‌కాంపౌండ్‌లో వేర్వేరుగా విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల విభజన ఏకసభ్య కమిటీ న్యాయమూర్తి ధర్మాధికారి మార్గదర్శకాలకు విరుద్ధంగా 582 మంది ఏపీ ఉద్యోగులను తెలంగాణ విద్యుత్ సంస్థల్లో కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు ప్రకటించారు. తెలంగాణ విద్యుత్ సంస్థలు రిలీవ్ చేసిన 1,157 మందిలో 613 మంది ఏపీలో పనిచేయడానికి ఆప్షన్లు ఇచ్చారని, దీన్ని కమిటీ కూడా ఆమోదించిందని తెలిపారు. స్థానికత ఆధారంగా తెలంగాణ విద్యుత్ సంస్థలు రిలీవ్ చేసిన ఉద్యోగులను ఏపీ విద్యుత్ సంస్థల్లో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ ఉద్యోగులు ఏదో ఒక మెలిక పెడుతూ ఉద్యోగుల విభజన సమస్యను మరింత జటిలం చేస్తున్నారని ఆరోపించారు.

## షుగర్ రోగులకు ఐడీ నంబర్

- జాతీయ ఆరోగ్య మిషన్ నిర్ణయం
- రాష్ట్రంలో 5.14 లక్షల మందికి కార్డులు
- ఈ నంబర్‌తో ఆన్‌లైన్‌లో వివరాలు
- రాష్ట్రవ్యాప్తంగా హెల్త్ ప్రొఫైల్

**సాక్షి, హైదరాబాద్:** బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు యూనిక్ ఐడీ నంబర్ కేటాయించాలని జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిర్ణయించింది. ప్రతి వ్యక్తికి ప్రత్యేక నంబర్‌తో కూడిన బుక్ అందజేస్తారు. ఈ బుక్‌లో యూనిక్ ఐడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) కోడ్, జిల్లా, గ్రామం కోడ్స్ ఉంటాయి. ఇప్పటికే బుక్స్ సిద్ధంగా ఉన్నాయి. త్వరలోనే వాటిని పంపిణీ చేయనున్నారు. యూనిక్ ఐడీ నంబర్ల వినియోగంపై ప్రస్తుతం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో రోగికి ఒక్కో బుక్ ఇచ్చి, అందులోని యూనిక్ ఐడీ నంబర్‌తో రోగుల వివరాలను అనుసంధానించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వారికి అందిస్తున్న వైద్యం, ఉచితంగా పంపిణీ చేస్తున్న మందులు, ఇతర విషయాలు ఈ బుక్‌లోనూ, అలాగే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. షుగర్, బీపీ ఏ మేరకు తగ్గుతుందో లేదా పెరుగుతుందో ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. దీనివల్ల వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఒకవేళ ఇతరత్రా ఏదైనా చికిత్స కోసం వెళితే ఈ నంబర్ ఆధారంగా డాక్టర్లు వైద్యం చేసే అవకాశముంది.

**5.14 లక్షల మందికి నంబర్లు..**

రాష్ట్రంలో సిద్దిపేట, జనగామ, కరీంనగర్, మహబూబాబాద్, సిరిసిల్ల, భూపాలపల్లి, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, మెదక్, సంగారెడ్డి, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో నాన్–కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) సర్వే పూర్తయింది. ఈ జిల్లాల్లో 30 ఏళ్లు పైబడిన 35 లక్షల మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేయించారు. ఇందులో 2.14 లక్షల మందికి డయాబెటిస్, సుమారు 3 లక్షల మందికి బీపీ ఉన్నట్టు గుర్తించారు. తమకు షుగర్, బీపీ ఉందని వీరిలో సుమారు 50 శాతం మందికి సర్వే నిర్వహించే వరకూ తెలియదు. మిగిలిన 21 జిల్లాల్లో సర్వే కొనసాగుతోంది. ఈ జిల్లాల్లోనూ లక్షల మందికి బీపీ, డయాబెటిస్ ఉన్నట్టు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలు గుర్తించిన అనుమానిత కేసులకు పీహెచ్‌సీ స్థాయిలో మరోసారి పరీక్షలు చేయాల్సి ఉంది. ఇక సర్వే పూర్తయిన 12 జిల్లాల్లో మరోసారి సర్వే చేయనున్నట్టు చెబుతున్నారు. తొలి దశలో కొన్ని చోట్ల పాత పేషెంట్ల వివరాలు నమోదు చేయలేదు. వారిని కూడా గుర్తించి యూనిక్ ఐడీ నంబర్ ఇస్తారు.

**త్వరలో అందరి హెల్త్ ప్రొఫైల్..**

రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేసేందుకు రంగం సిద్ధమైంది. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ తన నియోజకవర్గంలో హెల్త్ ప్రొఫైల్‌పై మాట్లాడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హెల్త్ ప్రొఫైల్ చేపట్టే అంశంపై అధికారులకు ఆదేశాలు రానున్నాయి. ముందుగా సీఎం నియోజకవర్గం నుంచి ప్రారంభించి దశలవారీగా రాష్ట్రం మొత్తం అమలు చేయనున్నారు.మొత్తం వైద్య ఆరోగ్య శాఖతోపాటు హెల్త్ ప్రొఫైల్‌పై ముఖ్యమంత్రి త్వరలో సమీక్ష చేసే అవకాశముంది.





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఈటల రాజేందర్ తదితరులు

## పౌల్ట్రీ రంగం అభివృద్ధి కోసం దేశంలోనే అత్యుత్తమ పాలసీ

**సబ్‌కమిటీ సమావేశంలో మంత్రి తలసాని**

**సాక్షి, హైదరాబాద్ :** రాష్ట్రంలో పౌల్ట్రీ రంగానికి మరింత లబ్ధి చేకూర్చేలా దేశంలోనే ఉత్తమ పాలసీని తయారు చేస్తామని, దీనిపై అధ్యయనం చేసి త్వరలోనే నివేదికను సీఎం కేసీఆర్‌కు అందజేస్తామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధి, ఉత్పత్తిలో రాష్ట్రం 3వ స్థానంలో ఉందని, ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధిపై ఏర్పాటు చేసిన రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సమావేశం తలసాని అధ్యక్షతన శుక్రవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లో జరిగింది. ఈ సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు ఈటల రాజేందర్, వి.శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు ఉన్నతాధికారులు, కోళ్ల పెంపకందారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ పోటీ మార్కెట్‌లో పౌల్ట్రీ రంగం నిలదొక్కుకునే విధంగా ప్రభుత్వం అందించదగిన సహాయ సహకారాలపై అధ్యయనం చేస్తామని, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పాలసీలను కూడా పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఎంత మంది లేయర్, బాయిలర్ కోళ్ల పెంపకం దారులున్నారు, దాణా ఉత్పత్తిదారులెంత మంది అనే అంశాలపై సమగ్ర సమాచారం సేకరించాలని, రాష్ట్రంలోని కోళ్ల దాణా కోసం ఎంత మొక్కజొన్న అవసరమన్న దాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో భాగంగా పౌల్ట్రీ రంగ ప్రతినిధులతో పాటు పెరటికోళ్ల పెంపకం దారులను కూడా ఆహ్వానించి వారి అభిప్రాయాలు తీసుకున్నారు.

## పంచాయతీరాజ్‌లో 'సర్దుబాటు'

**సాక్షి, హైదరాబాద్ :** కొత్త మండలాలకు ఎంపీడీవో, ఎంపీవోలను నియమించారు. మున్సిపాలిటీలుగా మారిన మండలాల్లో(డీనోటిఫై) పనిచేస్తున్న ఈ అధికారులను కొత్త మండలాలకు కేటాయిస్తూ శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 101 మండలాలు పురపాలన పరిధిలోకి వెళ్లాయి. వీటిలో పనిచేస్తున్న అధికారులను కొత్త మండలాలకు సర్దుబాటు చేశారు. ఇప్పటి వరకు వీటిలో తాత్కాలిక ప్రాతిపదికన సేవలందించారు. జిల్లాల పునర్విభజన అనంతరం పంచాయతీరాజ్‌శాఖలో ఉద్యోగులను కూడా విభజించారు. రాష్ట్రవ్యాప్తంగా 311 పోస్టులను సృష్టించిన ఆ శాఖ..23 చొప్పున సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో పోస్టులను ఏర్పాటు చేసింది. 40 డీఎల్‌పీవో, 101 చొప్పున ఎంపీడీవో, ఎంపీవో పోస్టులను మంజూరు చేసింది.

**పురపాలనలోకి 240 మంది పీఆర్ ఉద్యోగులు**

ఇన్నాళ్లు పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులుగా వ్యవహరించిన 240 మందిని మున్సిపల్ సర్వీసులోకి తీసుకుంటూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 75 కొత్త మున్సిపాలిటీలు ఏర్పడగా.. ఇందులో 173 గ్రామాలు విలీనమయ్యాయి. అలాగే ఇప్పటికే మనుగడలో ఉన్న 42 నగర/పురపాలక సంస్థల్లో 131 గ్రామ పంచాయతీలు కలిశాయి. దీంతో ఈ పంచాయతీల్లోని వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను ఏడాదికాలంగా పురపాలకశాఖ వినియోగించుకుంటోంది. తాజాగా వీరందరినీ మున్సిపల్ సర్వీసులో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మేనేజర్/రెవెన్యూ ఆఫీసర్(కేటగిరీ–3), సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్/జూనియర్ అసిస్టెంట్‌లుగా మున్సిపాలిటీల్లో వీరి సేవలను వాడుకోనుంది.

## లీవ్ మంజూరు అధికారం హెడ్‌మాస్టర్లకే

**సాక్షి, హైదరాబాద్:** ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్ మాస్టర్లు, టీచర్ల క్యాజువల్ లీవ్, స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు అధికారం సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి శుక్రవారం జీవో జారీ చేశారు. ఆ జీవోల అమలుకు వెంటనే చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యా కమిషనర్ విజయ్‌కుమార్ డీఈవోలకు ఆదేశాలిచ్చారు. ఇప్పటివరకు ఎంఈవోలకు ఉన్న ఈ అధికారాలను ఇప్పుడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. లీవ్ మంజూరుతోపాటు వేతనాల చెల్లింపు అధికారం కూడా వారికే అప్పగించారు. మరోవైపు సెలవులు కూడా ఆన్‌లైన్ లోనే మంజూరు చేయాలని, ఒకవేళ ఆన్‌లైన్ పని చేయకపోతే ఆఫ్‌లైన్‌లో మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఆ తరువాత వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని, జిల్లాల్లోని డీఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ఎంఈవోలు, ట్రెజరీ అధికారులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

# పొగమంచు ఉన్నా.. కూ చుక్ చుక్..

- రైల్వే వ్యవస్థలో సరికొత్త పరికరం అందుబాటులోకి
- సిగ్నళ్లు, మార్గం తెలుసుకునేలా 'ఫాగ్ పాస్'
- జీపీఎస్ ఆధారిత పరికరం వినియోగంలోకి
- స్క్రీన్‌పై సూచనలు, మార్గం ప్రత్యక్షం..




**సాక్షి, హైదరాబాద్:** చలికాలంలో పొగమంచుతో చాలా ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా వాహనదారులకు రోడ్డు కనిపించక జరిగే ప్రమాదాలెన్నో. ఇలాగే రైల్వే వ్యవస్థలో కూడా ఇలాంటి ఇబ్బందులే తలెత్తుతాయి. పొగమంచు కారణంగా సిగ్నల్స్ కనిపించకపోతే ఇక అంతే సంగతులు. భారీ ప్రమాదాలు జరుగుతాయి. అందుకే మంచు దట్టంగా కమ్ముకునే సమయంలో రైళ్లను కనిష్ట వేగానికి నియంత్రించి నడుపుతుంటారు. లోకోపైలట్ రైలును నెమ్మదిగా నడుపుతూ, సిగ్నల్స్‌ను గమనిస్తూ ముందుకు సాగుతుంటారు. దీంతో చాలా రైళ్లు ఆలస్యంగా నడవటం, కొన్నింటిని రద్దు చేయాల్సి రావటం జరుగుతాయి. ఇప్పుడీ సమస్యకు అధికారులు పరిష్కారం కనుగొన్నారు.

**ఫాగ్ పాస్..**

ఈ పొగమంచు సమస్యకు పరిష్కారంగా ఫాగ్‌పాస్ (ఫాగ్‌సేఫ్) పేరుతో ఓ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చారు అధికారులు. జీపీఎస్ ఆధారంగా ఇది పనిచేస్తుంది. ఇందులో స్క్రీన్ ఉంటుంది. సంబంధిత రైలు మార్గాన్ని జీపీఎస్ ద్వారా ఈ పరికరానికి అనుసంధానిస్తారు. ఆ మార్గంలో ఎక్కడెక్కడ సిగ్నళ్లు ఉన్నాయి.. ఎక్కడ సూచిక బోర్డులున్నాయి.. స్టేషన్లు.. మలుపులు, లెవల్ క్రాసింగ్స్.. ఇలా అన్ని వివరాలు అందులో కనిపిస్తాయి. రైలు వెళ్తున్న కొద్దీ మార్గంలో ముందున్న మూడు వివరాలు స్క్రీన్‌లో కనిపిస్తాయి. అవి ఎంత దూరంలో ఉన్నాయో స్పష్టం చేస్తుంది. 500 మీటర్ల దూరంలో ఉందనగా వాయిస్ రూపంలో అప్రమత్తం చేస్తుంది. దీంతో రైలు వేగాన్ని తగ్గించాల్సిన అవసరం లేకుండానే ముందుకు దూసుకెళ్లొచ్చు.

**కకోద్కర్ కమిటీ సలహాతో..**

2011లో హైలెవల్ సేఫ్టీ రివ్యూ కమిటీని కకోద్కర్ నేతృత్వంలో రైల్వే ఏర్పాటు చేసింది. ఆ కమిటీ రైల్వే భద్రతకు సంబంధించి 106 సిఫారసులు చేసింది. వాటిల్లో 68 పూర్తిస్థాయిలో అమలు చేయదగ్గవని రైల్వే బోర్డు గుర్తించింది. మరో 19 పాక్షికంగా అమలు చేయదగ్గవని గుర్తించింది. 68 సూచనల్లో ఈ ఫాగ్ పాస్ పరికరం కూడా ఉంది. దీన్ని స్థానికంగానే అభివృద్ధి చేశారు. కిలోన్నర బరువుండే ఈ పరికరంలో దృశ్య, శ్రవణ విధానం ఉంటుంది. క్రూ బుకింగ్ కేంద్రాల వద్ద వీటిని ఉంచి, రైలు బయల్దేరే సమయంలో లోకోపైలట్లకు అందిస్తారు. మళ్లీ డ్యూటీ పూర్తి కాగానే వారు దాన్ని సంబంధిత విభాగానికి అప్పగించాల్సి ఉంటుంది. గతేడాది ఈశాన్య భారతంలోని కొన్ని రైల్వే జోన్లకు ఈ పరికరాలు అందించారు. ఇప్పుడు దక్షిణ మధ్య రైల్వేకు కేటాయించారు. తొలి దఫాగా జోన్ పరిధిలో 250 పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. కాగా, పొగమంచు కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యలను ఈ పరికరంతో అధిగమించొచ్చని దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా పేర్కొన్నారు.

## చైనాకు 'సీతారామ' ఇంజనీర్లు

**సాక్షి, హైదరాబాద్:** సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మోటార్లు, పంపుల పరిశీలన కోసం ప్రాజెక్టు ఇంజనీర్లు, విద్యుత్ శాఖ ఇంజనీర్ల బృందాలు ఈ నెల 16 నుంచి చైనాలో పర్యటించనున్నాయి. 30 మెగావాట్ల పంపులు, మోటార్లను చైనాకు చెందిన షాంఘై ఎలక్ట్రిక్ మెషినరీ కంపెనీ సరఫరా చేస్తుండగా, వాటి పనితీరును ఇంజనీర్ల బృందం పర్యవేక్షించనుంది.










# ఫ్యామిలీ గ్యాంగ్.. పక్కా చోరీ బ్యాచ్

- ఈ ఓజికుప్పం ముఠా రూటే సపరేటు
- చిన్న పిల్లలతో సహా వచ్చి బస్సుల్లో చోరీలు
- మకాం వేస్తే రూ.కోటి కొట్టేసే వరకు అక్కడే..
- నలుగురిని అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు
- రూ.20 లక్షల సొత్తు స్వాధీనం.. వీరి నేరాలపై ఆరా



శుక్రవారం హైదరాబాద్‌లో ముఠా సభ్యులను మీడియాకు చూపుతున్న అంజనీకుమార్

**సాక్షి, హైదరాబాద్:** ఓ భర్త.. తన ఇద్దరు భార్యలు, పిల్లలు.. సోదరి, పెద్ద భార్య చెల్లెలు.. వీరంతా ఒక బ్యాచ్. బస్సుల్లో వెళ్లే ఈ కుటుంబానికి ఒంటరి మహిళలే టార్గెట్. ఓ నగరాన్ని లక్ష్యంగా చేసుకున్న తర్వాత అక్కడకు చేరుకుని త్రీస్టార్ హోటల్స్‌లో బస చేస్తుంది. సిటీ బస్సుల్లో ప్రయాణిస్తూ తమ చేతిలో ఉన్న పిల్లల్ని టార్గెట్‌కు ఇచ్చి మరీ వారి బ్యాగుల్లో ఉన్న నగదు, సొత్తు చేజిక్కించుకుంటుంది. ఈ ఓజికుప్పం ముఠా చోరీల వైనాన్ని హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీకుమార్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. వెస్ట్‌జోన్ సంయుక్త పోలీసు కమిషనర్ ఏఆర్ శ్రీనివాస్, ఆసిఫ్‌నగర్ ఏసీపీ ఆర్జీ శివమారుతిలతో కలసి మాట్లాడారు.

**రెండో భార్య నేతృత్వంలో గ్యాంగ్...**

ఏపీ–తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఓజికుప్పం ప్రాంతం వేలూరు జిల్లాలో ఉంటుంది. ఆ గ్రామంలో దృష్టి మళ్లించి నేరాలు చేసే ముఠాలు అనేకం ఉన్నాయి. దేశవ్యాప్తంగా పంజా విసిరే ఈ తరహా ముఠాల్లో గాయత్రి గ్యాంగ్ కూడా ఒకటి. ప్రస్తుతం ఈ ముఠా కర్ణాటక రాజధాని బెంగళూరులో స్థిరపడింది. సిగరెట్ల వ్యాపారి ఎస్.రాజు, మొదటి భార్య గాయత్రి, రెండో భార్య కోకిల, గాయత్రి సోదరి జ్యోతి, రాజు చెల్లెలు అనిత.. వీరంతా ఓ ముఠా. దీనికి గాయత్రి నేతృత్వం వహిస్తోంది. వీరు నేరం చేయడానికి వెళ్ళేప్పుడు గాయత్రి, కోకిలలకు చెందిన పిల్లల్ని కూడా చంకన వేసుకుని వెళ్తారు. ప్రధానంగా నగరాల్లో సంచరిస్తూ రద్దీ సిటీ బస్సుల్నే టార్గెట్‌గా చేసుకుని పంజా విసురుతూ ఉంటారు.

**జల్సాలతో పాటు షాపింగ్స్...**

చోరీ చేసిన సొమ్ముతో జ్యువెలరీ దుకాణాలు, బ్రాండెడ్ షోరూమ్స్‌లో షాపింగ్స్ చేసి పసిడి రూపంలోనే పట్టుకుపోతుంటారు. విలాస జీవితం గడపటంతో పాటు బెంగళూరులోని వివిధ ప్రాంతాల్లో స్థిరాస్తులు సమకూర్చుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ గాయత్రి గ్యాంగ్ ఈ ఏడాది జూన్ ఆఖరివారంలో ఆసిఫ్‌నగర్ పరిధిలో ఓ నేరం చేసింది. సికింద్రాబాద్ నుంచి సిటీ బస్సులో మెహిదీపట్నం వస్తున్న పి.జయలక్ష్మి అనే వృద్ధురాలి నుంచి 25 తులాల బంగారు ఆభరణాలు కాజేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫీడ్‌తో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి శుక్రవారం అనిత సహా మిగిలిన ముఠా సభ్యుల్ని శుక్రవారం పట్టుకున్నారు. వీరి నుంచి 35 తులాల బంగారం, రూ.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

**పిల్లల్ని టార్గెట్ చేతికిచ్చి...**

ఈ ముఠా రైళ్లలో సెకండ్ ఏసీ కంపార్ట్‌మెంట్స్‌లో ప్రయాణిస్తూ వివిధ నగరాలకు చేరుకుంటుంది. ఆపై అక్కడ ఏదో ఒక ప్రాంతంలో ఉన్న త్రీస్టార్ హోటల్‌లో బస చేస్తుంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో గ్యాంగులోని ఆడవాళ్లు పిల్లాపాపలతో కలసి సిటీ బస్సులు ఎక్కుతారు. ఆ బస్సులో పురుషులు ఉండే చోట ఎక్కే రాజు పరిసరాలను గమనిస్తూ ఉంటాడు. వీళ్ళు ప్రధానంగా బ్యాగులు, పెద్ద పర్సులతో ప్రయాణిస్తున్న ఒంటరి మహిళల్ని గుర్తించి టార్గెట్‌గా చేసుకుంటారు. వీరిలో ఓ గ్యాంగ్ మెంబర్ తాను తన చేతిలో ఉన్న చిన్న పిల్లను ఎత్తుకోలేకపోతున్నట్లు నటిస్తుంది. ఈ వంకతో తన చేతిలో ఉన్న చిన్నారిని టార్గెట్‌కు ఇస్తారు. ఆమె చుట్టూ చేరి మరింత హడావుడి చేస్తూ బ్యాగ్/పర్సు జిప్ తీసి అందులోని డబ్బు, బంగారం తస్కరిస్తారు. ఆ వెంటనే వచ్చే స్టాప్‌లో చిన్నారులతో సహా అంతా దిగిపోతారు.

**ఇదే మొదటిసారి..**

ఈ ఓజికుప్పం గ్యాంగ్‌ను సిటీలో అరెస్టు చేయడం ఇదే మొదటిసారి. వీళ్ళు ఇప్పటివరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలోని ఆసిఫ్‌నగర్, లంగర్‌హౌస్, హుమాయూన్‌నగర్, ఎస్సార్‌నగర్, సైఫాబాద్, నల్లకుంట, నాంపల్లి, నాచారం, బాలానగర్, హయత్‌నగర్ పోలీసుస్టేషన్ల పరిధుల్లో 13 నేరాలు చేసినట్లు గుర్తించాం. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ నేరాలు చేశారనేది ఆరా తీస్తున్నాం. వీరిని పట్టుకోవడంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ ఆర్జీ శివమారుతి కీలక పాత్ర పోషించారు.

– ఏఆర్ శ్రీనివాస్, వెస్ట్‌జోన్ జేసీపీ




## విధుల్లో చేరిన దిశ తండ్రి

**రాజేంద్రనగర్:** దిశ తండ్రి శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. తన జాయినింగ్ రిపోర్టును ప్రిన్సిపాల్ అంజయ్య కు అందజేశారు. ఆయన ఇంతకుముందు మహబూబ్‌నగర్ కొల్లాపూర్‌లోని రాణి ఇంద్రాదేవి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే వారు. ఆయన బదిలీ కోసం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోగా ప్రభుత్వం రాజేంద్రనగర్ జూనియర్ కళాశాలకు బదిలీ చేసింది.

## సోనియాతో సీతక్క భేటీ

**సాక్షి, న్యూఢిల్లీ:** ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీని అఖిల భారత మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క శుక్రవారం పార్లమెంటులో కలిశారు. తాను ఇన్‌చార్జిగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో మహిళా కాంగ్రెస్ పనితీరును వివరించారు. తెలంగాణకు సంబంధించి పలు రాజకీయ అంశాలను సోనియా దృష్టికి తెచ్చారు. కాగా దేశవ్యాప్తంగా మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో సీతక్క, టీపీసీసీ అధికార ప్రతినిధి ఇందిరా శోభన్, తెలంగాణ మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారత్ బచావోకు తరలిన టీపీసీసీ నేతలు

**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక విధానాలకు నిరసనగా శనివారం ఢిల్లీలో ఏఐసీసీ తలపెట్టిన భారత్ బచావో కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు తరలివెళ్లారు. జాతీయ స్థాయి నేతలు ఇదివరకే ఢిల్లీ చేరుకోగా.. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంతో పాటు జిల్లా స్థాయి నేతలు, నాయకులు, కార్యకర్తలు ఇందులో పాల్గొనేందుకు శుక్రవారమే పయనమయ్యారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ధర్నా ద్వారా వ్యక్తపర్చేందుకు రాష్ట్ర నేతలు సిద్ధమయ్యారు.




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com